ఫిబ్రవరి - 2017

DECCAN LAND, HYDERABAD

₹20

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక





- బాలీవుడ్‌లో భాగ్యనగర్ సౌందర్యరాశి
- తెలంగాణ ఎపిక్ కాపుబిడ్డ
- హైదరాబాద్‌లో ఫెస్టివల్స్ సందడి
- యశ్‌పాల్ పాటకు యశస్సు







Artist: **Nandini Goud**

చిత్రకళలో తనంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకోవడం అంత తేలిక కాదు. ప్రఖ్యాత చిత్రకారుడి కుమార్తెగా తండ్రి ప్రభావం, వారసత్వం కొంత ఉన్నప్పటికీ, తన స్వీయరాణింపుతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సాధించిన చిత్రకారణి నందిని గౌడ్.

ప్రత్యేక కథనం లోపలి పేజీల్లో















































**ఆమె చిత్రాల్లో అచ్చంగా మనమే!**

మన చుట్టూరా ఉండే వాతావరణం మనకు చిత్రాల్లో కన్పిస్తే... ఆ చిత్రాల్లో మనుషులం మనమే అయితే... వాటిల్లోని వస్తువులు మన ఇంట్లోని వాటిని ప్రతిబింబిస్తే ఎలా ఉంటుంది.. వీటికి సమాధానమే నందిని గౌడ్ చిత్రాలు. హైదరాబాద్ నగరం అందించిన తెలంగాణ చిత్రలేఖన రంగ ఆణిముత్యాల్లో ఆమె ఒకరు.

TELANGANA RESOURCE CENTRE

"**CHANDRAM**" 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: deccanlandindia@gmail.com   website : www.deccanland.com







## సాహిత్యానికి పెద్దపీట అభినందనీయం

తెలంగాణ పోరాటానికి, తెలంగాణ సాహిత్యానికి, చరిత్రకు మధ్యగల సంబంధం అవిభాజ్యం. తెలంగాణ సాహిత్యాన్ని, చరిత్రను వెలికితీయడంలో కీలకపాత్ర పోషించిన సుంకిరెడ్డి నారాయణ రెడ్డి గారి వ్యాసాలు ఆసక్తిదాయకంగా వస్తున్నాయి. రచయితకు, వాటిని అందిస్తున్న మీకు అభినందనలు.

**– బి. వేణు, యాదాద్రి జిల్లా**

## సమకాలీన ప్రముఖుల పరిచయాలు

సాధారణంగా సమకాలీన ప్రముఖుల పరిచయాలను అందిస్తున్న పత్రికలు తక్కువగా ఉన్నాయి. ఆయా రంగాల్లోకి కొత్తగా ప్రవేశిస్తున్న వారికి ఈ విధమైన పరిచయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. మరీ ముఖ్యంగా పరిశోధన రంగంలో, మీడియా రంగంలో ఉన్నవారికి. ఈ విధమైన పరిచయ కార్యక్రమాలను కొనసాగించాల్సిన అవసరం ఉంది. సాహితీ, కళారంగాలకు మాత్రమే పరిమితం గాకుండా ఇతర రంగాలకు కూడా దీన్ని విస్తరింపజేస్తే బాగుంటుంది.

**– ఎ. సుకుమార్, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా**

## ఆ బాధ్యతను టీఆర్‌సీ చేపట్టాలి

తెలంగాణ రిసోర్స్ సెంటర్ (టీఆర్‌సీ) ఇటీవల భువనగిరిపై ప్రచురించిన భువనైక సౌందర్యం పుస్తకం ఎంతో బాగుంది. తెలంగాణలో ఇన్నేళ్ళుగా ఎన్నో చారిత్రక, పర్యాటక ప్రాంతాలు వెలుగులోకి రాకుండా పోయాయి. స్వరాష్ట్ర ఆవిర్భావం నేపథ్యంలో అవి ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. వాటికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి తీసుకురావాలంటే వాటికి సంబంధించిన సమాచారం ముందుగా తెలుగువారికి అందాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా చారిత్రక, పర్యాటక ప్రాంతాలపై మరిన్ని పుస్తకాలు రావాలి. ఈ బాధ్యతను టీఆర్‌సీ చేపడితే బాగుంటుంది.

**– బి. శివరామ్‌ప్రసాద్, రంగారెడ్డి జిల్లా**

### కొత్త జిల్లాల సంగ్రహ చరిత్ర వ్యాసాలకు ఆహ్వానం

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన జిల్లాల నేపథ్యంలో జిల్లాల చరిత్రను తిరిగి లిఖించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వివిధ కారణాల వల్ల మరుగున పడిన విశేషాలెన్నో ఈ సందర్భంగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల సంగ్రహ చరిత్రపై వ్యాసాలను దక్కన్‌ల్యాండ్ మాసపత్రికకు పంపించాల్సిందిగా కోరుతున్నాం.

మీ లేఖలను E-mail: deccanlandindia@gmail.comకు పంపించవచ్చు

# న్యాయమూర్తుల సంఖ్య పెంపుపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోండి

### రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచన

రాష్ట్రాల్లో న్యాయమూర్తుల సంఖ్యను జాతీయ న్యాయస్థాన నిర్వహణ వ్యవస్థల సంఘం (ఎన్‌సీఎంఎస్‌సీ) వెలువరించిన మధ్యంతర సూచనలకు అనుగుణంగా లెక్కగట్టాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఖాళీలను భర్తీ చేయడమొక్కటే న్యాయమూర్తుల సంఖ్యను నిర్ధారించడానికి ప్రాతిపదిక కాదని ఎన్‌సీఎంఎస్‌సీ పేర్కొన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు పలు సూచనలు చేసింది. జిల్లా న్యాయవ్యవస్థలో జడ్జీల సంఖ్యను లెక్కగట్టడానికి ఎన్‌సీఎంఎస్‌సీ సమర్పించిన మధ్యంతర నివేదికను కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ.. అన్ని రాష్ట్రాల హైకోర్టులకు, ప్రధాన కార్యదర్శులకు నెల రోజుల్లో పంపించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.ఎస్.ఠాకూర్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ ఎల్.నాగేశ్వర రావుతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.

జిల్లా న్యాయవ్యవస్థకు అవసరమైన జడ్జీల సంఖ్యను లెక్కగట్టేందుకు ప్రాతిపదికను నిర్ధారించడానికి ఎన్‌సీఎంఎస్‌సీ శాస్త్రీయ పద్ధతిని రూపొందించేంత వరకు మధ్యంతర నివేదికలో చేసిన సూచనలు అమలు చేయాలంది. మధ్యంతర నివేదిక అమలుపై రాష్ట్ర ప్రభుత్వాలు హైకోర్టులను సంప్రదించాలని, జడ్జీల సంఖ్యను పెంచడానికి తగిన నిర్ణయాలను మూడు నెలల్లోగా తీసుకోవాలని ఆదేశించింది. రాష్ట్రాల న్యాయవ్యవస్థలకు నిధులను వేగిరంగా అందేలా చూసేందుకు గత ఏడాది ఏప్రిల్‌లో ప్రధాన న్యాయమూర్తులు, ముఖ్యమంత్రుల సంయుక్త సదస్సులో ఆమోదించిన తీర్మానాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు హైకోర్టులకు సహకరించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఎన్‌సీఎంఎస్‌సీ తుది నివేదికను ఈ ఏడాది డిసెంబరు 31లోపు సమర్పించాలని ధర్మాసనం సూచించింది. తుది నివేదికను ప్రధాన న్యాయమూర్తుల సదస్సులో ప్రవేశపెట్టవచ్చుంది.

కేసుల పరిష్కారంలో, ముఖ్యంగా నేర కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యాలు చట్ట బద్ధమైన పాలనపై ప్రభావం చూపించడంతో పాటు ప్రజల ప్రాథమిక హక్కైన న్యాయం పొందడంపైనా ప్రభావం చూపిస్తోందని ధర్మాసనం పేర్కొంది. అన్ని స్థాయిల్లోనూ 2015, డిసెంబరు 21 నాటికి మంజూరయిన న్యాయమూర్తుల సంఖ్య కేవలం 21,067 మాత్రమేనంది. కేసుల పరిష్కార రేటు తక్కువగా ఉండడానికి జడ్జీల పనితీరే కారణం కానక్కర్లేదని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కొరత కారణంగా విచారణలు నిలిచిపోతాయని పేర్కొంది. ప్రభుత్వం, ముఖ్యంగా పోలీసు సిబ్బంది పేర్కొనే సాక్షులు విచారణ తేదీల్లో గైర్హాజరవుతారని, ఫలితంగా జాప్యం చోటు చేసుకుంటుందని చెప్పింది. కేసుల పరిష్కారానికి యూనిట్లను నిర్ధారించేటప్పుడు పాత కేసుల పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇచ్చేలా హైకోర్టులు చూడాలని సుప్రీంకోర్టు సూచించింది. యూనిట్ల నిర్ధారణకు నిబంధనలను సవరించాలంది. ప్రతి రాష్ట్రానికీ ప్రత్యేకమైన అవసరాలుంటాయన్న సంగతిని దృష్టిలో ఉంచుకోవాలంది. ద

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 5 సంచిక : 6 పేజీలు : 60

ఫిబ్రవరి - 2017

సంపాదకులు

**యం. వేదకుమార్**

అసోసియేట్ ఎడిటర్

**ఎన్. వంశీ మోహన్**

సెల్ : 9848902520

లే అవుట్ & కంపోజింగ్

**చరిత ఇంప్రెషన్స్**

కవర్‌పేజీ ముఖచిత్రం

**నందిని గౌడ్ పెయింటింగ్**

వాణిజ్య ప్రకటనలు

**9030626288**

ముద్రణ:

**DECCAN PRESS**

ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 490,

St.No. 12, Himayatnagar,

Hyderabad - 500 029.

Mobile: 9030626288

Fax: 040-27635644

E-mail: deccanlandindia@gmail.com

website : www.deccanland.com


## వార్షిక చందా

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక చందాదారులుగా చేరదల్చుకున్న వారు పై చిరునామాకు రూ. 200 ఎం.ఒ. పంపించవచ్చు. లేదా దక్కన్‌ల్యాండ్ పేరిట డీడీ పంపవచ్చు. చిరునామా, ఫోన్ నెంబర్ వివరాలు స్పష్టంగా తెలియజేయగలరు.

# లోపలి పేజీల్లో...




ప్రపంచస్థాయిలో హైదరాబాద్ ఐదో నగరం .......... మోహన్ .......... 8

తెలంగాణ ఆధునిక ఎపిక్ 'కాపుబిడ్డ' .......... సుంకిరెడ్డి నారాయణరెడ్డి .......... 9

అందమైన మట్టి గాజులు .......... వెంకట్ .......... 14

సాహిత్య కళారంగాల పట్ల చిన్నచూపా .......... ప్రొ.జయధీర్ తిరుమలరావు .......... 15

యశస్సును సాధించిన యష్‌పాల్ పాట .......... అంబటి వేకువ .......... 17

మూసీతీరంలో సీఎంసీ వాతావరణ్-2017 .......... కట్టా ప్రభాకర్ .......... 21

రాష్ట్రంలో కొరియన్ ఇండస్ట్రియల్ పార్కు .......... దక్కన్ న్యూస్ .......... 23

సదాశయం కోసం కళ అమితా తల్వార్! .......... రాజేశ్ .......... 25

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ .......... దక్కన్ న్యూస్ .......... 28

రీ డిస్కవరింగ్ తెలంగాణ .......... సృజన్ .......... 29

నాగోబా జాతరలో దర్బార్ .......... దక్కన్ న్యూస్ .......... 33

గర్వభంగం .......... బాలచెలిమి .......... 34

విభిన్న చిత్రశైలితో నందిని గౌడ్ .......... కిరణ్ .......... 35

దృశ్య కావ్యం (డాక్యుమెంటరీ రివ్యూ) .......... కె. విమల .......... 37

కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ .......... డాక్టర్ తెలుగు యాదేశ్ పుట్ట .......... 42

నాటక కళతో సాంస్కృతిక వంతెన .......... డా॥ కుమారస్వామి .......... 45

సంగీతమే మహాధనం .......... డా॥ సామల సదాశివ .......... 47

తెలంగాణ సినిమాకు తొలి చరిత్రకారుడు .......... వంశీ .......... 49

బాలీవుడ్‌లో భాగ్యనగర్ సౌందర్యరాశి .......... హెచ్.రమేష్‌బాబు .......... 51

కలెబడె కవి అలిశెట్టి .......... సంగిశెట్టి శ్రీనివాస్ .......... 53

కాలం కన్నుల్లోంచి రాలిన సిరాచుక్కలు .......... డా.ఎస్.రఘు .......... 56

పుస్తకం .......... దక్కన్ న్యూస్ .......... 58


'దక్కన్ ల్యాండ్'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను ప్రజాస్వామిక అభిప్రాయ వేదికగా, ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, సమస్యలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే 'దక్కన్ ల్యాండ్' లక్ష్యం.

తెలుసుకొందాం..!

# దివ్యాంగులకు పథకాలు

దివ్యాంగులకు అన్ని రంగాల్లో చేయూతనందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుంది. ఇందులో ముఖ్యం గా ఆరు పథకాలు నేరుగా దివ్యాంగులకు నేరుగా లబ్ధి చేకూర్చేవిగా ఉన్నాయి. చదువుకు ప్రతి నెల స్కాలర్‌షిప్‌లు, ఉన్నత చదువులకు పూర్తి ఫీజు మాఫీ, పెళ్లికి కల్యాణ లక్ష్మి పథకం కింద రూ. 50 వేల ఆర్థిక సాయం, స్వయం ఉపాధికి 50శాతం సబ్సిడీతో కూడిన రుణాలు తదితరాలున్నాయి. పారదర్శకతలో భాగంగా ఈ ఆరు పథకాల్లోను ప్రభుత్వ సాయం నేరుగా అర్హుల బ్యాంకు ఖాతాలోనే జమ అవుతుంది.

## ప్రతినెల ప్రి మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు...

ఒకటి నుంచి 10వ తరగతి దివ్యాంగులైన పిల్లలకు ప్రి మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను అందిస్తారు. ఇందులో 1వ తరగతి నుంచి ఐదో తరగతి చదివే పిల్లలకు రూ.70చొప్పున, ఆరో తరగతి నుంచి 8వ తరగతి వరకు చదివే పిల్లలకు రూ.100, తొమ్మిదో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు రూ.182ను ప్రతి నెల (ఏడాదిలో 12 నెలలు) అందిస్తారు.

దివ్యాంగులైన వారి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్ష లోపు ఉన్నట్లైతేనే ఈ పథకం వర్తిస్తుంది. అర్హులైన పిల్లలు తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తు చేసు కోవాలి. సదరు ప్రధానోపాధ్యాయుడి ద్వారా జిల్లా స్త్రీ శిశు వికలాంగుల వయోవృద్ధుల సంక్షే మ శాఖ అధికారికి అందించాలి. అధికారులు అర్హులను గుర్తించి ప్రధానోపాధ్యాయుని ద్వారా ప్రతినెల స్కాలర్‌షిప్‌లను అందిస్తారు.

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు...

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు చెల్లించినట్లుగానే ఇంటర్ చదువుతున్న వికలాంగులకు ప్రభుత్వం కాలేజ్ ఫీజును స్కాలర్‌షిప్ రూపంలో అందిస్తుంది. దివ్యాంగుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షలోపు ఉన్నట్లైతేనే ఈ పథకం వర్తిస్తుంది. దరఖాస్తును కాలేజ్ ప్రిన్సిపాల్ పరిశీలించి ఆన్‌లైన్‌లో జిల్లా వికలాంగుల సంక్షేమ అధి కారికి అందిస్తారు. అభ్యర్థుల అర్హతల మేరకు ప్రభుత్వం వికలాంగ విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా డబ్బులను జమ చేస్తుంది.

## ఫీజు మాఫీ పథకం...

వృత్తి విద్య, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం 100శాతం ఫీజు మాఫీ చేస్తుంది. స్కాలర్‌షిప్ దరఖాస్తును సంబం ధిత కాలేజ్ ప్రిన్సిపాల్ ద్వారా ఆన్‌లైన్‌లో జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారికి అందిస్తారు. అభ్యర్థుల అర్హతల మేరకు ప్రభుత్వం ఫీజును మాఫీ చేస్తుంది.

## ఆర్థిక సాయం పథకం...

21 నుంచి 40 సంవత్సరాల్లోపు వికలాంగ అభ్యర్థులు రూ. 2లక్షల వరకు వికలాంగుల సంక్షేమ శాఖ నుంచి బ్యాంకు ద్వారా రుణం పొందవచ్చు. ఇందులో ప్రభుత్వం 50శాతం సబ్సిడీని ఇ స్తుంది. అంటే అర్హులు కేవలం రూ.లక్ష మాత్రమే తిరిగి బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుది. ఈ పథకంలో అర్హుల ఎంపికకు మండల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేస్తారు. కమిటీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి రుణం జారీ చేస్తారు.

## వివాహ ప్రోత్సాహక నగదు బహుమతి పథకం...

వికలాంగులైన యువతీ యువకులు సాధారణ యువతీ యు వకులను పెళ్లి చేసుకుంటే ఈ పథకం కింద అర్హులుగా గుర్తిస్తారు. వీరికి కల్యాణ లక్ష్మి పథకంలో ఇచ్చినట్లుగానే జంటకు రూ.50 వేలను ఉచితంగా అందిస్తారు. దరఖాస్తుదారులు తమ పెళ్లి ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలను జత చేస్తు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తును మళ్లీ స్థానిక తహసీల్దార్ విచారణ చేసి ఫైల్‌ను కలెక్టర్‌కు అందిస్తారు. ఈ ఫైల్‌కు కలెక్టర్ ఆమోదం తెలిపిన వెంటనే వీరికి రూ.50వేలను బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

## సహాయ ఉపకరణాల పథకం...

ట్రై సైకిల్, వీల్‌చైర్స్, ఊత కర్రలు, చెవి మిషన్‌లు, పెట్టుడు అవయవాలు, బ్రెయిలీ పలకలు, లాప్‌టాప్స్, మోటారు యంత్రాలు, ఎంపీ 3 ప్లేయర్స్‌ను అవసరం ఉన్న వికలాంగులకు వాటిని తెలం గాణ వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ద్వారా అందిస్తారు. ఇందుకు అర్హులైన దరఖాస్తుదారులు 3 ఫొటోలను, అంగ వైకల్య ధ్రువీకరణ పత్రాలు, డాక్టర్ సర్టిఫికెట్, కుటుంబ వార్షికాదాయ సర్టిఫికెట్, రేషన్ కార్డును జత చేసి జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థుల అవసరం, అర్హతలను బట్టి వాటిని ఉచితంగా అందిస్తారు. ద

DECCAN tv
Voice of Telangana
Watch On Hathway Network, Channel No.70

# పర్యావరణాన్ని పట్టించుకుందాం!




జనవరి నెలలో రాజధాని నగరంలో సీఎంఎస్ – వాతావరణ్ 2017, దానిలో భాగంగా మూసీ రివర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, పర్యావరణ సంబంధిత చిత్రాల ప్రదర్శన, హెరిటేజ్ వాక్ జరిగాయి. షామ్ –ఎ– మూసి, కైట్ ఫెస్టివల్ సందడి చోటు చేసుకుంది. లిటరరీ ఫెస్టివల్ కూడా జరిగింది. తెలంగాణను పునరావిష్కరించుకోవడంలో భాగంగా ఆర్కియాలజీ సదస్సు కూడా నిర్వహించారు. వీటికి తోడుగా విశ్వనగరాల్లో హైదరాబాద్‌కు ఐదో స్థానం దక్కింది.

వీటన్నింటినీ వేటికవే చూస్తే ఒకదానికొకటి సంబంధం లేనివిగా కనిపిస్తాయి. పరిశీలించి చూస్తే మాత్రం ఒకదానికి ఒకటి అనుబంధం కలిగి ఉన్నట్లుగా స్పష్టమవుతుంది.

ఒకప్పుడు నదుల తీరంలోనే నాగరికతలు విలసిల్లాయి. ఇప్పుడు కూడా నదుల తీరంలోనే ప్రఖ్యాత నగరాలు వర్ధిల్లుతున్నాయి. కాకపోతే… ఈ నదులు ఇప్పుడు నగర వ్యర్థాలతో కలుషితమవుతున్నాయి.

మూసీ నది ఒడ్డున వెలిసిన హైదరాబాద్ నగరం వందల ఏళ్ళ పాటు ఆ నది అందించిన వివిధ ప్రయోజనాలను అనుభవించింది. ఒక ఆరు దశాబ్దాల కాలంలో పరిస్థితి తలకిందులైంది. ఒకప్పుడు నగరానికి తాగునీటిని అందించింది మూసీ నది. అలాంటి మూసీని నగరం తన కలుషితాలతో నింపేసింది. మురికినీటితో నిండిన మూసీని ప్రక్షాళన చేసుకోవాల్సిన సమయం ఇప్పుడు మరింతగా ముంచుకొచ్చింది. నది బాగుంటేనే నదీ తీరం బాగుంటుంది. ఒడ్డున ఉండే నగరంలో జరిగే వేడుకలు ఆహ్లాదభరితంగా ఉంటాయి. ప్రజల జీవితాలు ఆనందమయంగా గడుస్తాయి.

హైదరాబాద్ నగరం విశ్వనగరంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంలో మూసీ నది కీలకపాత్ర పోషించనుంది. అదే విధంగా నగర అభివృద్ధిలో వారసత్వ కట్టడాలు ప్రధాన పాత్ర వహించనున్నాయి. రేపటి నాడు నిర్మాణాలకు చారిత్రక హోదాను అందించేది ఈ కట్టడాలే. అందుకే నదిని, చారిత్రక ప్రాధాన్యపూరిత వారసత్వ కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. అదే సమయంలో గత రెండేళ్ళుగా తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో బయట పడుతున్న పురాతన చరిత్రలు తెలంగాణ గత చరిత్రను కొత్త మలుపులు తిప్పుతున్నాయి. ఘన చరితను అందిస్తున్నాయి. ఆ నాటి చరిత్ర పునాదులపై మన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు గాను ఆ నాటి ఆధారాలను కాపాడుకోవాలి.

ఈ నేపథ్యంలో నదీతీర నగరవాసుల్లో జలవనరులు, పర్యావరణంపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా మూసీ రివర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ తదితర కార్యక్రమాలను సీఎంఎస్ వాతావరణ్, చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ (తెలంగాణ), దక్కన్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించాయి. పాఠశాల విద్యార్థులు, నగరవాసుల నుంచి ఈ కార్యక్రమానికి చక్కటి స్పందన లభించింది.

నది, నగరం, వారసత్వం, ప్రాచీన నాగరికత, వినోదం, సాహిత్యం, సంస్కృతి… ఇవన్నీ ఒకదానికొకటి ముడిపడి ఉన్న అంశాలే. దేని ప్రాధాన్యం దానికి ఉంటుంది. వాటిని దృష్టిలో ఉంచుకొని పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ముందుకు సాగితేనే విశ్వనగరంగా హైదరాబాద్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకోగలగుతుంది. ఆ దిశలో మన పయనం సాగాలని కోరుకుందాం.

వేదకుమార్.యం

(యం. వేదకుమార్)

ఎడిటర్

# ప్రపంచస్థాయిలో హైదరాబాద్ ఐదో నగరం



ప్రపంచంలోని టాప్ 30 డైనమిక్ నగరాల్లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఐదో స్థానాన్ని దక్కించుకుంది. ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల సందర్భంగా జేఎల్ఎల్ కన్సల్టెన్సీ తన వార్షిక నగర పురోగతి సూచీ (సీఎంఐ)లో ఈ విషయాన్ని వెల్లడించింది. మొదటిస్థానంలో భారతదేశ ఐటీ రాజధానిగా వెలుగొందుతున్న బెంగళూరు నిలువడం విశేషం.

హైదరాబాద్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. ప్రపంచంలోని అత్యంత క్రియాశీల నగరాల్లో హైదరాబాద్‌కు ఐదో స్థానం దక్కింది. మొదటిస్థానాన్ని భారత సాఫ్ట్‌వేర్ కేంద్రం బెంగళూరు చేజిక్కించుకోవడం విశేషం. జనాభా, కనెక్టివిటీ, టెక్నాలజీ, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, విద్య, ఆర్థిక ఫలితాలు, కార్పొరేట్ సంస్థల కార్యకలాపాలు, నిర్మాణం, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, ఆస్తుల విలువ వంటి 42 అంశాలను ఆధారం చేసుకుని జేఎల్ఎల్ కన్సల్టెన్సీ తన వార్షిక నగరాల పురోగతి సూచిక (సీఎంఐ)ను విడుదల చేసింది. ఇందులో రెండో స్థానాన్ని వియత్నాంలోని హోచిమిన్ సిటీ సాధించింది. మూడో స్థానంలో అమెరికాలోని సిలికాన్ వ్యాలీ, నాలుగో స్థానంలో చైనాలోని షాంఘై నిలిచాయి. లండన్ (బ్రిటన్), హనోయ్ (వియత్నాం), ఆస్టిన్ (అమెరికా), బోస్టన్ (అమెరికా), నైరోబీ (కెన్యా) తదుపరి స్థానాలు పొందాయి.




**టాప్ 30లో సగానికిపైగా ఆసియా పసిఫిక్ దేశాలే**

అత్యంత క్రియాశీల నగరాలు యావత్ ప్రపంచ దేశాల్లో విస్తరించి ఉన్నప్పటికీ.. టాప్ 30 నగరాల్లో సగానికిపైగా నగరాలు ఆసియా పసిఫిక్ దేశాలు కావడం గమనార్హం. ఇందులోనూ భారతదేశపు సాఫ్ట్‌వేర్ రాజధానిగా పేరొందిన బెంగళూరు ప్రథమ స్థానంలో నిలువడం విశేషం. వాస్తవానికి ఒకప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలు చైనాలో ఉండేవి. కానీ.. ఆ సంప్ర దాయాన్ని భారత్ చేజిక్కించుకున్నట్టు ఉందని సీఎంఐ తన నివేదికలో వ్యాఖ్యానించింది. టాప్ 30 నగరాల్లో భారత్‌కు చెందిన నగరాలు ఆరు ఉంటే.. చైనా నగరాలు ఐదే ఉండటం ఇందుకు నిదర్శనమని పేర్కొంది. ఈ నగరాలు పకడ్బందీ నెట్‌వర్క్‌లో ఉండి.. జాతీయ ఆర్థిక వ్యవస్థల కంటే మెరుగైన సేవలు అందిస్తున్నాయని తెలిపింది.

విద్య, పరిశోధన, మౌలిక సదుపాయల రంగంలో పెట్టుబడు లు, నివసించేందుకు అనుకూల పరిస్థితులు, ప్రతిభను ఆకర్షించడం, పర్యావరణం తదితరాలు కూడా ఈ సూచీలో నగరాలు తమ స్థానాలు సంపాదించుకునేందుకు దోహదం చేశాయని నివేదిక వెల్లడించింది. ఢిల్లీ (23వ స్థానం), బీజింగ్ (15వ స్థానం) తీవ్ర పర్యావరణ సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. ఇతర రంగాల్లోని పాయింట్ల ఆధారంగా క్రియాశీల నగరాల జాబితాలో చోటు సంపాదించాయని తెలిపింది. ఈ జాబితాలో లండన్, షాంఘై, సిలికాన్ వ్యాలీ నగరాలు మాత్రమే 2014 నుంచి టాప్ టెన్‌లో కొనసాగుతున్నాయి.

మొత్తం 134 నగరాలు, మెట్రోపాలిటన్ ప్రాంతాలను 42 అంశాల ప్రాతిపదికగా పరిశీలించారు. ఈ సారి టాప్ 30లో ఆసియా-పసిఫిక్ దేశాలు అధిక సంఖ్యలో చోటు సంపాదించడం విశేషం.

– మోహన్ ద

## విశ్వనగరం వైపు అడుగులు..

హైదరాబాద్ ప్రపంచ నగరంగా అభివృద్ధి చెందడానికి పరుగులు పెడుతున్నదనేందుకు ఇదే నిదర్శనం. దేశంలో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా తగ్గుముఖం పట్టినా హైదరాబాద్‌లో మాత్రం సానుకూలంగానే ఉంది. నలభైయేళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, పెరగనున్న 50 లక్షల జనాభాకు అనుగుణంగా హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నది. ఐదో ర్యాంకు వచ్చిందని పొంగిపోకుండా.. మరింత మెరుగైన ర్యాంకు వచ్చేలా మనం కృషి చేయాలి. మా బాధ్యత కూడా పెరిగింది.

**– బొంతు రామ్మోహన్, నగర మేయర్**

## 2017లో నంబర్ వన్ స్థానం మనదే

వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో మోస్ట్ డైనమిక్ సిటీగా హైదరాబాద్‌కు ఐదో ర్యాంకు రావడం స్వాగతించాల్సిన విషయం. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో ఈ అవార్డు రావడం హర్షణీయం.

**– జనార్దన్‌రెడ్డి, కమిషనర్, జీహెచ్ఎంసీ**

## రెండున్నరేండ్ల కృషికి ఫలితం..

రెండున్నరేండ్ల నుంచి వివిధ రంగాలను అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నది. టీఎస్-ఐపాస్ వంటి విప్లవాత్మకమైన విధానాలు, పాలనా సంస్కరణలు, దేశ, విదేశీ పెట్టుబడులను నగరానికి రప్పించడానికి మంత్రి కేటీఆర్ చేస్తున్న విశేష కృషి.. ఇలా అనేక అంశాల కారణంగా హైదరాబాద్‌కి ప్రపంచ గుర్తింపు రావడం ఆనందించాల్సిన విషయం.

**– చిరంజీవులు, కమిషనర్, హెచ్ఎండీఏ**

# తెలంగాణ ఆధునిక EPIC 'కాపుబిడ్డ'

తెలంగాణ ఆధునిక సాహిత్య హారంలో ధగద్ధమాయంగా మెరిసే మణిపూస గంగులశాయిరెడ్డి 'కాపు బిడ్డ'. ఆధునిక ప్రజాస్వామిక చైతన్యానికి పతాక 'కాపు బిడ్డ'. ఆనాటి గ్రామీణ సమాజాన్ని మైక్రోస్కోపిక్‌గా చిత్రించిన EPIC, గొప్ప సాంఘిక కావ్యం కాపుబిడ్డ. రైతుల ఆత్మగౌరవ ప్రతీక 'కాపుబిడ్డ'.

1935-1945 కాలం నాటి తెలంగాణ సమాజాన్ని వట్టికోట ఆళ్వారుస్వామి నవలలు చిత్రిస్తే 1935కు ముందు నాటి సమాజాన్ని కాపుబిడ్డ చిత్రికపట్టింది. 'కాపుబిడ్డ'లోని కొన్ని పద్యాలు 27-8-1927 నాటి గోలకొండ పత్రికలో ఉండటాన్ని బట్టి 1928 ఆగస్టు 27, 28 తేదీలలో నల్లగొండలో జరిగిన తొలి? వ్యవసాయకుల సభకు గంగులశాయిరెడ్డి హాజరుకావడాన్ని బట్టి (చూ- నిజాం రాష్ట్రాంధ్ర సభలు-1 కుర్రా జితేంద్రబాబు - పుట 83) ఆయనకు 1927కు ముందు నుంచే రైతుల సమస్యలమీద దృష్టి ఉన్నదని అర్థమవుతుంది. అందువల్ల ఆనాటి నుంచే 'కాపు బిడ్డ' కావ్యరచనకు ఉపక్రమించినాడని భావించవచ్చు. 1934 నాటి గోలకొండ కవుల సంచికలో 'కాపు బిడ్డ' లోని కొన్ని పద్యాలు ఉన్నవి. 1934లో ఖమ్మంలో జరిగిన 3వ ఆంధ్రమహాసభలో శాయిరెడ్డి ఈ కావ్యంలోని కొన్ని పద్యాలు చదివినాడు (జితేంద్రబాబు-1 పుట 563-565). దీనిని బట్టి 1934 దాకా ఆయన ఆ కావ్యాన్ని రాస్తున్నాడని తెలుస్తుంది. మే 1937 (కట్టమంచి వారి సందేశ తేదీ)కు ముందే ఈ కావ్య రచన పూర్తయి 1937లో తొలి ముద్రణ పొందింది. దీన్నంతటిని గమనిస్తే స్థూలంగా 1925-1935 కాలం తెలంగాణ సమాజాన్ని, ముఖ్యంగా రైతాంగ జీవితాన్ని ఆనాటి చైతన్యాన్ని చిత్రించినాడని చెప్పొచ్చు.




వట్టికోట తన నవలలను కథా కాలం (1934-45) నాడు కాక అనంతర కాలంలో (1946-61) రచించినాడు. వట్టికోట జ్ఞాపకాల మీద ఆధారపడి రాసినాడు. కథాకాలం అనంతరం పొందిన చైతన్యంతో రాసినాడు. శాయిరెడ్డి కథా కాలం నాడే అప్పటి చైతన్యంతోనే రాసినాడు. రెండు విభిన్న ప్రక్రియలను పోల్చడమెందుకంటే "కాపుబిడ్డ' కావ్య వస్తువు సాధికారికతని చెప్పడానికి.

స్థానిక గ్రంథాలయ వార్షికోత్సవ సభ, సంఘ సంస్కార సభ, వర్తకుల సభలతో పాటు తొలి వ్యవసాయకుల సభ 1928 ఆగస్టు 27, 28 తేదీలలో నల్లగొండలో జరిగింది. ఈ సభకు పండిత కేశవరావు అధ్యక్షత వహించినారు. (కె.జితేంద్రబాబు - పుట 82, 83). 1929 ఫిబ్రవరి 24, 25 తేదీలలో నల్లగొండ జిల్లా తిప్పర్తిలో సంఘసంస్కార సభ, స్థానిక గ్రంథాలయ సభ, వర్తక సంఘం, భజన సమాజ సభలతో పాటు రైతుల సభ జరిగింది. ఈ సభకు సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించినాడు. ఈ సభలలో చేసిన ఆరు తీర్మానాలలో రెండు రైతులకు సంబంధించినవి. అవి 1) రైతు సంఘమును తిప్పర్తిలో స్థాపించుట. 2) వ్యవసాయ విద్యలను దేశభాషలలో నేర్పుటకు పాఠశాలలను ఏర్పాటు చేయుటను గూర్చి (కె. జితేంద్రబాబు - పు 83, 84).

రైతుల సమస్యల గురించి తీర్మానం చేయడం బహుశా ఇదే మొదటి సారేమో. తొలి ఆంధ్రమహాసభ (1930 జోగిపేట)లో చేసిన తీర్మానాలలో 12వ తీర్మానం రైతులకు సంబంధించింది. అది "నల్లగొండ కొన్ని స్థలములందు (పైన ప్రస్తావించిన సభలు కావచ్చు). జరిగిన విధముననే దేశమునందెల్ల రైతు సంఘముల స్థాపించి వారి యోగ క్షేమమునకై తగిన విధమున యత్నించుటకు ఈ మహాసభవారు దేశములోని విద్యాధిక వర్గమును ప్రార్థించుచున్నారు".

1931లో బీరార్‌లో జరిగిన హైదరాబాద్ రాష్ట్ర 4వ రాజకీయసభ 8వ తీర్మానం రైతుల దుర్భర స్థితిని తెలిపింది. భూమిశిస్తు వసూలు కోసం ఆస్తులను గుంజుకోవటాన్ని గర్హించింది. వసూలు పద్ధతి న్యాయసమ్మతంగా లేదన్నది.

రెండవ ఆంధ్రమహాసభ (దేవరకొండ-1931)లో 17వ తీర్మానంలో రైతులు వర్తకుల వలెనే సంఘాలను స్థాపించుకొని తమ కష్టములను నివారించుకోవాలని తీర్మానించింది. 22వ తీర్మానంలో హెచ్చించిన పన్నులను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరింది. ప్రపంచ వ్యాపార క్షీణత వలన ధాన్యపు ధరలు తగ్గినందువల్ల రైతులు భూమ్యాదాయ పన్నులు చెల్లించటానికి చాలా కష్ట పడుతున్నారని ఈ విషయాల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని తీర్మానించింది.

(ప్రపంచ వ్యాపార క్షీణత.. అనే పదం ఆనాటి ప్రపంచ ఆర్థికమాంద్య ప్రభావం తెలంగాణ రైతులపై పడటాన్ని సూచిస్తున్నది).

3వ ఆంధ్రమహాసభ (1934-ఖమ్మం)లో "తెలంగాణ రైతుల"ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇదే తీరుగా ఇంకా ఎక్కువ స్వరంతో 4వ, 5వ, 6వ మహాసభల్లో రైతుల గురించి తీర్మానాలు చేసింౘ్రు. డిమాండ్ చేసే స్థితి కూడా వచ్చింది.

ఈ క్రమాన్ని పరిశీలిస్తే రైతుల్లో కదలిక శాయిరెడ్డి కావ్య రచన సమాంతరంగా పరస్పర ప్రభావంతో నడిచిందని అర్థమవుతుంది. అయితే సామాజిక ప్రభావం కవిమీద ఉంటుందనేది అందరూ అంగీకరించేదే. కాని కవి ప్రభావం సమాజం మీద ఉంటుందనే విషయంలో చాలా మందికి సందేహాలున్నవి. సాధారణ స్థాయిలో ఉంటుంది. కాని నిర్దిష్టంగా ఉంటుందా అని చాలా మంది సందేహం.

ఈ సందేహాన్ని శాయిరెడ్డి పటాపంచలు చేసిండు. రైతుల సభ ఏదీ జరుగకముందే ఆయన రైతుల మీద పద్యాలు 1927లో రాసిండు (పైన పేర్కొన్న). ఆంధ్ర మహాసభలో ఆయన పద్యాలు చదివిండు. అంటే ఆ రకంగా రైతులను చైతన్య పరిచిండు. ఈ రకంగా గంగుల శాయిరెడ్డిది ఎంత ముందు చూపో అర్థమవుతుంది. ఈ ముందు చూపునే క్రాంత దర్శిత్వం అంటారు. ఆ ప్రభావం తర్వాతి కవుల మీద ఉంటె ట్రెండ్ సెట్టర్ అంటారు. ఆ ప్రభావం విస్తృతంగా, గాఢంగా, లోతుగా, సుదీర్ఘ కాలం ఉంటే యుగకర్త అంటారు. శాయిరెడ్డి యుగకర్త కాదుగాని ట్రెండ్ సెట్టర్ అని నిర్ధారించవచ్చు. ఎలా అంటే ఆయన రాసిన తర్వాత రైతుల సమస్యల మీద చాలా మంది కవులు (మంత్రి ప్రగడ వెంకటేశ్వరరావు, జంగా హనుమయ్య చౌదరి, వానమామలై జగన్నాథాచార్యులు, బోయినేపల్లి విశ్వనాథరావు, పొట్లపల్లి రామారావు, కాళోజీ, గవ్వా మురహరిరెడ్డి, దాశరథి రైతుల గురించి కవిత్వం రాసిండ్రు.

రైతు కావ్యవస్తువు కావడం, రైతు... సాహిత్యంలో ఎన్నడూ లేదు. అయితే గతంలో శూద్రుడైన రైతు కావ్య నాయకుడు ఎలా అయ్యిండు? రైతుకు ఈ కావ్య గౌరవం ఎలా లభించింది?




సాలార్జంగ్ సంస్కరణల ఫలితంగా భూసర్వే చేయించి రైతులకు పట్టాలిచ్చినారు. "సేద్య చంద్రిక" పత్రికను పెట్టి ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేసినారు. కో-ఆపరేటివ్ శాఖను ఏర్పరచినారు. 1907లో 'భూముల నవీకరణ సేద్యపు చట్టాన్ని తెచ్చి బావుల కింద సేద్యాన్ని పెంచినారు. ఫలితంగా మధ్యతరగతి రైతు ఆవిర్భవించిండు. ఆధునిక విద్య వల్ల, రెడ్డి హాస్టల్ స్థాపనవల్ల ఆ మధ్యతరగతి రైతు ఆధునిక చైతన్యాన్ని పొందిండు. మధ్యతరగతి రైతుల నుండి విద్యావంతులు వచ్చిండ్రు. వీటన్నిటి ఫలితంగానే రైతు కావ్య నాయకుడయ్యే పరిస్థితి, రైతు గురించి కవిత్వ రాసే పరిస్థితి వచ్చింది. వీటి ఫలితమే 'కాపుబిడ్డ'.

కవి రైతును ఇక్కడ కేవలం కులంగా చూడడం లేదు.

**"పిచ్చికుంటియు రెడ్డి! వీరుల గోత్రముల్**
**పాడును మీ యింటి! వాడనను చు" (పద్యం-98)**
**"ఆది శ్రీశైల దేవాంశచే మైలారు**
**డాదిరెడ్డికి బుట్టె ననెడిమాట...**
**యన్ముల బయిరెడ్డి యాచక దానంబు.."** (పద్యం -10)
**"మెతుకు సంస్థానము మేటి శూరుల కథల్..**
**దోమకొండాధీశు దొడ్డ కీరితి నెంచి..**
**గద్వాల ప్రభువుల ఘనతను బాపలు..**
**పండితులు నాయకులు పాడుచుండ.."** (పద్యం-103)
**"నీజాతి వారలు రాజులైయుండియు**
**కనజాలరైరి నీ కష్టమెల్ల.."** (పద్యం-114)
**"కర్షకా నీ వారలు గ్రామాధికారులై**
**దొరలయి అరిగొంచు దొడ్డలైరి.."** (పద్యం-130)

మొదలైన పద్యాలను బట్టి ఇది కేవలం ఇది రెడ్ల గురించిన కావ్యమని అనిపిస్తుంది. కాని ఇది రెడ్లలోని సామాన్య రైతుల గురించే కాక వ్యవసాయం చేసె అన్ని కులాల రైతు గురించి రాసిందని కావ్యాన్ని మొత్తంగా చదివితే అర్థమవుతుంది.

**"దొరలును కరణాలు దోపిడి చేయగా**
**పుస్తె మట్టెల మాడ్చి బొగులువారు"** (ప-109)
**"గొల్లల బెదరించి కొట్టుచు పగలెల్ల**
**గొఱ్ఱెమేకల గెంటు గొప్పదొరలు**
**యెల్ల కాలంబు రేయెల్లను మందల**
**తమవద్ద నుంచెడి దండి దొరలు**
**కంచెలో నున్నట్టి కంపకట్టెల ముట్ట**
**బిఱ్ఱుచే కొట్టెడి పెద్ద దొరలు**
**యూరిలో నందరి సొరమౌ పెంటల**
**సొంత నేలల జేర్చు సొగసు దొరలు**
**హాలికుల ప్రతివస్తువు లడుగకుండ**
**తీసికొని వెళ్ళు చుండెడి దిట్ట దొరలు**
**యోర్వు మాలిన పనులెల్ల నేర్పు దొరలు**
**సైరికా! వారితో నీకు చనవు వొలదు"** - (పద్యం -138)

అనే పద్యాలను బట్టి రెడ్లలోని, ఇతర కులాల లోని దొరలకు కూడా వ్యవసాయమే వృత్తి అయినప్పటికీ వారిని కవి వేరు చేసి చూపిండని పైగా వారిని వ్యతిరేకించడని అర్థమవుతుంది. తర్వాతి కాలంలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటంలో అన్ని కులాల దొరల మీద అన్ని కులాల రైతులు పోరాటం చేయనున్న విషయాన్ని ఎంతో ముందు చూపుతో సూచించిన శాయిరెడ్డి క్రాంతదర్శిత్వాన్ని, ఎంతో వాస్తవికంగా కావ్యరచనను సాగించిన నిష్పాక్షిక దృష్టిని ప్రశంసించకుండా ఉండలేము.

1945 నాటి లెక్కల ప్రకారం వరంగల్ జిల్లాలో
100 నుండి 500 ఎకరాలు గల భూస్వాములు 4.15%
5 నుండి 10 ఎకరాలు గల పట్టాదార్లు 60.21%
అసలు భూమిలేనివాళ్లు, కౌలుదార్లు 35.00%

కొంత అటుఇటుగా తెలంగాణ అంతటా ఇదే పరిస్థితి ఉండి ఉండవచ్చు. ఆ లెక్కన అయిదారుశాతం గల భూస్వాములకు వ్యతిరేకంగా 90శాతానికి పైన ఉన్న మధ్యతరగతి రైతులు, చిన్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయకూలీలు, వృత్తిపనివాళ్ళు పోరాటం చేశారని అర్థమవుతుంది. ఆ సామాన్య రైతు గురించే (కొన్ని చోట్ల ధనిక రైతు గురించి కూడా) ఈ కావ్యం రాసిండని, (అనంతర కాల పోరాట పూర్వరంగాన్ని ఈ కావ్యంలో చిత్రించిండని) కింది పద్యాలను బట్టి తెలుస్తుంది.

**"జాగీరు పౌరులు స్థానంబులేకను**
**పరుల పంచలజేరి బ్రదుకు నేడు**
**యగ్రహార నివాసి హక్కుల గోల్పోయి**
**యొరులొద్ద జేరియు నొదుగునేడు**
**బంజర రైతులు బాటలు గానక**
**దశదిశలం జూచి తాఱునేడు**
**కౌలుదారులు పెక్కు కడగండ్ల గుడుచుచు**
**స్థిరము గుర్తెఱుగక దిరుగునేడు**
**పల్లెయందున్న పైరుల నిల్లువిడిచి**
**గొఱ్ఱె మేకల నావుల కుదువ బెట్టి**
**యాలు పిల్లలచే కుందినణిగె నేడు"** (పద్యం - 126)
**"బనచరాయని నాపి వంచనచే పసి**
**మేపినారని నింద మోపువారు**
**పాడు పోరంబోకు బీడు నేలల సాగు**
**చేసినారని వ్రాసి చెఱుపువారు**
**దాపునంబరు హద్దు దాటినారని వ్రాసి**
**యానేల పన్నును నంటువారు**
**చెట్టుగొట్టుట మీల పట్టుట మొదలగు**
**వట్టి తప్పులు మెడగట్టువారు**
**అదియు నిదియని జెప్పగా నలవిగాదు**
**నూరి లందులు పగబట్టి యురులవెట్ట**
**హాలికులు పెట్టు మొఱలెల్ల నడవి యేడ్పు"**
(ప-12)
**"జాతిమతములు లేనట్టి సాధువగుచు**
**విశ్వమంతట వ్యాపించి వెలసినావు**
**కర్షకా చేతులెత్తినే గౌరవింతు"** (ప-22)
**"కుడి మూపుపై కాడి యెడమ బుజంబున**
**వెలగడ నాగలి తలకు నూని**
**నెత్తిపై గడ్డిని ఎత్తి కట్టును బూన**
**బక్క గిత్తలు ముందు పాఱుచుండ"** (ప-45)
**"మోకాళ్ళ మీదికి ముతక దోవతి జెక్కి"** (ప-46)
**"ఆలగేదెల దూడలన్నిటి వద్దను**
**పాలుదీయుచు పాలుపిండిటీవు"** (ప-68)
**"అద్దమరేతిరి యెద్దుల చేబట్టి**
**మోటగొట్టుచు పాడు - పాటనొకడు"** (ప-85)
**"కప్పుకొనజాలు బట్టల కలిమి లేదు"** (ప-87)

వ్యవసాయవృత్తి ఎప్పుడూ ఏ ఒక్క కులానికి మాత్రమే పరిమితం కాలేదు. కులపరిమితి లేని, కులపరిధిని అధిగమించిన వృత్తి అది ఒక్కటే. భారత దేశంలో కులం, వృత్తి ఒక్కటే అయిన సందర్భాలు, కాలాలు ఎన్నో. వేరే కులం వాడు ఇంకొక కుల వృత్తిలోకి వెళ్ళిన సందర్భాలు (యూరప్‌లోలాగా) లేవు. కాని వ్యవసాయ వృత్తిని దేశంలోని అన్ని కులాల (బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, బి.సి.లు, ఎస్సీలు, గిరిజనులు) వాళ్ళు, అన్ని మతాల వాళ్ళు (ముస్లిములతో సహా) అవలంబించినారు. ఆ రకంగా వ్యవసాయ వృత్తికి ఒక సార్వజనీనత ఉంది. ఆ ఉమ్మడితనమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఇంధనంగా పని చేసింది.

శాయిరెడ్డి ఆ ఉమ్మడితనాన్ని అద్భుతంగా చిత్రీకరించిండు.

ఈ ఉమ్మడితనాన్ని గ్రహించడం, చిత్రించడం ఆధునిక ప్రజాస్వామిక చైతన్య ప్రతిఫలనం.

గంగుల శాయిరెడ్డిలో ఈ ఆధునికత కంఠదఘ్నంగా ఉంది. ఆంధ్రమహా సభ ఉద్యమంలో పాల్గొనడమే కాక ఆంధ్రమహాసభ ఆవిర్భావంకంటె ముందే జరిగిన రైతుల సభలో పాల్గొనడం, దళితుల కోసం స్కూలు నడపడం, హాస్టళ్లు పెట్టించడం గ్రంథాలయోద్యమంలో పాల్గొనడం, కళావంతుల సంస్కరణల్లో పాల్గొనడం, వయోజనుల విద్యకోసం తెలుగు పలుకు అనే నాలుగు బాలశిక్షలు రాయడం, మావూరు (1959), వర్ష యోగం, మద్యపాన నిరోధం, మొ॥ గ్రంథాలు రాయడం అందుకు నిదర్శనాలు.




ఆ ఆధునికత 'కాపుబిడ్డ'లో పూర్తి స్థాయిలో కనిపిస్తుంది.

**"బావుల త్రవ్వించి పలు తోటలను బెట్ట"**
(ప-136)
**"గంటలో నిర్వదామడ గాలిపైన**
**పోవచున్న విమానపు పోల్కిజాడ**
**నాడు నేడును కాలపు నడక వేఱు**
**కర్షకా! మన పనిముట్లు గాంచనేడు**
**వ్యవసాయ శాస్త్రము లనుభవోపేతమై"**
(ప- 144)

మొ॥ పద్యాలలో వ్యవసాయం ఆధునికీకరణ చెందాలనే కాంక్ష కనబడుతుంది.

**"అందరికి కూడుగుడ్డలు చెందవలెను"**
(ప-129)
**"అంటగూడని వారి కంటగు జనులను**
**నంటరాదింక మనకంటు సుమ్మి**
**అబలలబలులచే సబలులౌ వారికి**
**బలము కల్ముల జూపు బ్రతుకు సుమ్మి (ప-10)**
**"చిన్న తమ్ములౌ హరిజనుల్ సేగిబాయ" (ప-121)**
**"అంటగూడని వారి యంటుకంపకునంట**
**వారు నీ జంటను బాయరయ్య**
**అబల లెల్లప్పుడు సబలలై ప్రభలలై**
**వారు నీపైరుల వదలరయ్య"** (ప-21)

లాంటి పద్యాలలో సమానత్వ భావన చిత్రితమైంది.

ఉమ్మడి లక్ష్యాలు కలిగినవారు. ఉమ్మడి బాధలు కలిగినవారు ఏకం కావాలనేది సౌభ్రాతృత్వ భావన. సహ బాధితుల మధ్య సఖ్యత, ఐక్యత ఉన్నప్పుడే ఉమ్మడి శత్రువును జయించడం సాధ్యమవుతుంది.

"జీతగాండ్రకు తగు వేతన"మియ్యాలని, వెట్టిపని చేయించడం మానుకోవాలని, శ్రమకు తగిన ప్రతిఫల మివ్వాలని "వారిని కొట్టి తిట్టి బెదరించవద్దని" (పద్యం-139) అనడంలో ఆ సౌభ్రాతృత్వ భావన కనిపిస్తుంది.

**"నిమ్న జాతుల వారు నెతివెట్టి చేయుచు..**
**యాడు బాపలు బడి యూడిగముల సేయ"** (ప-137)
**"గొల్లల బెదరించి గొట్టుచు పగలెల్ల**
**గొఱ్ఱెమేకల గెంటు" దొరలతో**
**"యెల్లకాలంబు రేయెల్లను మందల**
**తమవద్ద నుంచెడి దండి" దొరలతో**
**సైరికా నీకు చనవు వలదు"** (ప-138) అనే

పద్యాలలో కూడ సౌభ్రాతృత్వ భావన కనబడుతుంది. అంతే కాక సహబాధితులైన వారితో సఖ్యంగా ఉండాలని, దోపిడి దార్లయిన దొరలతో దూరంగా ఉండాలని చాలా విస్పష్టంగా చెప్పున్నాడు.

ఈ పద్యాల్ని ఇంకా మరికొన్ని పద్యాల్ని చదివినపుడు శాయిరెడ్డి భూస్వామ్య వ్యవస్థలో ఏర్పడిన వైరుధ్యాన్ని గమనించినాడా అని అనిపిస్తుంది. అదేమిటంటే - భూమి దానితో పాటు సర్వ ఆధిపత్యాలు కొద్ది మంది చేతిలో కేంద్రీకృతమయిన పరిస్థితి.

**భూమి కౌల్దారు చేతిలో ఎంత కాలం ఉంటుందో తెలియక పోవడం వల్ల దాంట్లో పెంటపోసి, కుంటమట్టి పోసి సారవంతం చెయ్యడు, బావులు తవ్వడు. తోటలు పెట్టడు. ఫలితంగా వ్యవ సాయం అభివృద్ధి చెందక ఉత్పత్తి సన్నగిల్లుతుంది.**

వారు కష్టపడి పని చేయరు. వ్యవసాయాన్ని వృద్ధి చేయడం ద్వారా కాక దోపిడి ద్వారా బొక్కసం నింపుకుంటారు. కష్టపడి పనిచేసే రైతుల కూలీల చేతిలో భూమి ఉండాల్సినంత లేదు. భూమి కౌల్దారు చేతిలో ఎంత కాలం ఉంటుందో తెలియక పోవడం వల్ల దాంట్లో పెంటపోసి, కుంటమట్టి పోసి సారవంతం చెయ్యడు, బావులు తవ్వడు. తోటలు పెట్టడు. ఫలితంగా వ్యవ సాయం అభివృద్ధి చెందక ఉత్పత్తి సన్నగిల్లుతుంది. ఈ వైరుధ్యం పోవాలంటే భూమి రైతు చేతుల్లోకి రావాలె. దోపిడి, దౌర్జన్యాలు ఆగిపోవాలె. ఆధునిక పనిముట్లు రైతులకందాలె. ఆధునిక వ్యవసాయ పద్ధతులు రైతులకు తెలియాలె. ఋణసౌకర్యం ఉండాలె. ఇదంతా ఆ తర్వాత జరిగిన రైతాంగ సాయుధ పోరాటం ద్వారా కొంత, భూసంస్కరణల వల్ల కొంత, మార్కెటింగ్ ద్వారా కొంత తదితర మార్గాల ద్వారా కొంత అనంతర కాలంలో జరిగింది. పది లక్షల ఎకరాల భూపంపిణి జరిగింది. భూదానోద్యమం ద్వారా 43,336 ఎకరాల భూపంపిణి జరిగింది. ఈ వైరుధ్యాన్ని శాయిరెడ్డి అద్భుతంగా పట్టుకున్నడు.

రైతు కష్టాల గురించి చెప్పిన పద్యాలల్లో ఇది కన్పడుతుంది. ఈ క్రమంలో నాటి గ్రామీణ జీవితమంతా కళ్ళకు కడుతుంది.

**"అడుసులో దున్ని లోదొడలన్ని జీలెను**
**కూర్చుండి కూటిని కుడవ నియవు"** (ప-87)
**"ఈదరలోపల నిటునటు దిరుగుచు**
**మోటనాగలి జవదాట వయ్యె"** (ప-88)
**"చౌదరి (పన్ను వసూలు చేసేవాడు) పూజారి**
**పెక్కు హక్కుల గోరి పేల్చుచుండు"** (ప-95)
**"గానుగపిండి సంగతి కనుగొనలేక**
**యితరుల చేతికి నిచ్చినావు**
**పిడుకల జేయుచు పేడ లక్ష్యం లేక**
**కట్టెలతో కూడ కాల్చినావు**
**చదునునేలలు లేక చౌటి దిబ్బల బెట్టి**
**నీటిలో సారంబు నెట్టినావు**
**పసుల బలమది యరిగెను. పాడితరిగె**
**భూమినిస్సారమై యుండె పొలములెండె"** (ప-104)
**"ప్రాత నాగలి చేత లోతు చాలును లేక**
**తెగులుచే పైరెల్ల తెల్లబడెను"** (ప-105)
**"శ్రేష్టమౌ బీజముల్ సేకరింపగ లేదు"** (ప-106)
**"పైరు పంటల నీవు పండింపగానేమి**
**యాధాన్యములు గద్దె అప్పుపాలు"**
**కాననంబుల నీవు కాపాడగా నేమి**
**భూపాలవర్గంపు బొయ్యిపాలు"** (ప-107)
**"గ్రామాధికారులు భీమ స్వరూపులై**
**పెక్కుటక్కుల వెతల్ పెట్టుచుండ"**
**వ్యాపార వర్గంబులా పూర్తి ధూర్తులై**
**లాభంబు పూర్తిగా లాగుచుండ**
**పాలకోద్యోగులు పట్టాభిషిక్తులై**
**చిప్ప ముంతల పాలు చేయుచుండు"** (ప-108)
**"దొరలును కరణాలు దోపిడిసేయగా**
**పుస్తె మట్టెల మాడ్చి బొగులు వారు"** (ప-109)
**"జాలు నీటి"తో పండిస్తే చెరువు నీళ్ళతో**
**పండించావని**
**పన్ను వేసే కరణాలు"** (ప-111)
**"బంజర రైతులు బాటలు గానక", "కౌలుదారులు పెక్కు కడగండ్ల కుడుచుచు"** (ప-126)
**"సాగు చేయనివి నిష్కారణంబుగ బీడు**
**వడియున్నవని ధనమడుగువారు**
**బావిక్రిందను బారు పైరులకెప్పుడు**
**కుంటనీరని దండు గంటు వారు**
**మెట్టనేలలవరి.. వర్ష జలంబని వ్రాయువారు**
**యాజ్ఞలేనిది సేద్య మగుటచే తప్పని**
**ముప్పుతిప్పలు బెట్టి మొఱుగువారు**
**దుక్కికంటెను నెక్కువ త్రోయువారు**
**పండుపంటకు నిమ్మడి దండుగలను**
**గూల్చి హోలికునెప్పుడు గూల్చుచుండ్రు"** (ప-127)
**"జమబంది వెంటనే యమయాతనలు వచ్చి..**
**పన్ను రాబట్టగా పాడిగేదెను బట్ట..**

**నరకటెద్దుల బట్టి యదను దప్పింపగా**
**సేద్యము పనులెల్ల చెట్లుబట్టు"** (ప-129)

రైతులకు కలిగే ఈ కష్టాల నుంచి, దోపిడి నుంచి విముక్తం కావాలంటె రైతులు ఐక్యతతో ఉండాలని, ఐక్యతతో ప్రతి ఘటించాలనే ఒక రాజకీయ, ప్రజాస్వామిక స్వేచ్ఛా కాంక్షను ఈ కింది పద్యంలో బలంగా వ్యక్తం చేసినాడు.

**"ఒక్కనికి చిక్కు వచ్చిన చక్కసేయ**
**కాపులను దిన మందఱు కలవవలయు**
**కందిరీగలు గుట్టిన కరణి నీకు**
**సైరికా పౌరుషము కార్య సాధనంబు"** (ప-135)

ఇది ఈ కావ్యానంతరం కార్యరూపం ధరించింది. అట్లా ఒక దశాబ్దం ముందే కలగన్న గొప్ప స్వాప్నికుడు శాయిరెడ్డి. ఒక దశాబ్దం ముందే దర్శించగలిగిన గొప్ప దార్శనికుడు శాయిరెడ్డి. ఒక నవలలో ప్రదర్శించాల్సినంత జీవన విస్తృతిని ప్రదర్శించినందుకే దీనిని EPIC అన్న.

ఈ వ్యాసం 'కాపుబిడ్డ'లోని ఒక సామాజిక చలనంలోని ఘర్షణను, వైరుధ్యాన్ని పట్టుకోవడంలో కవి చూపిన ప్రతిభను, క్రాంతదర్శిత్వాన్ని, శాయిరెడ్డి ఆధునిక, ప్రజాస్వామిక చైతన్యాన్ని ప్రదర్శించడానికే పరిమితమయింది. తెలంగాణ రైతాంగ పోరాట పూర్వరంగ చిత్రణను వివరించడానికే పరిమితమైంది. వస్తు స్వీకరణలోని, దృక్కోణం లోని నూతనత్వాన్ని పరిచయం చేయడానికే (అది కూడ పూర్తి కాలేదు) పరిమితమయింది.

'కాపుబిడ్డ'లోని మరొక పార్శ్వం మిగిలేపోయింది. అది అభివ్యక్తిలోని నూతనత్వం. శాయిరెడ్డి భావుకత, ఊహాశాలీనత, నిశిత పరిశీలనాశక్తి, ఆలంకారికత, దృశ్యీకరణ శక్తి, రసావిష్కరణ చేసే ఆర్ద్రతా తత్వం, తెలంగాణ భాషమీద, పలుకుబడి మీద పట్టు.. ఇలాంటివెన్నో మిగిలే పోయినవి. వాటి గురించి మరో వ్యాసంలో చూద్దాం.

-డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి
**మొబైల్: 98856 82572**
**మెయిల్:** narayanareddy.sunkireddy@gmail.com

ద

# ఆన్‌లైన్‌లో నంబర్‌వన్



**సాం**కేతిక సౌలభ్యం ఆధారంగా పౌరసేవలను సులభంగా, పారదర్శకంగా ప్రజలకు చేరువ చేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) గుర్తించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మీసేవా కేంద్రాల ద్వారా ఒకే వేదికగా పౌరసేవలు అందించడంలో మిగతా రాష్ట్రాలన్నింటి కంటే మెరుగ్గా ఉన్నదని ప్రశంసించింది. ఈ మేరకు ఎక్స్‌లెన్స్ ఇన్‌స్టేట్ క్యాటగిరీ అవార్డ్-2016ను తెలంగాణకు ప్రకటించగా కేంద్ర సమాచార, సాంకేతిక శాఖ అదనపు కార్యదర్శి అజయ్‌కుమార్ నుంచి రాష్ట్ర మీసేవా కమిషనర్ జీటీ వెంకటేశ్వర్ రావు న్యూఢిల్లీలో స్వీకరించారు. ఈ అవార్డును మిగతా రాష్ట్రాల కంటే తెలంగాణను ఎంపిక చేసేందుకు సీఎస్ఐ సంస్థ పలు విశేష కారణాలు చూపించింది. మీసేవా కేంద్రంగా రోజుకు లక్ష నుంచి లక్షన్నర మంది సేవలు అందుకుంటున్నారని, ఏటా రూ. 4వేల కోట్లకు పైగా ఆదాయాన్ని పొందుతున్నారని, ఇది దేశంలో నంబర్‌వన్ స్థానంలోనే ఉందని కొనియాడింది. సిటిజన్ 360 పేరుతో రూపొందించిన యాప్ ద్వారా పదే పదే వివరాలు అందజేయడం అనే బాధ వినియోగ దారులకు తప్పుతున్నదని, దీనిని దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొట్టమొదట సారిగా చేపట్టిందని కితాబిచ్చింది. అవార్డు స్వీకరించిన సందర్భంగా కమిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధతో ఈ పురస్కారం దక్కిందన్నారు.

టెక్నాలజీ ఆధారంగా మెరుగైన పౌరసేవలు అందించాలనే మంత్రి ప్రతిపాదన మేరకు మీసేవా ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నామని ఆయన వివరించారు.

ద

# డా॥ రామాచంద్రమౌళికి బొంబాయి ఆంధ్ర మహాసభ జీవన సాఫల్య పురస్కారం

**బొం**బాయి ఆంధ్ర మహాసభ అండ్ జింఖానా గత తొమ్మిది దశాబ్దాలుగా మహారాష్ట్రలో ముఖ్యంగా ముంబయి పరిసర ప్రాంత నగరాల్లో తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతి పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తోంది. అందులో భాగంగా ఈ సంవత్సరం 'ఆంధ్ర మహాసభ జీవన సాఫల్య పురస్కారం' ప్రముఖ తెలుగు కవి, కథకులు, ఉన్నత విద్యావేత్త డాక్టర్ రామాచంద్రమౌళికి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం జనవరి 22న 'ది బొంబాయి ఆంధ్ర మహాసభ ప్రాంగణం'లో పలువురు ప్రముఖుల సమక్షంలో జరిగింది.

ఈ పురస్కారం క్రింద మెమెంటో, సన్మాన పత్రం, జీవన సాఫల్య పురస్కార పత్రంతో పాటు నగదు బహుమానం అందించారు. ఈ సంస్థ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎందరో సాహితీ శిఖరాలను, కళాకారులను, వివిధ ప్రక్రియలకు చెందిన జానపద కళాకారులను ముంబయికి ఆహ్వానించి, ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించి, రాష్ట్రేతర తెలుగు సంస్థల్లో అగ్రగామి సంస్థగా నిలిచి, మన రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం కూడా పొందింది. గత సంవత్సరం ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడెమీ గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య డా॥ ఎన్.గోపికి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు.

ద

# అందమైన మట్టి గాజులు

ఆయిమే మేడం.. ఆయియె.. అంటూ దుకాణాల ముందు కూర్చొని బేరసారాలు.. ఒకరికి మించి మరొకరి ఆహ్వానం. ఐదు వందలు చెప్పిన గాజుల జత రూ. 200కు ఇవ్వొచ్చు. లేదా రూ. ఐదు కూడా తగ్గకపోవచ్చు. ఇది చార్మినార్ దగ్గర ఉన్న లాడ్ బజార్ గాజుల మార్కెట్ పరిస్థితి.

ప్రఖ్యాతి గాంచిన లాడ్ బజార్ పేరు వినగానే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది అందమైన గాజులు. అందుకే స్త్రీలు ఇక్కడి గాజులపై ఎంతో మక్కువ చూపిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మరీ తమకు కావాల్సిన గాజులను ఇక్కడ కొంటారు. ఇతర రాష్ట్రాల నుంచి విదేశాల నుంచి వచ్చే మహిళలు కూడా ఇక్కడ షాపింగ్ చేస్తారు. ఇంతగా ప్రజలను ఆకట్టుకుంటున్న గాజులు ఒక హస్తకళగా కూడా అందని మన్న నలు పొందుతున్నాయి.



చేతులకు మెరిసే బంగారు గాజుల మ ధ్య మట్టి గాజులు వేసుకుంటే మరింత నిగారిం పు చేకూరుతుంది. మట్టి గాజులకు ఉన్న ఆకర్షణ అలాంటిది మరి. పెళ్ళిళ్ళు, శుభకార్యాలకు రెండు చేతులకూ రంగురంగుల మట్టిగాజులు వేసుకుంటే మహిళల చేతులు కళకళలాడుతూ ఆకర్షణీయంగా వుంటాయి. రెండు చేతుల నిండా ఎన్ని బంగారు గాజులు వేసుకున్నా ఒక్కో చేతికి కనీసం రెండేసి మట్టి గాజులు ఉండాలని చెబుతారు పెద్దలు. ఏదైనా పని మీద బయటకు వెళ్లేటప్పుడు గాజులమ్మే వారు కాని, మట్టి గాజులు ధరించిన స్త్రీ ఎదురుగా వచ్చినా శుభకరమని నమ్ముతారు. ప్రధానం గా గాజులు నాలుగు రకాలు. మామూలు(మట్టి) గాజులు, ప్లాస్టిక్ గాజులు, బంగారు గాజులు(ఆభరణం), లక్క గాజులు. ధరించే గాజులు సైతం అభిరుచిని, వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి.

నేటి ఆధునిక వస్త్రాధారణలో రకరకాల స్టైల్లో గాజులు ధరించడం కనిపిస్తుంది. వేదకాలం నాటికన్న ముందే స్త్రీలు గాజులు ధరించే వారని లభించిన ఆధారాల బట్టి తెలుస్తుంది. మొహెంజోదారొ తవ్వకాల్లో లభించిన చిత్రాల్లో చేతికి కంకణం ధరించిన స్త్రీ చిత్రాలున్నాయి. బాణబట్టు తన కావ్యంలో సరస్వతి దేవి చేతికి గాజులు(కంగణ్) ధరించినట్లుగా పేర్కొన్నాడు. పురాతన తవ్వకాలలో తక్షశిల వద్ద మౌర్య సామ్రాజ్య కాలం నాటి రాగి గాజులు లభించాయి. అజంతా చిత్రాలలోని, ఎల్లోరా శిల్పాల్లోని స్త్రీలు గాజులు(కంగణ్) ధరించడం కన్పిస్తుంది. క్రీస్తు పూర్వం 230 సంవత్సరాల కాలం నుండే సింధూ లోయలో ఆడవాళ్లు గాజులు ధరించే వారని తెలుస్తుంది.

**రకరకాల పేర్లు...**

చేతికి ధరించే కంకణాలను ఎక్కువగా గాజుతో చెయ్యడం వల్ల వీటికి గాజులు అని తెలుగులో పేరు వచ్చింది. గాజులను సంస్కృతంలో 'కంకణ్', హిందీలో 'చిడియ', 'చుడ' అని అంటారు. అలంకరణకు ఆడవారు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు... తాము ధరించిన వస్త్రాలకు అనుగుణంగా గాజులను వేసుకోవడం కూడా మరిచిపోరు..

**పురాతన పరిశ్రమ..**

అతి పురాతనమైన చేతికళల పరిశ్రమలలో చేతిగాజుల పరిశ్రమ ఒకటి. గాజుల తయారీ, అమ్మకంపై ఆధారపడి నేటికి చాలా కుటుంబాలు జీవిస్తున్నాయి. ఎక్కడ తిరునాలు లేదా జాతర జరిగినా తప్పని సరిగా కనిపించేవి గాజుల దుకాణాలు. గ్రామాల్లో తిరుగుతూ గాజులు అమ్మేవారు సైతం కనిపిస్తారు. గాజులు అమ్మేందుకు ప్రత్యేకంగా ఒక కులం (గాజుల బలిజ) సైతం ఉంది. వీరంతా గాజులు తయారు చేయడం, విక్రయించడం వృత్తిలోనే స్థిరపడ్డారు. పూర్వం ఇంటింటికీ తి రుగుతూ గాజులు అమ్మేవారు. ఇంటిలో ఏ శుభకార్యం జరిగినా ఆడవాళ్లు గాజుల వాళ్లను ఇంటికి పిలిపించుకుని గాజులు వేయించుకునే వారు. వారికి తగిన విధంగా సంభావన యిచ్చి పంపేవారు. ఆధునిక కాలంలో వచ్చిన పెను మార్పుల మూలంగా ఊరూర తిరిగి గాజులమ్మే వారు కనుమరుగయ్యారు. అక్కడక్కడ అరకొర ఉన్నా జీవనోపాధి కరువై ఇతర పనుల్లో స్థిరపడుతున్నారు. వివిధ ఆశ్రిత కులాల వారు ఊర్లను పంచుకున్నట్లు గానే గాజులను విక్ర యించే వారు సైతం పూర్వకాలంలో ఊర్లను పంచుకున్న దాఖలాలు ఉన్నాయి.

రాష్ట్రంలో ఎన్నో గ్రామాల పేర్లకు ముందు గాజుల అనే పదం కూడా ఉంటుంది. అప్పట్లో అవి గాజుల తయారీ, విక్రయాలకు పేరొందిన కారణంగా వాటి పేర్లకు ముందు గాజుల అనే పదం వచ్చి ఉండవచ్చునన్నది ఒక భావన. ఒక హస్తకళగా గాజుల తయారీ ప్రక్రియ ఎంతో కష్టంతో కూడుకున్నది కావడంతో ఈ రంగం క్రమంగా కుదించుకుపోతోంది. దీనిలోకి యంత్రాలు ప్రవేశించాయి.

హైదరాబాద్ నగర చరిత్రలో చార్మినార్ ఎలాగో లాడ్ బజార్ కూడా అలాగే. ఒక్కసారి లాడ్‌బజార్‌లో అడుగు పెడితే చాలు గంటల తరబడి దుకాణాలను చూస్తూ గడిపేస్తాం. ప్రారం భంలో ఒకటి రెండు వ్యాపార సముదాయాలతో ఏర్పడినా గాజుల దుకాణాలు సంఖ్య రానురాను పెరిగి లాడ్ బజార్‌గా విస్తరించింది. హైదరాబాద్‌లో ఉండేవారైనా, నగరాన్ని చూసేందుకు వచ్చే వారైనా లాడ్‌బజార్‌ను చూడడం మాత్రం మరువవద్దు. దాన్ని చూడకపోతే ఎంతో ఆనందాన్ని కోల్పోయినట్లే.

– వెంకట్ ద

# పదాల పేచీనా? పదం వెనుక ఉన్న సాహిత్య కళారంగాల పట్ల చిన్నచూపా?

'**జా**నపద' అనే పదం విద్యాత్మకరంగం నుండి వచ్చింది. 'జానపదుడు' అంటే పల్లెవాసి అని అర్థం. జనపదాల్లో జీవించే వాడని, పండితేతరుడని, శిష్టకులంవాడు కాదని దాని వెనకదాగిన అంతరార్థం. శ్రమజీవి అని, బడుగు బలహీనవర్గం వాడని కూడా విజ్ఞులకి అవగతం అవుతుంది.

ఈ విషయం ఎందుకు చర్చిస్తున్నానంటే, ఈ పదంపై కొంత మందికి కొన్ని అపోహలు ఉన్నాయి. వీటిలోని మంచిచెడులేమిటో ఆలోచించడం అవసరం. ఈ పదం వెనక సామాజిక వర్గకుల భావన దాగి ఉంది. ప్రగతిశీల భావాలు, అంటే, మార్క్సిస్టులు, భూస్వామ్యం కన్నా పెట్టుబడిదారీ విధానం మెరుగైనది అనే ఆలోచన కలిగిన వారు కొన్ని దేశీయ విషయాల వరకు వచ్చే సరికి వాటిని ఈసడిస్తున్నారు. దీని వల్ల ప్రజలకు ఒనగూడే నష్టం కన్నా అలా వ్యతిరేకించేవారికే నష్టం ఎక్కువ. ఐనా వారు యాంత్రికంగా సమాజంలో తాము పుట్టిన, నిలబడిన 'చోటు' వల్ల, కొన్ని సంస్థల్లో సభ్యత్వం ఉండడం వల్ల వారు ప్రజా సంఘాలని సైతం ప్రభావితం చేస్తూ పోతారు. అంటే కింది వర్గం ప్రజల పట్ల, వారి సాహిత్య కళారంగాలపట్ల అనవగాహనని కొనసాగిస్తారు. దానివల్ల ఎవరికి నష్టం? ఇది ఆలోచనీయం. దీనిని సామాజిక దృక్పథంతో అర్థం చేసుకోవలసి ఉంది. పైగా భారతీయ జానపద విజ్ఞానం కోణంలోంచి, ప్రత్యేక దృక్కోణంలోంచి ఆలోచిం చవలసిన విషయం.



ఆలోచనాపరులకు ఏ అనవగాహన అయినా అది తాత్కాలికం కావాలి. ప్రశ్నలను రేకెత్తించి వారు సమాధానాలు రాబట్టాలి. తద్వారా సామాజిక ఆలోచనల చలనాన్ని త్వరితగతిని వేగవంతం చేయాలి. అలాంటి మేధావులు, రచయితలు ప్రతి దశలోనూ, కాలాల లోను అవసరం. అలాంటి వారిలో ఈ మధ్యకాలంలో మొదట చెప్పుకోవలసిన వ్యక్తి బాలగోపాల్. కులవర్గ దృక్పథంలోంచి ఆలోచిస్తూ ధైర్యంగా ఆలోచనలు రేపుతున్న మరోవ్యక్తి కంచె ఐలయ్య. వీరి అభిప్రాయాలు సరైనవి, అవే పరిష్కారాలు, సామాజిక అవగాహన అంతిమ భావనలుగా చెప్పడం ఉద్దేశం కాదు. అది ఎంత మాత్రం కాదని గమనించాలి. కాని భారతీయ సామాజిక ప్రత్యేక సమస్యల దృక్కోణంలోంచి ఆలోచించలేని వారికి, జడత్వం లోంచి, పేరిన యాంత్రికతలోంచి ఒక అలారం మోగించడం అవసరం. ఇలాంటి హెచ్చరికలు కొన్ని సరైన దిశలో పయనించడానికి అవసరం పడతాయి. లేదా ఆ హెచ్చరికల వెలుగులో అర్థం చేసుకుని, సవరించుకుని ముందుకు వెళ్ళడానికి అవి ఉపకరిస్తాయి. లేదా సమాజం వాటిని పక్కన పెట్టి తన మానాన తాను నడిచి పోతుంది.

సామాజిక వాస్తవికతలు, ఘర్షణలు, వాటికి చెందిన పోరాటాలు నిరంతరం ఉంటాయి. ఐతే సామాజిక వాస్తవికతలు సైతం మారుతుంటాయి. మారాలి. ఐతే అవాస్తవాలను ఏ రూపంలోనూ సమాజం సమ్మతించదు. అట్లని కొన్నింటిని చూసీ చూడనట్లుగా ఉంటుంది. కొన్నింటిని పెద్దగా పట్టించుకోదు. అంతమాత్రం చేత వాటిని అంగీకరించినట్లుకాదు. బూర్జువా ప్రభుత్వాలు అంతా ప్రజల కోసమేనని చెప్పి వారిని నమ్మించినట్లుగా, కొన్ని ప్రజాసంఘాలు కూడా ప్రజల పేరుతోనే కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని అంటాయి. కాని అవి అంతిమంగా ఇలాంటి తమ కార్యక్రమాలను లిస్టులో నమోదు చేసుకోవడం కోసమే అనే వాస్తవం కొంత కాలం తరువాత తెలియవస్తుంది. ఇలాంటి వారి పట్ల ప్రజలు ఎంతో కొంత సంయమనం చూపిస్తారు. జాగ్రత్త వహిస్తారు. కలసి వచ్చినట్లుగానే కనుపించి పక్కకు తప్పుకుంటారు. తమ జీవి తాలను వారు ఏమాత్రం మార్చగలరో అంచనా వేస్తారు. మార్చే సత్తా ఉన్నవారిని మాత్రం తత్కాలం అయినా నమ్ముతారు. ఎల్లకాలం నమ్మడానికి, కేవలం సిద్ధాంతాల్ని వల్లె వేసేవారిని విశ్వసించడానికి ప్రజలు తమ తమ ఎత్తుగడలను, అవగాహనను అనుస రిస్తారు.

నిబద్ధత, నిజాయితిలను గమనించి గుర్తించాకే వారికి విశ్వాసం ఏర్పడుతుందన్నదన్నది మాములు విషయం. కేవలం రాజకీయ సైద్ధాంతికతలే ముఖ్యం కాదు. అవి ఎంత ఉన్నతమైన వైనా వాటిని విశ్వసించరు. వాటి వెనకగల నిర్మాణం, వ్యక్తుల నిజాయితి కోణంలోంచి చూస్తారు. ఈ దేశంలో 'కులం' పేరుతో సహస్రాబ్దాలుగా వివక్షకు గురయ్యే ప్రజలు, నిరంతరం శ్రమదోపిడికి గురయ్యే శ్రామికులకు ఆ 'కులం' ఒక వాస్తవం. అది ఒక శత్రువు. దానిని సంహరించకుండా ఎలాంటి ఫాయిదా ఒనగూరదనే భావనకు వచ్చి అర శతాబ్దం అయ్యింది. దానిని గమనించని ప్రగతివాదం తన నిర్మాణం, తన సైద్ధాంతిక చట్రంలో తాను బందీ అయిపోయిందని ప్రజలు భావిస్తున్నారు. ప్రజల శ్రమ ముద్దు. కాని వారి కళా

సాహిత్యాలు మాత్రం వద్దు అనే వారి నిజాయితీని శంకించడానికి ఒక కారణం అవుతున్నది. ఈ కళా సాహిత్యాలకు ఎన్నో పేర్లు ఉన్నాయి. వాటికి కొదవలేదు. కాని వాటిని ప్రజల శ్రమశక్తి ఆసరాగా, మేధోశక్తి రూపంగా వాటిని గుర్తించడం లేదన్న భావన ప్రజలలో ఉంది. కేవలం విద్యారంగ దృక్పథంతో పరిశోధన డిగ్రీలు పొందేవారి కృషిని కూడా ప్రజలు పెద్దగా హర్షించడం లేదు. అందుకే వాటిపట్ల కూడా ప్రజలకు పెద్ద ఆసక్తి, గౌరవం లేదు.

జానపదసాహిత్యం అనే మాట అర్థంకాని ప్రగతిశీల వాదులు కొల్లలు. ప్రజలలో ఇంతటి మేధోసంపత్తి, వైవిధ్యతా కౌశలం దండిగా ఉందని వారు గుర్తించ నిరాకరించారు. అందుకే జానపద పరిశోధనలను భారతీయ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, ప్రజల సృజనాత్మక మేధో నైపుణ్యాల నాడిని పట్టుకోవడానికి అశక్తులయ్యారు. ఈ అశక్తత కేవలం వారి కులవర్గ స్వభావ జనితం.

చిన్నతనం నుండి ఊరికి దూరంగా, ప్రజలకు దూరంగా, బాల్యంలో చదువుకోవడం కోసం బడికి, పూజా పాటాల కోసం గుడికి, పెళ్ళి, చావు, పండగ, జాతర వంటి అంశాలలో భూస్వామ్య విలువలకు, మత భావాలకు అనుగుణంగానే ఆలోచించిన, జీవించిన వారి నేపథ్యం ప్రజావ్యతిరేకమే. అందుకే చిన్నతనంలో ఏర్పడిన భావాలు పెద్ద పెరిగినా మారవు. కొంత సైద్ధాంతిక మమేకత ఉన్నా అది నిర్మాణాల్లో కూడా అంతర్గత భాగంగా నిలిచిపోయి కొనసాగుతుందనడంలో ఎలాంటి విప్రతిపత్తి లేదు.



1970 తరువాత ప్రపంచవ్యాప్త ఆర్థిక మాంద్యం, మన దేశంలో ఆకలి దశాబ్దాల ప్రభావం, పోరాట పార్టీలలో చీలికలు, సైద్ధాంతిక గందరగోళంలోంచి పుట్టిన వ్యక్తివాద పోకడలు, రాజీ రాజకీయాలు, తిరోగమన దిశగా ఆలోచిస్తున్న మేధావులు, తీవ్ర మైన ఆర్థికనేరాలు, విలువల పతనం వంటివన్నీ కలసి ఉపరితలంలో ఏర్పడిన సంక్షోభిత వాతావరణం లోంచి రివిజనిజాన్ని బద్దలు కొట్టడానికి పోరాటరూపం శరణ్యమని కొందరు నమ్మారు. విద్యాపరుల ఆలోచనలతో రూపొందిన పోరాట / విప్లవ పార్టీ, దాని లోంచి చీలకలు ఏర్పడిన పరిస్థితిని ఒకసారి గమనించాలి. నిజానికి భారతీయ సమాజం పునాదిలో సంభవిస్తున్న మార్పుని, సంక్షోభాన్ని గుర్తించవలసి ఉండింది. రాజకీయ ఆలోచనలు, సైద్ధాంతిక అన్వయం దిశగా పోరాట స్వభావం ప్రాతిపదిక సిద్ధాత చర్చ పెరగవలసి ఉండింది. అప్పుడు చరిత్ర మరో తీరుగ ఉండేది. వర్గశత్రు నిర్మూలన విప్లవంలో ఒక చిన్న భాగమే. వర్గ నిర్మూలన కోసం ఏ వర్గాన్ని నమ్ముకోవాలో, ఆ వర్గాల సాహిత్య కళా సమ్మేళనాలపై, వారి సృజనశక్తులను కాకుండా కేవలం పై వర్గాల సృజన గొప్పది అనే భావన వల్ల మనం మన చేతిలోకి రావలసిన అనేక సాంస్కృతిక ఆయుధాలు మనకి దక్కకుండా పోయాయి. అలాంటి ఆయుధాలలో జానపద సాహిత్యం, సంగీతం, కళ, విజ్ఞానం వంటివి ముఖ్యమైనవి.

ప్రజలు చరిత్ర నిర్మాతలని చెప్పిన సిద్ధాంతవాదులు ఈ దేశంలో వారికి కులం, వర్గం, దోపిడి, అంటరానితనం అంటుకుని ఉన్నాయని గుర్తించాల్సినంత స్థాయిలో గుర్తించలేకపోవడం ఒక సమస్య అయ్యింది. ఆ లోపం ఇంకా మనని వెంటాడుతోంది. అందుకే అనేకమంది ప్రజలు విప్లవ / ప్రగతి సాహిత్యాల అంచుల బయటనే ఉండిపోయారు. అందుకే జానపద సాహిత్యం / ప్రజా కళా సాహిత్యాలు కూడా కొంత దూరంగానే ఉండి పోయాయి. ఆ కళలని వాడుకోవడమే తప్ప, అవి కొత్త సమాజానికి పునాదులు అని గుర్తించలేకపోయాం.

అందుకే ఇకముందు అలా జరగకకుండా చూడాలని ఈ చర్చ. అన్ని విషయాలలో ఏకీభావన కలిగి ఉండాలనుకోవడం సరికాదు. రేపటి గురించి ఆలోచించడం ఇవాళటి మేధావుల బాధ్యత.

అందుకే జానపద సా హిత్యం, కళల గురించి రాసే ప్పుడు, ఆలోచించేటప్పుడు జరిగిన కొన్ని పరిణామాల గురించి మాట్లాడుకోవడం అవ సరం.

ఈ చర్చ ప్రగతిశీల సాంస్కృతికోద్యమం మూలాల చర్చకి దారి తీసినా ఫరవా లేదు. ఆ అవసరం మాత్రం ఉంది. అక్కడిదాకా ఆలోచించక పోయినా జనం కళా సాహిత్యాలపై మరోసారి దృష్టి సారించే దిశగా ఈ నాలుగు మాటలు.

ఇంతకీ పదం పట్ల పేచీనా, పదం వెనుక ఉన్న సకల శ్రామికుల కులంపైనా. ఇంతకీ ఇది పేచీనా? కులం పేరుతో ప్రశ్నించిన వారిపై ద్వేషమా?

'జానపదం' పదం అంత పనికిరానిదా?

ప్రజా లేదా జనం అంటేనే బాగుంటుందా? జన సాహిత్యం, ప్రజా సాహిత్యం అనే మాటలకు అంతటి మహత్తు ఉందా?ఉంటే ఎందువల్లనో ఆలోచించాలి.

–జయధీర్ తిరుమలరావు,
మొబైల్: 9951942242
ఇమెయిల్: jayadhirtr@gmail.com

## విప్లవోద్యమ సాలులో ఉషోదయ గీతమై, పోరుబాటల రాగమై

# యశస్సును సాధించిన యష్‌పాల్ పాట

**చి**న్నతనంలోనే పాటమ్మ వేలు పట్టుకొని దట్టమైన అడవిలో సెలయేటి గలగలల్ని దోసిళ్ళతో పట్టుకుంటడు. జానపదుల జీవన చిత్రాన్ని, పక్షుల కిలకిలారావాలను తనలో నిక్షిప్తం చేసుకుంటడు. కన్నతల్లి పెదాల వెంట జాలువారిన పదాలను తనలోకి ఒంపుకుంటడు. సామాజిక సమస్యల మీద పదాల కొరడా ఝులిపిస్తడు. పదాల విల్లంబులనెక్కుపెట్టి, తెలంగాణ రాష్ట్రసాధనలో రాగమైన పోరాట పాటగాడు, ప్రజాకవి యష్‌పాల్ గురించి నేటి మన "అలుగెల్లిన పాట" లో...

ఖమ్మం జిల్లా కొండాపూర్‌కు చెందిన చింతమళ్ళ వీరస్వామి–ముత్తమ్మ దంపతులకు కలిగిన ఇద్దరు సంతానంలో బిడ్డ శాంతమ్మ, కొడుకు వెంకయ్య. వెంకయ్య 1975 మార్చిలో జన్మించిండు. వీరస్వామిది నిరుపేద దళిత కుటుంబం. చిన్నాచితక పనులుచేస్తూ వ్యవసాయ కూలీగ జీవించిన వీరస్వామి తన కొడుకు వెంకయ్యను చిన్నప్పుడే హాస్టల్‌లో వేసి చదివించిండు. బిడ్డ శాంతమ్మ తల్లిదండ్రులకు చేదోడు, వాదోడుగా ఉండేది. వెంకయ్య చిన్నతనం నుంచే ఇంటి వద్ద తనతల్లి పాడే పాటలను వల్లెవేసిండు. లయ తప్పకుండ పాడడం తన తల్లి నుంచే నేర్చుకుండు. యక్షగానం, పిట్టలదొర వంటి కార్యక్రమాలు ఎక్కడుంటే అక్కడికి తల్లి వెంట పోయేవాడు. ఆ పాటలను అక్షరం పొల్లుబోకుండ పాడేటోడు. వాళ్ళ మాటల్ని, పాటల్ని అనుకరించి ఇంటిల్లిపాదినే కాకుండ చుట్టుపక్కల జనాలకు కూడ నవ్వించేటోడు. వెంకయ్యను దురదృష్టం వెంటాడింది. చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. వెంకయ్య ఆరవతరగతి హాస్టల్‌లో ఉండి చదువుతున్న సమయంలో తన తల్లి హుజూర్‌నగర్‌లోని మేనమామల ఇంటనే చనిపోయింది. ఆ రోజుల్లో వచ్చిన భయంకరమైన తుపాను కారణంగా బ్రిడ్జి తెగిపోవడంతో ఇటు పాలేరు నుంచి గాని అటు కోదాడ నుంచి గాని చాలారోజుల వరకు రాకపోకలు నడవలేదు. దాంతో తన తల్లి చనిపోయిందన్న విషయం వెంకయ్యకు నెలరోజుల తర్వాత తెలిసింది. ఇక తల్లి లేదన్న బాధతో వెంకయ్య గుండెలు పగిలేటట్లు ఏడ్చిండు. తల్లిపాడే పాటల్ని మననం చేసుకుంటూ గడిపిండు. వెంకయ్య అక్క శాంతమ్మ తల్లి తర్వాత తల్లిలెక్క చూసింది. తమ్ముని అల్లారుముద్దుగ పెంచింది. వెంకయ్య కూసుమంచి మండలం, పోసారంలో తన హైస్కూల్‌లో చదువును పూర్తి చేసిండు. అవును పైన యష్‌పాల్ అని చెప్పి ఇక్కడ వెంకయ్య గురించి మాట్లాడుతున్న డేందని అనుమానం వచ్చిందా. అయితే మీకు ఈపాటికే అర్థమై ఉంటది యష్‌పాల్ చిన్ననాటి పేరే వెంకయ్య అని. యష్‌పాల్ ఇంటర్ మొదటి సంవత్సరం ఖమ్మం నయాబజార్‌కాలనీలో గల కళాశాలలోను, ద్వితియ సంవత్సరం దోర్నకల్‌లోను చదివిండు. యష్‌పాల్ చిన్నతనంలోనే అరుణోదయ నాగన్న, కానూరి పాటలకు ఆకర్శితుడయ్యిండు. యష్‌పాల్ కానూరిని తాత అని ఆప్యాయంగ పిలిచేటోడు. పాటలతో పాటు జానపద కళల్లోని మెళకువల్ని నాగన్న నుంచే నేర్చుకుండు యష్‌పాల్. ఒకరకంగ యష్‌పాల్‌కు నాగన్న గురువులాంటి వాడు.



కాంచనపల్లి ఎన్‌కౌంటర్ ఘటనకు సంబంధించిన పోస్టర్‌లు వేస్తున్న సమయంలోనే యష్‌పాల్‌ని పోలీసులు అరెస్టు చేసింద్రు. రెండు రోజులపాటు తీవ్రమైన ఇబ్బందులకు గురిచేసింద్రు. ఆ సమయంలోనే యష్‌పాల్ తన మొదటి పాటను రాసిండు. "అజ్ఞాత వీరుడు అగ్గియోధుడు కోటన్న" అంటూ పల్లవందుకొని ప్రజాక్షేత్రంలోకి తన పదాలతో ప్రవేశించిండు. ఆ తర్వాత రైతు సమస్యల మీద తీవ్రంగ స్పందించిండు.

**"కల్లం నిండా గింజలు ఉన్నారైతన్న / పల్లెం నిండ మెతుకులు లేవో రైతన్న అన్నదాత అలమటిస్తే ఏలేటోడు ఏంజేసేనో రైతన్న"** అంటూ పద్దెనిమిదేండ్లు కూడ లేని యష్‌పాల్ ప్రశ్నిస్తడు. ఆ రోజుల్లో రైతులకు గిట్టుబాటు ధరలేక ఎన్నో బాధలు పడుతున్న రైతుకూలీలను ఏకం చేసే విధంగ సాంస్కృతికం ద్వార తన మద్ద తును తెలియజేస్తడు. డాక్టర్ రామచందర్‌రావు, రంగారావు వంటి నాయకులతో ఏర్పడిన సాన్నిహిత్యం వల్ల పాటలకు ఎంతో బలం చేకూరింది. జంపాల చంద్రశేఖర్ పై యష్‌పాల్ రాసిన **"ఖమ్మం జిల్లా ఇల్లందు తాలూకా జొన్నల గుట్టల్ల జంపాల చంద్రన్న"** పాట అమరులను స్మరిస్తది. హైస్కూల్ స్థాయినుంచే పి.డి.ఎస్.యు, అరుణోదయ కార్యక్రమాలు, సభలలో పాల్గొంటూ హాస్టల్ విద్యా ర్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తడు. మహబూబ్‌బాద్ దగ్గర జరిగిన సురేష్ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా యష్‌పాల్ పాడిన **"కొండా కొండల నడుమ కొండల్లా నడుమ / మానుకోట కొండల్లో మండిన సూరీడే సూర్యుడయ్యిండే సురేషన్నయ్య"** పాట జనాన్ని కంటతడి పెట్టిస్తది. అదేవిధంగ **"పొద్దుబొడిసె పొదుబొడిసె ఇల్లందుమీద వీరుడో ఎల్లన్న ఎల్లన్నా లడాయి గడ్డపై జబ్బ చరిచిండే పోరాడి మాయన్న పోరులొరిగిండే"** అంటూ అమరులైన వారి మీద స్పందిస్త డు.

తన పాటలతో ఎందరినో కదిలిస్తడు. రంగవల్లి మీద రాసిన పాట కూడ యష్‌పాల్‌కు ఎంతో పేరు తెచ్చింది.

"మా అక్క రంగవల్లి మా రగుల్ జెండా

పోరులో ఒరిగినాదో తల్లీ... పొలికేకలయ్యినాదో..." అంటూ చాటింపు వేస్తడు. అసలు పేరు వెంకయ్య అయినందుకేమో చాలా పాటల్లో వెంకన్నని పలకరిస్తడు. ఆ వెంకన్నతోనే ముచ్చటిస్తడు.

"ఎట్లెట్ల బతికినోల్లం రెంకన్న మనము

గిట్లెట్ల అయిపోయితిమిరో రెంకన్న

ఎడ్లాకు రంగులేసి ఎరువాక సాగినోల్లం

తీరొక్క గింజలు పెట్టి పుట్ల పంటను తీసినోల్లం

పండుగ పబ్బాలు వస్తే పిండి వంటలు చేసుకోని

సుట్టాలు పక్కాలు వస్తే సంబరాలు జరిపినోల్లం

ఎనకటి రోజులు యాదికొస్తే రెంకన్న

పుట్టెడంత దుఃఖం వచ్చే రెంకన్న" అంటూ ఏ కుట్రలు కుతంత్రాలు లేక హాయిగా, పచ్చపచ్చగా బతికిన పల్లెని తల్చుకుంట డు. ఆ దుఃఖాన్ని వలపోస్తుంటడు. సింగరేణి బొగ్గుబాయి కార్మికుల మీద"బాయి బోతుందిర ఎంకన్న మన బతుకు బోతుందిర ఎంకన్న

సింగరేణీజూడు రెంకన్న అయ్యో శవాల దిబ్బాయె రెంకన్న" అంటూ పాడు కుంటడు. ఇట్ల ఎన్నో పాటలు కార్మికుల కష్టజీవుల మీద రాసిండు. యష్‌పాల్ పల్లె ల్లో జీతగాళ్ళ గోసమీద తీవ్రంగ స్పందిస్తడు.

"ఏం బతుకు ఏం బతుకన్న ఈ పాడు బతుకు ఏం బతుకు ఏం బతుకన్న పల్లేరుగాయల్ల పలుగురాళ్ళ మీద నడిసి

పాములు తేల్లల్ల దిరిగి ఎద్దులా ఎడ్లల్ల గడిపి

వానగుంటల నీళ్ళు దాగి ముండ్లకంచెలు ఎక్కిచూసి

పుండ్ల రసులు కారుతున్న పేదరొచ్చులు ఎత్తుకుంట

పెంటదిబ్బే పక్కాయే గడ్డికట్టే గొంగడాయే

ఏంబతుకు ఏంబతుకన్న.. తునీయవ్వ... ఏంబతుకు ఏం బతుకన్న" అంటూ గ్రామీణ పద నుడికారంతో పాటల్ని పదునెక్కిస్తడు. పల్లెని చైతన్యం చేసే దిశగా అడుగులేస్తడు. సకలసంపదలున్న భారతదేశం ఎందుకింత అధ్వాన్నంగ తయారయ్యింది. లోపం ఎక్కడుంది. ఎవరు దీనికి కారణం? అనే కోణంలో యష్‌పాల్ రాసిన పాట ఎందరో విమర్శకుల ప్రశంశలు పొందింది. చక్కని బాణీతో రాసిన ఈ పాట ఎంతో ప్రసిద్ది చెందింది. భారతదేశ దివాళాకోరుతనానికి కారణమైన పాలకుల తీరుని ఎండగట్టిన

"సిరిగల్ల భారతదేశం తమ్ముడా... తాకట్టుపెట్టాబడ్డది తమ్ముడా

చదువుకున్న తమ్ముళ్ళంత భవిష్యత్తు కానరాక

బందిపోటు దొంగల్లాగ దారిదోపిడి జేస్తున్నారు

దేశాన్ని ఏలే నేతలే తమ్ముడా.. ఈ నేరాలకు సృష్టికర్తలు తమ్ముడా" అనేపాట యష్‌పాల్‌ని ప్రజాకవిగా, గాయకునిగా నిలబెట్టింది. ఇదే దృక్పథంతో రాసిన మరో పాట యష్‌పాల్‌ని అగ్ర కవుల సరసన చేర్చింది. ఛలో అసెంబ్లీ సినిమాలో ఈ పాటని కాస్త కథకు అనుగుణంగా మార్చుకున్నప్పటికి ప్రజల హృదయాలలో నిలిచిపోయిన పాట ఇది. ఇదే సినిమాలో యష్‌పాల్ మరో పాట

"పొద్దూ పొద్దున్న లేచి పొద్దున్న లేచి మా కంటి పాపల్లారా

పొద్దున్న లేచి మా ఇంటి వెలుగుల్లారా" అంటూ పిల్లల చదువుల కోసం పేద కన్నతల్లిదండ్రులు ఎన్ని బాధలు పడతరన్న దృక్పథంతో రాసిన ఈ పాట ఒక సందేశాత్మకం. అదేవిధంగ యష్‌పాల్ రాసిన మరో పాట అనేక వనరులున్న దేశం అధ్వాన్నమైన దుస్థితిని గురించి సోకంబెట్టి సెప్తడు

"భారతదేశం బాకిన బడ్డదిరో నాయనా.. బంగరు నేల కుదువాబడ్డదిరో

ఒరి నాయనా బంగరు భూమి కుదువాబడ్డదిరో ఒరెనాయనా" అంటూ దేశాన్ని అప్పుల కుప్పగా చేసిన వైనాన్ని నిశిత దృష్టితో విమర్శిస్తడు. పి.వి. నర్సింహారావు కాలం నాటి ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో రాసిన ఈ పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. యష్‌పాల్ పాటను ప్రేమిస్తడు. ఆరాధిస్తడు. పాటలో అంతు లేని శక్తి నిబిడీకృతమై ఉన్నదని అంటడు. పాటే తన జీవన గమనంగా సాగిండు.



వంగపండుతో యష్‌పాల్

ఈ క్రమంలోనే యష్‌పాల్ తన వైవాహిక జీవితంలోకి అడుగుబెట్టిండు. తనకు భార్య కరుణ పిల్లలు ప్రకృతి, విజ్ఞాన్ ఉన్నారు. మిగతా అంశాలు ఎట్ల ఉన్న ఇల్లు పిల్లల్ని చూసుకుంటూనే ప్రజా ఉద్యమాన్ని కొనసాగించిండు. పాటల ద్వార చైతన్యాన్ని కల్పించిండు. ఈ విధం గ యష్‌పాల్ రాసిన పాటలన్నింటిని 'పోరుపాటలు' అనే సంకలనం గ 2005లో ప్రచురించిండు. యష్‌పాల్ స్త్రీల సమస్యల మీద స్పందించిన తీరు అమోఘమని చెప్పక తప్పదు. స్త్రీల శ్రమని ఎవరు గుర్తించరని, వాళ్ళ కష్టం వెలకట్టలేనిదని అంటడు.

"అమ్మా నీ పనికి సెలవు లేదమ్మా - ఇంట్లెంత పనికైన విలువలేదమ్మా - ఇడిసిన బట్టల్ని ఉతికేటి బండవు - ఆకలైనప్పుడల్లా ఉడికేటి కుండవు" అంటూ ఆర్ద్రతని గానం చేస్తడు. పురాణాలు, ఇతిహాసాలు సైతం స్త్రీలను కించపరిచిన అంశాన్ని తనపాటల్లో ప్రధాన వస్తువుని చేస్తడు. ద్రౌపతిని వేలంవేసిన తీరు, సీతని అగ్ని ప్రవేశం చేయించిన తీరు మీద, హరిశ్చంద్రుడు భార్యను అమ్ముకునే సన్నివేశాలు, సంఘటనలను ప్రశ్నిస్తడు. మహిళల పక్షమై నిలుస్తడు.

"అవునంటావా కాదంటావా చెల్లెమ్మ

ఇది బ్రహ్మగీసిన గీతంటావా చెల్లెమ్మ" అంటూ అనేక అంశాలను మేళవిస్తడు. సమాజంలో స్త్రీల పట్ల గల వివక్షను ఖండిస్తడు. వీటితో పాటు సారా వ్యతిరేక ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తడు. మూఢనమ్మకాల మీద ప్రజలకు గల భ్రమలు తొలిగే విధంగ తన పాటలు, మాటలతో

పాటు "మంత్రాలకు సింతకాయలు రాలవు" అనే నాటికను రాసి, తానే స్వయంగా దర్శకత్వం వహించి అనేక చోట్ల ప్రదర్శించిండు. 'మా ఊరికి సారా వద్దు' అనే అంశంతో నాటి సమైక్యపాలనకు నిరసనగా పాటందుకుంటడు.

**"సర్కరోడు పాడుగాను సారదెచ్చి పోస్తడంట**
**సంసారాలు గూలుస్తన్నడే ఓయమ్మ..**
**మన సంపదంత కొల్లగొట్టినాడే మాయమ్మ**
**ఊళ్ళె దవఖాన లేదు – సక్కనైన బడిలేదు**
**సారకొట్లు సానా ఉన్నయమ్మ ఓయమ్మ..."** సారా ఉద్యమంలో స్త్రీలను భాగస్వాములను చేస్తడు. అత్యంత వేగం పుంజుకుంటున్న ప్రపంచీకరణకు వ్యతిరేకంగా యష్పాల్ రాసిన పాట

**"ఎగిరెగిరి పడబోకు అమెరికోడ మల్లి ఎదురుదెబ్బ తింటవుర అమెరికోడ**
**నూరు నేరాలు చేస్తి వమేరికోడ నీ పాపమెట్ల పండు ద్దో అమెరీకోడ"** అంటూ అమెరికా ఆధిపత్యం మీద దుమ్మెత్తిపోస్తడు. యుద్ధం యుద్ధం అంటూ ప్రజలంత అమెరికా మీద యుద్ధానికి సిద్ధం కావాలంటడు. కన్న కొడుకులే కసాయిలుగా మారి వృద్ధాశ్రమాలలో చేర్చుతున్న దయలేని కొడుకుల మీద యష్పాల్ తన పాటతో దాడి చేస్తడు. మానవీయ కోణంలో ఆగ్రహిస్తడు. కన్న వాళ్ళకు ఇంత కూడు పెట్ట లేని కొడుకు ల కర్కశత్వాన్ని కడిగిపారేస్తడు. ఆత్మీయత, అనురాగాలకు దూరమైన ముసలి తల్లిదండ్రుల గాథని గానం చేస్తడు. ముసలోల్ల పక్షాన నిలబడి, ఆర్ధంగా అర్థిస్తడు.



**యష్పాల్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం**

"ముసలోల్ల ఈ బాధలిన్నరా
మా కడుపుకోత గాత కన్నరా
ఓ కొడుకులారా.. మా తండ్రులారా
కూడుబెట్టని కొడుకు మోడేరా ఆడు ఎన్నాళ్ళున్న తోడు కాదేరా
బుడి బుడి నడకలతో పెంచినం మాకన్న నిన్నెత్తుగా పెంచినం
మీరు ఏడిస్తే మాకేడుపొచ్చెరా మా ఒడినే ఉయ్యాల జేసినం
మా రక్తమంత ధారపోసినం ఓ కొడుకులారా...
మా సత్తువంత ఉడిగిపాయెరా మా బిడ్డలారా...
పండుగప్పుడు మమ్ము జూడలే పట్టుమని పది పరకలియ్యలే
మాకు నోరూర కూరలు ఎరగలే
ఒక్క ఆయమన్న బట్ట గట్టలే
ఎవరికి గొరగాని జన్మరా ఓ కొడుకులారా...
మాకు సావెప్పుడొస్తదనెదురు చూస్తిరా ఓ బిడ్డలారా...

యష్పాల్ వ్యక్తిగత కారణాలతో మీడియా రంగంలోకి వస్తడు. సాక్షి పత్రిక, ఆర్.కె. ఛానెల్ వంటి వివిధ చోట్ల పనిచేసిండు. అయినా తాను ఏనాడు పాటను వీడలేదు. పుస్తకాలను చదవడం వదలలేదు.

ఈ సమయంలోనే వెల్లువెత్తిన తెలంగాణ ప్రజాఉద్య మం లోకి వస్తడు. అప్పటికే అసువులుబాసిన అనేకమంది తెలంగాణ అమరుల త్యాగాలను స్మరిస్తడు. 'ఉయ్యాలో ఉయ్యాల' అంటూ అలలు తీరాన్ని ముద్దాడినట్టు ఉద్యమాన్ని ఉధృతం చేస్తడు. యష్పాల్ రాసిన "చెగువేర" డాక్యుమెంట్ కూడ జనబాహుళ్యంలో మంచి ప్రచారాన్ని పొందింది.

**"చెగువేర మా వీర ఉద్యమాల పొద్దువేర**
**చెగువేర రణధీర ఉద్యమాల పొద్దువేర**
**నీగ్రోలోయల గెరిల్ల వీరుల**
**బొలీవియా అడవుల రక్తపుదారుల"** అంటూ చెగువేర వీర త్వాన్ని గానం చేస్తడు. గద్దర్, గోరటి వెంకన్న గూడ అంజన్న, మిత్ర, శక్తి, జయరాజు పాటలే తనకు ఎంతో ప్రేరణ ఇచ్చి నయని అంటడు. గద్దరన్న శైలి సాహిత్యం, గోరటి వెంకన్న పాటల్లోని ఆర్ధ్రతను మేళవించి పాటలు రాసే ప్రయత్నం చేసినట్లు చెప్తాడు యష్పాల్. మలితరం పాటకవుల్లో కోదారి శ్రీనివాస్, మిట్టపల్లి సురెందర్, అభి నయ శ్రీనివాస్, సాయిచంద్, గిద్దె రామనర్సయ్య, అంబటి వెంకన్న, మాట్ల తిరుపతి పాటలంటే ఇష్టమని అంటడు. ఇంకా ఎందరో పాటకవులు చాలా అద్భుతంగ పాటలు రాస్తున్నందుకు ఆనందపడతడు. తెలంగాణ వీరుల త్యాగనిరతిని, అమర త్వాన్ని అద్భుత మైన గానం చేస్తడు. తెలంగాణ ఉద్యమంలో ప్రతి నోట పల్లవించిన పాట, ప్రతి మదిని కదిలించిన పాట ఆవేశం, దుఃఖం కలెగలిసి ప్రవహించిన పాట

**"వీరుల్లారా వీర వనితల్లారా..**
**అమ్మ రుణముకై రణములొరిగినారా**
**తెలంగాణలో కంటి సెమ్మల్లారా...**
**నునువెచ్చటి నెత్తురు చిందినారా**
**ఆంధ్ర పాలకుల గుండెల్లోన ఉయ్యాలో ఉయ్యాల**
**విముక్తి కోరుతు విసిరిన బాకై ఉయ్యాలో ఉయ్యాల**
**యూనివర్సిటి మైదానాలే ఉయ్యాలో ఉయ్యాల**
**కదనరంగమున కాలుదువ్వినయ్ ఉయ్యాలో ఉయ్యాల**
**గునుగుపూల నవ్వుల్లారా మోదుగుపూల వనముల్లారా**
**తంగెడు పూల రెమ్మల్లారా బతుకమ్మ బంతుల్లారా"** అంటూ అరవైతొమ్మిది నుంచి రగిలిన తెలంగాణ ఉద్యమ నినాదాన్ని మోగిస్తడు. వాకిళ్ళలో ముగ్గులై పర్సుకున్న అమరుల వీరత్వాన్ని గానం చేస్తడు. అదేవిధంగ గతంలోనే రాసిన పాట అయినప్పటికి టి.ఆర్.ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ నదీ జలాల మీద తీసిన ప్రత్యేక ఆడియో సి.డి. కోసం రికార్డు చేసినపాట యష్పాల్ పాట, తెలంగాణ కరువును కండ్లకు

కట్టినట్లు చూపించే పాట

**"గోదారి గోదారి ఓహో పారేటి గోదారి**

**సుట్టునీళ్ళు ఉన్న సుక్కదొరకని ఎడారి ఈ భూమిర**

**మాది తెలంగాణ భూమి**

**బాయెంత దీసిన నీళ్ళు గుక్కెడు పడవయ్యో**

**బండమీద బాయి తీసినట్టుండే**

**బతుకిట్ల తెల్లారే.. మా బాదెట్ల తీరేనో**

**భూములున్నయమ్మో దున్నే సత్తువున్నదమ్మో**

**సాగునీరు లేక సత్తుబండలాయె / బీడుబద్దయమ్మో**

**భూములు పాడుబద్దయమ్మో..."** అంటూ తెలంగాణ గోసని, సాగు, తాగు నీరు లేక అల్లాడుతున్న పల్లెల్ని కలెదిరుగుతడు. శ్రమతత్వంతో నిండిన తెలంగాణ పనిలేక వలసపోతున్న దుస్తితిని, ముఖ్యం గా గోదావరి నీళ్ళు ఈ నేలకు అందని దయనీయస్థితిని కవిత్వీకరిస్తడు. కన్నీళ్ళు పెట్టిస్తడు. అందుకే యష్‌పాల్ రాసిన ఈ పాట నాటి ఉద్యమనాయకుడు నేటి తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతో పాటు మరెందరినో కదిలించిందని అంటడు యష్‌పాల్. తెలం గాణ ఉద్యమం ఉధ్రుతలూగుతున్న సంద ర్భంలో యష్‌పాల్ రాసిన మరోపాట

**"జైజై బోలో తెలంగాణ జైబోలో తెలంగాణ**

**జైత్రయాత్ర నడుపుతున్న జై తెలంగాణ బోలో..**

**జైజై బోలో... బోలో జైజై బోలో**

**వందనం వీరులకొందనం వందనం ధీరులకొందనం**

**పంటనెత్తుకెలుతుంటె కంటనీరు వద్దనీ**

**ఓరుగల్లు కోటకే పోరుపాఠం నేర్పమనీ"** ఆకాంక్షిస్తడు. పోరాట దారుల్లో అలుపులేకుండా సాగిపోదామని హల్‌చల్ జేస్తడు. తన ఉన్నతికి అరుణోదయ అందించిన తోడ్పాటును ఆయన ఏనాడు మరిచి పోలేనని అంటడు.

సహజంగ యష్‌పాల్ పుస్తక ప్రియుడు. పుస్తకాలు చదవడ మంటే ఆయనకు ప్రాణం. ఒకానొక సందర్భంలో డా॥ మామిడి హరికృష్ణ "నేను పుస్తకం చదవని రోజు ఏదైన ఉన్నదంటే అది నేను చనిపోయిన రోజే" అని ప్రకటించినట్టు యష్‌పాల్ కూడ తాను ఎక్కువకాలం పుస్తకాలతోనే ముచ్చటిస్తడు. ఈ క్రమంలోనే చలం, శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, రంగనాయకమ్మ సా హిత్యం, నవలలు, కథల వంటి వాటికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తడు. యష్‌పాల్ స్వయంగా నాలుగువేలకు పైగా పుస్తకాలను సంపాదించి తన ఇంట్లోనే ఒక గొప్ప గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకున్నడు. మారుమూల గ్రామమైన "జూలూరుపాడు"లో గల బడికి పంతుల్లు కూడ వచ్చే పరిస్థితి లేదు. అట్లాంటి సమయంలో యష్‌పాల్ అక్కడి విద్యార్థులను చేరదీసి పాఠాలు బోధించిండు. యష్‌పాల్ డప్పు మీద అనేక దరువులను సృష్టిస్తడు. ముప్పయ్ రకాల జతులను వాయిస్తడు. అదేవిధంగ ఇరవై రకాల కోలాట నడకలతో పాటు అందమైన, అద్భుతమైన జడకోపులను అల్లడంలో సిద్ధహస్తుడు.

శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ దాక ఉద్యమంలో భాగంగా దాదాపు వెయ్యి నుంచి పదిహేను వందల జానపదాలను సేకరించిండు. వాటిమీద విశ్లేషణాత్మక పరిశోధన చేస్తున్నడు. ప్రస్తుతం వాటిని ఆడియో,పుస్తక రూపం లో తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నడు. వీటిలో మహబూబ్‌నగర్ జిల్లాలో సేకరించిన జానపద పాటలు ఎక్కువగా ఉన్నాయి. అవి కూడ కార్మిక వర్గదృక్పథంతో ఉన్న పాటల్ని ఒకచోట చేర్చి ప్రజల సాహిత్యాన్ని వెలికితీసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన యష్‌పాల్ ఆశయం సిద్ధించాలని కోరుకుందాం. తెలంగాణ వికాస సమితి సాంస్కృతిక శాఖ కన్వీనర్‌గా కొనసాగుతున్న యష్‌పాల్ సమాజానికి బుద్ధుని మార్గమే సరైనదని అంటడు. ఈ విషయంలో పూలే, అంబేద్కర్‌లను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధనకు సిద్దం కావాలని శక్తి వంతమైన, సస్యశ్యామలమైన సమాజాన్ని తయారు చేసుకోవాలని అంటడు.

యష్‌పాల్ సినిమాలకు సైతం పాటల్ని అందించిండు. యష్‌పాల్‌ని సినిమా రంగానికి పరిచయం చేసిన ఆర్. నారాయణ మూర్తి ఛలో అసెంబ్లీ, వీర తెలంగాణ, రైతురాజ్యం, నిర్భయ భారతం, దండకారణ్యం వంటి సినిమాలకు పాటలు రాసే అవకాశాన్ని కల్పించిండు. యష్‌పాల్ దండకారణ్యం సినిమాలో ఆద్యంతం ఒక గిరిజన యువకుడిగా నటించిండు కూడ. ఈ విధంగ చింతమళ్ళ వెంకయ్య తెలుగు సాహిత్యంలో యష్‌పాల్‌గా తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నాడు.



**గద్దర్‌తో యష్‌పాల్-కరుణ దంపతులు**

ఈ సందర్భంలోనే యష్‌పాల్ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఒక ఊపును ఉత్సాహాన్ని తీసుకొచ్చిన ఘనత రసమయి బాలకిషన్ దైతే, తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ కవిగాయకులు, కళాకారులను గుర్తించి గౌరవిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని అంటడు. సాంస్కృతిక సారథి చైర్మన్‌గా రసమయిని నియమించినప్పుడే పాటకు పట్టాభిషేకం జరిగిందని అంటాడు.

సాంస్కృతిక సారథిలో మొదటి ఉద్యోగిగా నియామక పత్రం అందుకున్న యష్‌పాల్ ప్రస్తుతం తెలంగాణ సాంస్కృతిక సారథిలో రచయితల రాష్ట్ర కో- ఆర్డినేటర్‌గా ఉద్యోగ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నాడు.

పుస్తక ప్రేమికుడు, పాటే ప్రాణంగ బతుకుతున్న యష్‌పాల్ ఆశలు, ఆశయాలు నెరవేరి ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుందాం.

**-అంబటి వేకువ,**

**మొబైల్: 94927 55448**

**మెయిల్:** varji.ambati@gmail.com

# మూసీతీరంలో సీఎంయస్ వాతావరణ్ -2017




**చింతచెట్టుకింద జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ సలహాదారు బి. పాపారావు. చిత్రంలో ఆనంద్‌రాజ్ వర్మ , జీహెచ్‌ఎంసీ ప్రతినిధి, సజ్జాద్ షాహిద్, సీఎంయస్ చైర్మన్ భాస్కర్‌రావు, యం. వేదకుమార్, సీఎంయస్ రీజనల్ మేనేజర్ అనిత మేడసాని, శోభాసింగ్ తదితరులు**

సీఎంయస్ వాతావరణ్ -2017లో భాగంగా మూసీ రివర్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ 2017ను చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీతో కలసి జనవరి 18 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్ నగరంలో నిర్వహించారు. ఇది ఈ సిరీస్‌లో 7వ ట్రావెలింగ్ ఫెస్టివల్. దేశవ్యాప్తంగా దీన్ని 7 నగరాల్లో నిర్వహించారు. గువాహతి, పుణె, గాంధీనగర్ & అహ్మదాబాద్, అలహాబాద్, త్రిచి, హైదరాబాద్‌లో వీటిలో ఉన్నాయి. 2016 సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఈ దేశవ్యాప్త ఫెస్టివల్ హైదరాబాద్ కార్యక్రమంతో ముగిసింది. ఈ ఫెస్టివల్ ట్రావెలింగ్ ఎడిషన్‌కు 'వాటర్ ఫర్ లైఫ్'ను థీమ్‌గా ఎంచుకున్నారు. ఆయా నగరాల గుండా ప్రవహిస్తున్న నదులకు అంకితమిస్తూ ఈ ఫెస్టివల్స్‌ను నిర్వహించారు.

**ఇదీ లక్ష్యం**

నీటి సంరక్షణ, పర్యావరణ అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం మూసీ రివర్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ 2017 లక్ష్యం. ఇందులో భాగంగా నీరు. నదులు ప్రధానాంశంగా ఉండే, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన చిత్రాలను ప్రదర్శించడం, చర్చాగోష్టులు నిర్వహించడం చేశారు. పాఠశాల విద్యార్థులు, ఇదే విధమైన భావజాలం కలిగిన వారికి వీలు కల్పించేలా నగరంలో వివిధ ప్రాంతాల్లో వీటిని నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌లో భాగంగా మూసీ నదీ తీరాన గ్రీన్ ఫిల్మ్ అప్రిసియేషన్, కల్చరల్, లిటరరీ మీట్‌ను నిర్వహించారు. మూసీ రివర్ వాక్‌ను నిర్వహించారు. తెలంగాణ నుంచి హరిత ప్రచారకర్త సుభాష్ రెడ్డిని సన్మానించారు.



ఈ ఫెస్టివల్‌లో భాగంగా జనవరి 19 నుంచి 21 వరకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ రూమ్‌లో ఉదయం, మధ్యాహ్నం వివిధ సినిమాలను ప్రదర్శించారు. చర్చాగోష్టులను నిర్వహించారు. జనవరి 20న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రివర్ వాక్ / ఆర్ట్ / ఫోటోగ్రఫీ క్యాంప్‌ను మూసీతీరంలో నిర్వహించారు. జనవరి 21న సాయంత్రం 6 గంటలకు ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (అఫ్జల్‌గంజ్) పార్క్‌లోని చింతచెట్టు వద్ద సాంస్కృతిక, సాహిత్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ ఫెస్టివల్‌లో భాగంగా 'ది బ్లాక్ రివర్'ను ప్రదర్శనతో మూసీ రివర్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి సత్యనారాయణ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, లేని పక్షంలో సమీప భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. చిత్రాల ప్రదర్శన, చర్చాగోష్టుల్లో సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మూసీ రివర్ ఫెస్టివల్ కార్యక్రమ నిర్వహణలో కాలుష్య నియంత్రణ మండలి కూడా పాలుపంచుకుంది.

సీఎంయస్ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ అనిత మేడసాని, చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ (తెలంగాణ) చైర్మన్ యం.వేదకుమార్ తదితరులు ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు.

**హెరిటేజ్ వాక్**

మూసీ రివర్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ 2017లో భాగంగా నిర్వహించిన హెరిటేజ్ వాక్‌లో హైదరాబాద్‌కు చెందిన ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ (హిమాయత్ నగర్), డైమండ్ జూబ్లీ స్కూల్, ఇతర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా నగరంలో పర్యావరణ, వన్యప్రాణి సంరక్షణ సంబంధిత అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌ను కూడా నిర్వహించారు. సిటీ కాలేజ్ నుంచి ప్రారంభమైన ఈ హెరిటేజ్ వాక్ సాలార్‌జంగ్ మ్యూజియం వద్ద ముగిసింది. ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు యం.వేదకుమార్ నేతృత్వంలో ఈ హెరిటేజ్ వాక్ జరిగింది.

**మూసీ నదిని కాపాడుకోవాలి**

మూసీ నదిని కాపాడడం కోసం రూపొందించిన, అమలు చేసిన ప్రాజెక్టుల్లో చాలావరకు రియల్ ఎస్టేట్ లక్ష్యంగా కొనసాగాయి. ఈ సమస్యకు ఆచరణసాధ్యమైన ఏకైక పరిష్కారం ఎకొలాజికల్, హెరిటేజ్, మెట్రోపాలిటన్ జోన్‌లను ఏర్పాటు చేయడమని వేదకుమార్ ఈ సందర్భంగా అన్నారు. తద్వారా ప్రజలు, నది సహజీవనం చేయగలరని పేర్కొన్నారు.

**ఘనంగా 'షామ్-ఎ-మూసీ'**

మూసీ రివర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను పురస్కరించుకొని దక్కన్ అకాడమీ, చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ, ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్‌ల సహకారంతో సీఎంసీ వాతావరణ్ ఆధ్వర్యంలో జనవరి 21, శనివారం 'షామ్- ఎ-మూసీ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ పార్క్ ఆవరణలోని చింత చెట్టు కింద ఈ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు బి.వి.పాపారావు ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథిగా జీహెచ్ఎంసీ కమిషనర్ బి.జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ప్రముఖ చరిత్రకారుడు ఆనంద్ రాజ్ వర్మ, సెంటర్ ఫర్ దక్కన్ స్టడీస్ కార్యదర్శి సజ్జాద్ షాహిద్, దక్కన్ అకాడమీ చైర్మన్ యం. వేదకుమార్, సీఎంఎస్ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ అనిత మేడసాని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నరేందర్ రాయ్, సురేశ్ బాబు, కిశోర్ కుమార్ దూబెలు నాటి మూసీ వరదలపై లావనీలు ఆలపించారు. హైదరాబాద్ నగర చరిత్ర, సంస్కృతి అంశాలు ప్రధాన థీమ్‌గా పాటలు, జానపద గీతాలు, కవితలు కూడా ఈ కార్యక్రమంలో చోటు చేసుకున్నాయి. గజల్స్ కూడా ఆలపించారు. విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించడం ఈ దఫా చోటుచేసుకున్న కీలక పరిణామంగా చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాష, సాంస్కృతిక శాఖ, అటవీ శాఖ ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించాయి.

మూసీ నదికి వరదలు రావడం, ఆ వరదల్లో నగరంలోని పలు ప్రాంతాలు మునిగిపోవడం, ఇళ్ళు, ఇతర నిర్మాణాలు కూలిపోవడం, ప్రజలు నిరాశ్రయులు కావడం, వరద పోటెత్తిన సమయంలో ప్రజలు ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ఆవరణలోని చింత చెట్టుతో పాటుగా వివిధ ఎత్తయిన ప్రాంతాలను ఆశ్రయించడం వంటివన్నీ ఈ పాటల్లో చోటు చేసుకున్నాయి.

హైదరాబాద్ నగరం భిన్న సంస్కృతులకు నిలయం. అందుకే దీన్ని గంగా జమున తెహజీబ్‌గా అభివర్ణిస్తుంటారు. వివిధ దేశస్తులు, ఇతర నగరాలకు, రాష్ట్రాలకు చెందిన వారు వందల ఏళ్ళుగా ఇక్కడ నివసిస్తూ హైదరాబాద్‌తో మమేకమైపోయారు. ఇదంతా కూడా ఈ పాటలు, కవితలు, గజల్స్‌లో వ్యక్తమైంది.

మూసీ రివర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను పురస్కరించుకొని నది, పర్యావరణం, వన్యప్రాణి సంరక్షణ అంశాల థీమ్‌తో సుమారుగా 47 చిత్రాలను రవీంద్రభారతి, పీసీబీలలో ప్రదర్శించారు. రివర్ వాక్ కూడా నిర్వహించారు. నది, అడవులు, వన్యప్రాణులు, పర్యావరణం వంటి అంశాలతో రూపొందిన చిత్రా లు, డాక్యుమెంటరీలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇకపై ఈ షామ్ - ఎ- మూసీ తరహా కార్యక్రమాన్ని నగరంలోని వివిధ ప్రాంతాల్లో, ప్రతి నెల ఒక చోట నిర్వహించాలని దక్కన్ అకాడమీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భాగస్వామి కావాల్సిందిగా జీహెచ్ఎంసీని కోరినట్లు దక్కన్ అకాడమీ చైర్మన్ యం. వేదకుమార్ తెలిపారు.

**- కట్ట ప్రభాకర్, చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ, హైదరాబాద్** ద





**ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, చిత్రంలో అనిత మేడసాని, ధనుంజయ. (పక్కన) ముగింపు సమావేశంలో గ్రీన్ అవార్డు అందుకుంటున్న సుభాష్‌రెడ్డి. చిత్రంలో అనిత మేడసాని, పీసీబీ మెంబర్ సెక్రటరీ పి. సత్యనారాయణరెడ్డి ఐఏఎస్, యం. వేదకుమార్, యం.హెచ్.రావు, రవికుమార్**

# రాష్ట్రంలో కొరియన్ ఇండస్ట్రియల్ పార్కు

రాష్ట్రంలో పెట్టుబడులకు జపాన్, కొరియా కంపెనీలు ముందుకు వచ్చాయని ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. జపాన్, దక్షిణ కొరియా దేశాలలో మంత్రి కేటీఆర్ బృందం ఇటీవల పర్యటించింది. తమ పర్యటన సందర్భంగా హిటాచీ, సాఫ్ట్ బ్యాంకు, తోషిబా, సుమి టోమో, ఈసాయి కంపెనీల ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. నవంబర్‌లో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు హాజరయ్యేందుకు సాఫ్ట్ బ్యాంకు సీఈవో అంగీకరించారని తెలిపారు.



**టీఎస్‌ఐపాస్‌కు ప్రశంసలు..**

టీఎస్ఐపాస్ గురించి విని అక్కడి పారిశ్రామిక వేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేశారని, ఇలాంటి అద్భుతమైన పాలసీ వల్ల రాష్ట్రానికి కచ్చితంగా మేలు కలుగుతుందని చెప్పారని మంత్రి తెలిపారు. జెట్రో, కీడెన్‌రాన్ జపాన్ వ్యాపార వాణిజ్య సంఘాలతో జరిపిన సమావేశాలతో వారికి రాష్ట్రం మీద మంచి అవగాహన వచ్చిందని కేటీఆర్ చెప్పారు. టోక్యో, ఒసా కా నగరాల్లో మరోసారి వాణిజ్య సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. మన టీ హబ్, టాస్క్ సంస్థలతో జపాన్ కంపెనీలు కలిసి పనిచేయబోతున్నాయని వివరించారు. ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, ఫార్మా, వైద్య పరికరాల తయారీ, మెడికల్ టూరిజం రంగాల్లో పెట్టుబడులకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. జైకాతో జరిగిన సమావేశం సంతృప్తినిచ్చిందని, రాష్ట్రంలో చేపడుతున్న పలు ప్రాజెక్టులకు నిధులిచ్చేందుకు సూచనప్రాయ అంగీకారం కుదిరిందని చెప్పారు. తమ పర్యటనలో సహకరించిన కొరియా, జపాన్‌లోని భారత రాయబారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**రాష్ట్రంలో కొరియన్ ఇండస్ట్రియల్ పార్కు**

దక్షిణ కొరియా పరిశ్రమలు తెలంగాణలో కార్యకలాపాలను ప్రారంభించడం కోసం రాష్ట్రంలో కొరియన్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. దక్షిణకొరియా పర్యటనలో ఉన్న కేటీఆర్ అక్కడి పారిశ్రామికవేత్తల సదస్సులో ప్రసంగించారు. తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు వచ్చే కొరియన్ సంస్థలకోసం ప్రత్యేకంగా కొరియన్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రానికి వచ్చే ప్రతి కొరియన్ పెట్టుబడిదారుడికి పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఉత్తమ సౌకర్యాలు, పాలసీలు అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్రమే కొరియన్ కంపెనీలకు భారతదేశంలో అత్యుత్తమ ఆకర్షణీయమైన గమ్యస్థానమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల బృందంతో దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న మంత్రి కేటీఆర్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇన్ కొరియా (ఐసీసీకే) ఏర్పాటు చేసిన వ్యాపారవేత్తల సమావేశంలో ప్రసంగించారు. సియోల్‌లో జరిగిన ఈ సమావేశానికి వందకు పైగా వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రాన్ని వారికి పరిచయం చేసిన మంత్రి, ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం-సింగిల్ విండో విధానం-15 రోజుల్లో కచ్చితమైన అనుమతులు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, లైఫ్ సైన్సెస్, ఆటోమోటివ్ మెషినరీ, ఇంజినీరింగ్ వంటి రంగాల్లో తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలు, ప్రత్యేక సౌకర్యాలు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వివరించారు. కొరియాలో భారత రాయబారి విక్రం దొరైస్వామి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పలు కంపెనీల ప్రతినిధులు, తెలంగాణ ప్రభుత్వ పాలసీలను అభినందించారు. మంత్రి ప్రసంగించిన తీరును మెచ్చుకున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులపై ఆసక్తి కనబరుస్తూ అనేక విషయాలను అడిగి తెలుసుకున్నారు.

**సామ్‌సంగ్ ప్రతినిధులతో భేటీ..**

మంత్రి కేటీఆర్ బృందం ప్రతిష్ఠాత్మక సామ్‌సంగ్ కంపెనీ సీనియర్ ప్రతినిధుల బృందంతో సమావేశమైంది. సీనియర్ ఉపాధ్యక్షుడు సంగ్ మో యిమ్, ఉపాధ్యక్షుడు పీటర్ రీ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ-తయారీ అవకాశాలపైన కేటీఆర్ వారికి వివరించారు. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ ప్రోత్సాహానికి తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక పాలసీని, ఇందుకోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతుల వివరాలను మంత్రి తెలిపారు. హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ డివైజ్ పార్క్‌లో సామ్‌సంగ్ సంస్థ ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కేటీఆర్ ఆహ్వానించారు. సామ్‌సంగ్ ఇన్నోవేషన్ మ్యూజియంను కేటీఆర్ బృందం సందర్శించింది. ఈ పర్యటనలో మంత్రితో పాటు పరిశ్రమలు, ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్, సుజయ్ కారంపూడి తదితరులు పాల్గొన్నారు.

భారత చాంబర్ అఫ్ కామర్స్ దక్షిణ కొరియా ఏర్పాటు చేసిన వ్యాపారవేత్తల సమావేశంలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. సియోల్ లో జరిగిన ఈ సమావేశంలో సుమారు వందకు పైగా వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం గురించి వివరించిన మంత్రి, ఇక్కడి ప్రభుత్వ విధానాలపైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానంలోని సింగిల్ విండో అనుమతులు, 15 రోజుల్లో ఖచ్చితమైన అనుమతుల వంటి విశిష్టమైన అంశాలను వారికి మంత్రి తెలియజేశారు.

కొరియాలో భారత రాయబారి విక్రం దొరైస్వామి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో కొరియా సంస్థల కోసం ప్రత్యేకంగా కొరియన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణకు వచ్చే ప్రతి కొరియన్ పెట్టుబడికి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు. కొరియన్ కంపెనీలకు భారత దేశంలో ఉత్తమ సౌకర్యాలు, పాలసీలు ఉన్న తెలంగాణ రాష్ట్రమే అత్యుత్తమ అకర్షణీయమైన ప్రాంతంగా మంత్రి అభివర్ణించారు. మంత్రి వెంబడి పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, ఐటి శాఖ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ కారంపూరిలు ఉన్నారు.

**తెలంగాణ రాష్ట్రం ఎంతో ప్రగతిశీలమైన పారిశ్రామిక పాలసీని తీసుకువచ్చిందని చెబుతూ, ఈ పాలసీ రూపకల్పనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశామని తెలియజేశారు.**

**మూసీ ప్రక్షాళనకు అంతర్జాతీయ అనుభవాలు**

మూసీ నది ప్రక్షాళనకు అంతర్జాతీయ అనుభవాలను ఉపయోగించుకుంటామని పురపాలక, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు అన్నారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా మంత్రి కేటీఆర్ సియోల్‌లోని చియోన్‌గిచియోన్-రో నది ప్రక్షాళన తీరును పరిశీలించారు. నది ప్రక్షాళనకు అక్కడి ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమాలు, పనులను అడిగి తెలుసుకున్నారు. నదిని ప్రక్షాళనకు కృషి చేసిన అధికారుల నిబద్ధతను మంత్రి ప్రశంసించారు. నది ప్రక్షాళనకు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేసిన తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరం మధ్య నుంచి ప్రవహించే మూసీ నదిని ప్రక్షాళన చేస్తున్నదని తెలిపారు. ప్రపంచంలోని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన ప్రాంతాల అనుభవాల అధారంగా పనిచేస్తామని తెలిపారు. హనమ్ సిటీలోని యూనియన్ టవర్స్‌లో పర్యటించిన మంత్రి అక్కడి వేస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతులపై అధ్యయనం చేశారు. నగరంలో వాయు కాలుష్యం తగ్గించేందుకు చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లోనూ వాయుకాలుష్యం తగ్గించేందుకు ఒక అథారిటీని ఏర్పాటుచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ నగరంలో వాయుకాలుష్యం తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. దీనికోసం త్వరలోనే నగరంలోని కాలుష్యకారక పరిశ్రమలను నగర శివారుకు తరలించనున్నట్లు వివరించారు.

**జపాన్ పర్యటనలో పలు దిగ్గజ కంపెనీలతో మంత్రి భేటీ**

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు జపాన్లో పర్యటిస్తున్న ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు పలు ప్రముఖ కంపెనీలతో సమావేశం అయ్యారు. హిటాచీ, సోనీ, తోషిభా, మిత్సుబిషి, ఫుజిత్సూ లాంటి ప్రముఖ కంపెనీల సినియర్ కార్యనిర్వహక బృందాలతో సమావేశం అయ్యారు. జపాన్ బిజినెస్ ఫెడరేషన్ "కైదాన్రెన్" ఈ సమావేశాన్ని నిర్వహించింది. ఈ జపనీస్ కంపెనీల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించిన మంత్రి తెలంగాణ రాష్ట్రం, ఇక్కడ పెట్టుబడులకు గల అవకాశాల గురించి, ప్రభుత్వ విధానాల గురించి వివరించారు.

హిటాచీ కంపెనీ ఉపాధ్యక్షులు అకిరా శిమిజు, యండి కోజిన్ నకకిటలతో మంత్రి సమావేశం అయ్యారు. తెలంగాణలోని హిటాచీ కంపెనీ విస్తరణ, భవిష్యత్తు పెట్టుబడులపైన చర్చించారు. హైదరాబాద్ నగరంలో హిటాచీ కంపెనీ నిర్వహిస్తున్న కార్యకలాపాలను మరింత విస్తరించే అవకాశాలను పరిశీలిస్తామని హిటాచీ ప్రతినిధులు మంత్రికి తెలిపారు.

ప్రపంచంలోని టాప్ 25 ఫార్మాస్యూటికల్ కంపెనీల్లో ఒకటైన ఈసాయి ఉపాధ్యక్షులు సాయోకొ సాసకితో మంత్రి కేటీఆర్ సమావేశం అయ్యారు. తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న ఫార్మా సిటీ, హైదరాబాద్ నగరానికి ఫార్మా రంగంలో గల అనుకూలతల గురించి మంత్రి వివరాలు అందజేశారు. హైదరాబాద్ ఫార్మాసిటీపైన సాయోకొ సాసకి ఆసక్తి వ్యక్తంచేశారు.

**దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారం అవసరం: కేటీఆర్**

చెన్నైలో 'ఇండియా టుడే' పత్రిక వారు నిర్వహించిన కాంక్లేవ్ సౌత్ లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు పాల్గొన్నారు. "వై ఇన్వెస్ట్ ఇన్ సౌత్ - ద కేస్ ఫర్ చేంజ్" అనే అంశంపై జరిగిన చర్చలో దక్షిణాది రాష్ట్రాల పరిశ్రమల మంత్రులతో పాటు ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెట్టుబడుల కొరకు పోటీ ఇప్పుడు దేశంలోని నగరాల మధ్యనే కాక ప్రపంచవ్యాప్తంగా ఉన్న నగరాల మధ్య ఉన్నదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఎంతో ప్రగతిశీలమైన పారిశ్రామిక పాలసీని తీసుకువచ్చిందని చెబుతూ, ఈ పాలసీ రూపకల్పనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశామని తెలియజేశారు. పరిశ్రమలను త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో ప్రవేశపెట్టిన విషయం సభికులకు తెలియజేశారు.

దక్షిణాది రాష్ట్రాల్లో పెట్టుబడుల విషయంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో అనుకూలత ఉన్నదని, కనుక ఈ రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడుతూనే పరస్పరం సహకరించుకోవాలని మంత్రి చర్చలో పాల్గొన్న ఇతర రాష్ట్రాల పరిశ్రమల మంత్రులకు మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. -దక్కన్ న్యూస్

ద

# సదాశయం కోసం కళ

# అమితా తల్వార్!



ఫొటోగ్రఫీ రంగంలో ఆమె పేరు ఎందరికో సుపరిచితం. ప్రముఖ ఫోటోగ్రాఫర్ అమితా తల్వార్ దేశమంతటా విస్తృతంగా పర్యటించి ఆకట్టుకునే చిత్రాలెన్నో తీశారు. తాను నూతనంగా చే పట్టిన లాభాపేక్షరహిత ఆర్ట్ ఫర్ కాజెస్ అనే కార్యక్రమం కోసం వీటిని ఉపయోగించుకోవడంలో ఆమె బిజీగా ఉన్నారు. ఈ చిత్రా లను ఇటీవల తాను నిర్వహించిన సోలో ప్రదర్శనల్లో ప్రదర్శించారు. ఆయా ప్రాంతాల ఆధ్యాత్మిక తను కెమెరాలో బంధించడంపై ఆమెకు ఆసక్తి. 'నేను చూసిన ప్రాంతాలన్నింటిలోకి, ఆధ్యాత్మికత దృష్ట్యా వారణాసి ఎంతో ప్రత్యేకమైంది' అని ఆమె అంటారు.

ఈ ప్రదర్శనల ద్వారా వచ్చిన విక్రయ మొత్తాలను ఆమె ఆరు ఎన్‌జీవోలకు, దాతృత్వ సంస్థలకు విరాళంగా ఇవ్వనున్నారు. వృద్ధులకు, కేన్సర్‌తో బాధపడే చిన్నారులకు సేవ చేసేవి మొదలుకొని జంతువులకు సేవలు అందించే వరకూ వివిధ సంస్థలు వీటిలో ఉన్నాయి.

సంప్రదాయక నిధుల సేకరణకు భిన్నమైన కార్యకలాపాలను ఆమె చేపడుతున్నారు. అందుకు గాను ప్రపంచవ్యాప్తంగా వంద మంది కళాకారులతో ఆమె ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఆమె తీసిన చిత్రాలను ఆధారంగా చేసుకొని వారు వాటిని చిత్రించడం, శిల్పంగా చెక్కడం, వాటినే మరో విధంగా ఫోటో తీయడం...ఇలా ఎన్నో రకాలుగా కళారూపాలుగా మారుస్తారు. వీటిని విక్రయిం చడం ద్వారా వచ్చే మొత్తాలను వివిధ సామాజిక సేవాసంస్థలకు అందిస్తారు.

అమితా తల్వార్ గనుక తనదైన మార్గంలోనే ఉండిఉంటే... చత్తీస్‌గఢ్‌లోని ఓ మారుమూల పల్లెలో సహయోగ్ ఫౌండేషన్ కోసం పనిచేసుకుంటూ ఉండే వారు. యూనివర్సిటీ ఆఫ్ హవాయి ప్రొ ఫెసర్ రామ్‌దాస్ లాంబ్‌తో కలిసి ఆమె దాన్ని ఏర్పాటు చేశారు. తాను అమితంగా ఇష్టపడే ఫోటోగ్రఫీకి వెచ్చించే సమయానికి మించి సమయాన్ని ఆమె దాని కోసం వెచ్చించారు. రకరకాల ఇతర వత్తిళ్లూ ఆమె సమయాన్ని ఆమెకు దక్కకుండా చేశాయి. ఆమె నిర్వహిస్తున్న ఛానల్ 6 విషయానికి వస్తే, ఈ తరహాలో వెలువడిన తొలి సిటీగైడ్ లలో అది ఒకటి. ఇటీవలే దాని ఫార్మాట్‌లో ఎన్నో మార్పులు చో టు చేసుకున్నాయి. ఆమె మొదటి కాఫీటేబుల్ బుక్ రిలీజ్ కోసం కూడా ఆమె ఎంతో శ్రమించాల్సి వచ్చింది. ఫామ్స్ ఆఫ్ ది ఫామ్‌లెస్ పేరిట ఆ పుస్తకం విడుదలైంది. లడఖ్ మొదలుకొని తమిళనాడు మారుమూల ప్రాంతాల దాకా వెల్లువెత్తే ఆధ్యాత్మికతను ప్రతిరూపం గా అది రూపుదిద్దుకుంది. అదే సమయంలో ప్రయాణం, ఫోటో గ్రఫీల పై ఆమె మక్కువను కూడా అది చాటిచెబుతుంది.

'నేను తీసిన ఫోటోగ్రాఫ్‌లుఒక ఉదాత్త ఆశయం కోసం ఉ పయోగపడగలవని నేను గుర్తించాను. అది నాకెంతో ఆనందం కలిగించింది' అని అన్నారు.

కొన్నేళ్ళుగా వివిధ రంగాల్లో ఆమె సాధించిన పేరు ప్రఖ్యా తులు ఈ ఫోటోల విక్రయానికి అండగా నిలిచాయి. వాటిని వేలం వేసినప్పుడు మంచి ధర వచ్చేందుకు తోడ్పడ్డాయి. మల్టిపుల్ స్కె లెరోసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా కోసం ఆమె నిర్వహించిన ప్రదర్శన ద్వారా రూ.10 లక్షల మొత్తం లభించింది. 'ఆశయం ఉదాత్తమైనది అయితే, అందుకు ఒక సంస్థ కూడా విశిష్ట రీతిలో కృషి చేస్తుంటే, దానికి తోడ్పడేందుకు ప్రజలు ముందుకురావడాన్ని నేను చూశాను' అని అన్నారు.

అమితా తల్వార్ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఒక రచయిత, ప్రచురణకర్త, ఫోటోగ్రాఫర్, డాక్యుమెంటరీ ఫిల్మ్‌మేకర్. బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్‌కు అధ్యక్షురాలు...ఇలా అలవోకగా ఏకకాలంలో ఎన్నో పాత్రలను ఆమె పోషిస్తుంటారు. వీటన్నింటిలోకి ఆమెకు ఫోటోగ్రాఫర్ పాత్ర పోషించడమే ఇష్టం. ఫోటోగ్రఫీ గురించి మాట్లా డేటప్పుడు ఆమె కళ్ళలో 'ఫ్లాష్' వెలుగుతుంది. ఈ ఆసక్తి ఆమెకు తండ్రి నుంచి వారసత్వంగా సంక్రమించింది. "మా చిన్నతనంలో నాన్న మమ్మల్ని ఫోటో తీసేవారు...మరీ ముఖ్యంగా మా అమ్మను. ఆమె ఎంతో అందగా ఉండేది" అని అంటారు అమితా తల్వార్.

తను తొమ్మిదో తరగతి చదివేటప్పుడే తండ్రి చనిపోవడంతో ఆయన వద్ద నేర్చుకునే అవకాశాన్ని ఆమె కోల్పోయారు. 'పాఠశాల చదవు సమయంలోనే నేను కెమెరా పాఠాలు నేర్చుకోవడం మొదలైంది. నా మొదటి కెమెరా ఆరంగుళాల బ్రోనికా' అంటూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు. ఆమె ఇప్పుడు నికాన్ డి 700 కెమెరాను వినియోగిస్తున్నారు. ఏ కంపెనీ కెమెరాను ఉప యోగిస్తున్నామది అంత ముఖ్యం కాదని అంటారు. ఫోటోగ్రాఫ్‌పై కన్నేసే శక్తి ఉంటే, ఏ ప్రొఫెషనల్ ఎస్‌ఎల్‌ఆర్ అయినా సరిపోతుం దని అంటుంటారు.

వివాహం అయిన తరువాత, ఢిల్లీ నుంచి మస్కట్‌కు మారిన తరువాతే, ఆమెకు ఫోటోగ్రఫీపై ఆసక్తి మరింతగా పెరిగింది. 'నగలు, దుస్తులు లాంటివాటిపై నాకు ఆసక్తి ఉండేది కాదు. అందుకే మా ఆయన కూడా నన్ను కెమెరాలతో ముంచెత్తేవారు' అని అంటారు ఆమె. 'ఆ రోజుల్లో నేను అనుకోకుండానే నేను ఆధ్యాత్మిక చిత్రాలను ఎక్కువగా తీసేదాన్ని' అని అంటారు.

**ఓ పెద్ద ముందడుగు**

తన స్నేహితులంతా ఫోటోలు బాగు న్నాయని ప్రశంసిస్తుండడంతో ఆమె 2005 లో తన మొదటి ఎగ్జిబిషన్ 'ప్రకృతి'ని సృష్టి ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించారు. 2010లో ఇతరులతో కలసి న్యూయార్క్‌లో తన ఫోటో గ్రాఫ్‌లను ప్రదర్శించి, వచ్చిన ఆదాయాన్ని మీరా నాయర్‌కు చెందిన సలామ్ బాలక్ ట్రస్ట్‌కు అందించారు.



ఆమె ప్రస్తుతం తన రెండో పుస్తకం, బెనారస్ ఫోటోగ్రాఫ్‌ల కలెక్షన్‌పై దృష్టి పెట్టారు. ఆమె పని చేయాల్సిన మరో రెండు డాక్యుమెంటరీలు కూడా ఉన్నాయి. వీటిలో ఒకటి చత్తీస్‌గఢ్‌లోని రామ్‌నామి తెగపై తీసింది. మరొకటి సహయోగ్ ఫౌండేషన్ కార్యకలాపాలపై తీసింది.

ఫోటోగ్రఫీ, రచనలు, ఫిల్మ్ మేకింగ్....ఆమె సృజనాత్మక కార్యకలాపాలన్నీ కూడా ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నవే. రచనా వ్యాసంగంతోనే ఆమె సృజనక్షేత్రంలోకి ప్రవేశించారు. భారత దేశానికి తిరిగి రావడానికి ముందు, మస్కట్‌లో ఉన్నప్పుడు ఆమె ఖలీజ్ టైమ్స్, టైమ్స్ ఆఫ్ ఒమన్‌కు వ్యాసాలు రాసేవారు. ఆమె 1990 ఆగస్టులో ఛానల్ 6 పత్రికను ప్రారంభించారు. రెండు దశాబ్దాల అనంతరం, ఇప్పుడు దానిలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు. అదిప్పుడు లైఫ్‌స్టైల్ పత్రికగా మారింది. 'నేను పాటియాలా లో పుట్టి పెరిగినప్పటికీ, హైదరాబాద్ నా సొంతిల్లు' అంటూ నగరంపై తన అభిమానాన్ని చాటుకుంటారు.

**విద్యారంగంలో సామాజిక సేవ**

అమితా తల్వార్ ఆర్ట్ ఫర్ కాజెస్ ద్వారా తన వంతు సా మాజిక సేవ చేస్తున్నారు. సామాజిక, ఆర్థిక జీవన నేపథ్యాలతో సంబంధం లేకుండా ప్రతీ చిన్నారి కూడా తన జీవితంలో ఒక దశ వరకు తరగతిగదిలో గడపాలని ఆ సంస్థ విశ్వసిస్తుంది. అందులో భాగంగా ఏకలవ్య పాఠశాలకు చెందిన విద్యార్థులతో సహా పన్నెం డు మందికి ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది.

"చిన్నతనం నుంచీ మా ఇంట్లో ఫోటోగ్రఫీకి సంబంధించిన వస్తువులెన్నో ఉండేవి.నా చిన్నతనంలో మా నాన్న నాకు బేబీ బ్రౌనీ కెమెరాను బహుమతిగా ఇచ్చారు. అప్పటి నుంచీ కెమెరాతో ప్రేమలో పడిపోయాను" అంటారు ఆమె. అలా ఏర్పడిన అనుబంధం నేటికీ అలా నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. అలా ఆ హాబీ ఒక అర్థవంతమైన అభిరుచిగా మారిపోయింది.

ఆమె తీసే చిత్రాల్లో జీవం తొణికిసలాడుతుంటుంది. ప్రకృతి వర్ణాలు ఎంతో సహజంగా కనిపిస్తాయి. 'ప్రత్యేకించి నేను సబ్జెక్ట్ కోసం చూడను. నేను ప్రయాణిస్తున్నపుడు కొన్ని దృశ్యాలు ఎంతో అద్భుతంగా కనిపిస్తుంటాయి. అలాంటి వాటిని నేను నా కెమెరాలో బంధిస్తాను. ఆ సమయంలో నా హృదయం, మెదడు, సౌందర్య దృష్టి అన్నీ సమ్మిళితమవుతాయి' అంటారు ఆమె.

పర్యటనల గురించి, ఫోటోగ్రఫీ గురించి ఆమె చెప్పడం ప్రారంభిస్తే ఇక దానికి అంతూ అంటూ ఉండదు. ఆ మాటల ప్రవాహం అలా సాగిపోతూనే ఉంటుంది...మధ్యలో మ నం అడ్డుకట్టలు వేసేదాకా.

'బెనారస్ అంటే నాకెంతో ఇష్టం. నాకిష్టమైన ఫోటోగ్రఫీ లొకేషన్స్‌లో అది ఒకటి. కాలాతీత, ఆధ్యా త్మిక దృశ్యాలను అక్కడ చూస్తాం. గంగానది ప్రవా హం, స్నానవాటికలు మదిలో రేకెత్తించే భావోద్వే గాలను మాటల్లో చెప్పడం కన్నా చిత్రాలు గా చెప్పడమే తేలిక' అంటారు.

బెనారస్ అంటే ఆమెకెంతో ఇష్టమైనప్పటికీ పర్వత ప్రాంతా లనూ అమితంగా ఆరాధిస్తారు. లడఖ్ అంటే ఎంతో మక్కువ. జ ర్మనీ లోని బ్లాక్ ఫారెస్ట్ అన్నా ఇష్టమే. బాల్టిక్ దేశాల్లో తన పర్యటన గురించి ఎంతగానో చెబుతారు. అక్కడ ఆమె తీసిన చిత్రాల్లో ప్రకృతి, సంస్కృతి మమేకమవుతాయి. మనల్ని తన్మయపరుస్తాయి. మనమే అక్కడ పర్యటించిన అనుభూతి కలుగుతుంది. సప్తవర్ణాలు అని చె బుతుంటారు గానీ, ఆమె తీసిన చిత్రాల్లో ఆ వర్ణాలు వందలాది షేడ్స్‌గా మారిపోతాయి. కళ్ళతో చూసిన దాని కంటే కూడా అం దంగా ఆ చిత్రాలలో ప్రకృతి మనకు దర్శనమిస్తుంది. అందుకే తాను తీసిన చిత్రాలతో ఆమె ఎంతో ఆనందిస్తారు. ఆ ఆనందాన్ని మనతో పంచుకుంటారు.

అమితా తల్వార్ చిత్రాలను చూసేందుకు ఏమాత్రం అవ కాశం దొరికినా సరే...దాన్ని వదులుకోవద్దు. చూస్తే ఆ జ్ఞాపకాలు .... చూడకలేకపోతే, చూడలేకపోయామనే బాధ...మనల్ని అలా వెంటాడుతూనే ఉంటాయి. **(మరిన్ని చిత్రాలు 3వ కవర్ పేజీలో)**

**- రాజేష్**

ద

# అంబరాన్ని అంటిన ఆనందం





**ఆ**గాఖాన్ అకాడమీలో రెండో అంతర్జాతీయ పతంగుల పండుగ ఆనందోత్సహాలతో ముగిసింది. పర్యాటకుల్ని ఆకర్శించేందుకు చేపట్టిన ఈ ఉత్సవాన్ని వివిధ దేశాలకు చెందిన పర్యాటకులతో పాటు స్థానికులు తిలకించారు. పొడవైన, ఆకర్షణీయమైన పతంగులను ఎగురుతుంటే ఆగాఖాన్ ట్రస్ట్ ప్రాంగణంలో ఆనందం వెల్లవిరిసింది. సాధారణ వాటికి భిన్నంగా జంతువులు, పక్షులు, పురాణ పురుషులను పోలిన భారీ గాలి పటాలు ఆకాశంలో విహరిస్తూ పర్యాటకుల్ని ఆకట్టుకున్నాయి.

**రిమోట్ గాలిపటాలు..**

సింగపూర్ బృందం రిమోట్ కంట్రోల్‌తో ఎగురవేసే పతంగిని రూపొందించింది. ఇది రిమోట్ సాయంతో ఎగురుతుంటే జనం అమితాసక్తితో గమనించారు. ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, జపాన్, కంబోడియా, ఉక్రెయిన్ దేశాలకు చెందిన కైట్ ఫ్లయింగ్ క్లబ్‌లు సందడి చేశాయి. మన దేశానికి చెందిన రాయల్ కైట్ ఫ్లయింగ్ క్లబ్ అహ్మదాబాద్, సిటీ కైట్ ఫ్లయింగ్ క్లబ్ నాగ్‌పూర్, ఆనంద్ కైట్ ఫ్లయింగ్ క్లబ్ రాజ్‌కోట్, డీజే కైట్ ఫ్లయింగ్ క్లబ్ వడోదర, కోహినూర్ కైట్ ఫ్లయింగ్ క్లబ్ హైదరాబాద్, జీమ్ కైట్ ఫ్లయింగ్ క్లబ్ అహ్మదాబాద్ పాల్గొన్నాయి. చేప, రోలర్, బల్లి, ఆక్టోపస్, గుర్రం, తాబేలు, డ్రాగన్, ఫుట్‌బాల్, ఇన్‌ఫ్లటాబ్లస్, గాలితో నిండిన గాలిపటాలు, డైమండ్స్, పక్షులు మొదలైన రూపాల్లో రూపొం దించిన పతంగులను ఎగురవేస్తూ ఈ కైట్ ఫ్లయింగ్ క్లబ్ సభ్యులు పోటీలుపడ్డారు. మహా భారతంలోని ఘటోత్కచుడిని పోలిన ఓ పతంగి పలువురిని ఆకట్టుకుంది. సాంస్కృతిక శాఖ నిర్వహించిన జానపద కళా రూపాలు సందర్శకులను అలరించా యి. అంతకు ముందు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ టూరిజం శాఖ కమిషనర్ సునీత భగవత్ బహుమతులు అందించారు. గతంలో గుజరాత్ లోని అహ్మదాబాద్‌లో పతంగుల ఉత్సవాలు నిర్వహించేవారని, అక్కడకన్నా హైదరాబాద్ లోనే బాగా జరుగుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ కార్యదర్శి క్రిస్టీనా, ఆగాఖాన్ అకాడమీ ఎండీ జాఫ్రిషషర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో సైతం ఈ పతంగుల పండుగలు నిర్వహించారు. యాదాద్రి, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లోనూ కైట్ ఫెస్టివల్స్ ఘనంగా నిర్వహించారు.

–దక్కన్ న్యూస్ ద







# హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్






కళారూపాలు.. ఆకట్టుకున్నాయి.. కళాఖండాలు ఆలోచింప జేశాయి. సాహితీ కుసుమాలు విరబూశాయి. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దేశవిదేశాల నుంచి వేలాది మంది సాహితీ ప్రియులు హాజరయ్యారు. ప్రముఖ కవి, సాహితీవేత్త అశోక్ వాజ్‌పేయి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

'ది బ్రాండ్ బిజినెస్ స్టోరీస్' అనే అంశంపై రమేశ్వర్, సుశీల రవీంద్రనాథ్ మాట్లాడగా, 'సాహిత్యాన్ని సజీవంగా ఉంచడం' అనే అంశంపై దీపాంకర్ ముఖర్జీ, కార్తికేయ వాజ్‌పేయి, మంజిరి ప్రసంగించారు. 'రచన, అనువాదం, విమర్శ' అనే అంశంపై ఫిలిపైన్స్ రచయితలు తమ అభిప్రాయాల్ని పంచుకున్నారు. ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ (హియత్‌నగర్, హైదరాబాద్) విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**'చోలీకే పీచే క్యా హై'**

ప్రముఖ రచయిత్రి మహాశ్వేతాదేవి రచించిన నాటకాన్ని గుజరాత్‌కి చెందిన 'బుద్ధన్ థియేటర్' గ్రూప్ 'చోలీ కే పీచే క్యాహై' పేరుతో ప్రదర్శించింది. సందర్శకులను అమితంగా ఆకట్టుకుంది.

**సాహితీ ప్రాంగణంలో చేనేత సంత**

ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్‌ని అశోక్ వాజ్‌పేయి ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం చేనేతను ప్రోత్సహించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో లిటరరీ ఫెస్టివల్‌లో సైతం చేనేతకు చేయూతనిస్తూ ప్రత్యేకంగా స్టాల్స్‌ను పెట్టారు. ధర్మవరం, పోచంపల్లి, కాంచిపురం వస్త్రాలను అశోక్ వాజ్‌పేయి, జయేశ్‌రంజన్ తదితరులు తిలకించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన మగ్గం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**ఆర్ట్‌స్ట్రీట్...**

లిటరరీ ఫెస్టివల్ స్ట్రీట్ ఆర్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురు ఆర్టిస్టులు రూపొందించిన వివిధ కళాఖండాలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశాయి. జర్మన్ ఆర్టిస్ట్ కాథరినా కకర్ 'క్రాసింగ్ ది లక్ష్మణ్ రేఖ – శక్తి, సెన్సువాలిటీ, సెక్యువాలిటీ' పేరుతో రూపొం దించిన ఇల్యుస్ట్రేషన్ కళాభిమానుల్ని కట్టిపడేసింది. ఎర్రని గులాబీ రెమ్మల చుట్టూ విరిగిన చేతుల నమూనాలు మహిళలపై జరుగుతున్న హింసకు ప్రతిబింబంగా నిలిచాయి. ఫర్జాన ఖానూన్ రూ పొందించిన 'ది లోటస్ గర్ల్' ఇల్యుస్ట్రేషన్ బేటీ పడావో నినాదాన్ని వినిపించింది. ఆడపిల్లలకు విద్య అందని దుస్థితిని ఈ కళాఖండంలో చిత్రించింది. ఇక దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో రక్తాన్ని చిందించే సాహసాన్ని కళ్లకు కట్టిన మరో ఇల్యుస్ట్రేషన్ ఆకట్టుకుంది.




**ఎవరేమన్నారంటే....**

సాహిత్యం శక్తివంతమైంది. సాహిత్యంలో సత్యం ప్రతిఫలించాలి. దేశంలో అసహనం, ద్వేషం పెరుగుతున్నాయి. రచయితలు, మేధావులు, మహిళలు, మైనార్టీలు, ఆదివాసీలు అన్ని వర్గాలపై దాడులు అధికమవుతున్నాయి. వాస్తవాల్ని ప్రతిబింబించాల్సిన బాధ్యత రచయితలపై ఉంది

**– ప్రముఖ కవి, సాహితీవేత్త అశోక్ వాజ్‌పేయి**

**ముందు తరాలకు అందించాలి**

ఫిలిపిన్స్, భారతీయ భాషల మధ్య పోలికలున్నాయి. భారతీయ భాషల్లో కనిపించే 'బుద్ధి, దేవత' పదాలు ఫిలిపిన్స్‌లోనూ ఉన్నాయి. హెచ్‌ఎల్‌ఎఫ్‌లో పాల్గొనేందుకు 12 మందితో బృందంగా హైదరాబాద్‌కి వచ్చాం. పోయెట్రీ పర్ఫామెన్స్‌పై వర్క్‌షాప్ సైతం నిర్వహిస్తున్నాం. ఫిలిపిన్స్‌లోనూ అపార మౌఖిక సాహిత్యం, జానపద సాహిత్యం అందుబాటులో ఉంది. అలాంటి సాహిత్యాన్ని ముందు తరాలకు అందించే కృషి జరగాలి. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్స్ వంటివి సాహిత్యాన్ని ప్రజల చెంతకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**– ప్రొఫెసర్ విక్టర్ ఎమ్మాన్యుయెల్ కార్మెలో, ఫిలిపిన్స్**

**–దక్కన్ న్యూస్**

ద

### తెలంగాణ చారిత్రక వారసత్వాన్ని చాటిన

# రీడిస్కవరింగ్ తెలంగాణ



పురావస్తుశాఖ వార్షిక నివేదికను విడుదల చేస్తున్న మంత్రి చందూలాల్, ప్రభుత్వ సలహాదారు పాపారావు, ప్రొ. సుదర్శన్‌రావు, ఆర్కియాలజీ డైరెక్టర్ విశాలాక్షి, టూరిజం సెక్రటరీ క్రిస్టినా తదితరులు

**తె**లంగాణ రాష్ట్రంలోని చారిత్రక వారసత్వ సంపదల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పే గొప్ప ప్రయత్నం ప్రారంభమైంది. రాష్ట్ర పురావస్తుశాఖ హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధిలో సంస్థలో జనవరి 16,17వ తేదీల్లో రీడిస్కవరింగ్ తెలంగాణ పేరిట నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ఇందుకు నాంది పలికింది. చైనా, తైవాన్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన బౌద్ధ మహెూపాధ్యాయులు, అమెరికా, ఇంగ్లాండ్‌కు చెందిన రిసెర్చ్ స్కాలర్స్, గయ, నలంద ప్రాంతాలకు చెందిన పండితులు ఇందులో పాల్గొన్నారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణ చారిత్రక ఔన్నత్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పినట్లయిందని రాష్ట్ర పురావస్తుశాఖ డైరెక్టర్ విశాలాక్షి పేర్కొన్నారు.




సదస్సుకు విశాలాక్ష్మి డైరెక్టర్‌గా, పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభ కో-కన్వీనర్‌గా, రాష్ట్ర ప్రదర్శనశాలల డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. మెగాలిథిక్ కాలం నాటి సమాధులపై పలు అంతర్జాతీయ సదస్సుల్లో వ్యాసాలు సమర్పించిన సముద్రాల రంగాచార్య ఈ సదస్సులోనూ వ్యాసాన్ని సమర్పించారు. తెలంగాణలోని కోటలు, సరస్సులు, పాండవుల గుట్ట, లోయలు, పర్యాటక ప్రదేశాలు, బుద్ధవనం ప్రాజెక్ట్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఫొటో ఎగ్జిబిషన్‌తో పాటు ప్రాచీన నాణేల ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పురావస్తు శాఖ వార్షిక నివేదికను మంత్రి చందులాల్ ఆవిష్కరించారు. తొలిరోజు సదస్సులో భాగంగా 'వరంగల్-ఫోర్ట్, సిటీ, కాస్మోగ్రామ్' అంశంపై డాక్టర్ జార్జి మిషల్, 'ఆన్ ఎర్తింగ్ హిస్టరీ - స్టడీస్ ఇన్ ఆర్కియాలజీ ఇన్ తెలంగాణ' అంశంపై డాక్టర్ కేపీ రావ్, 'రిమోట్ సెన్సింగ్, ఆర్కియాలజీ న్యూ మెథడ్స్' అంశంపై ఆండ్రూ బ్యూఎర్ ప్రసంగించారు. పురావస్తు శాఖ డైరెక్టర్ ఎన్ఆర్ విశాలాక్షి, టీఎస్ టీడీసీ ఎండీ క్రిస్టినా చొంగ్తూతో పాటు పలువురు దేశ, విదేశీ ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

తెలంగాణ చారిత్రక సంపదపైన విస్తృతంగా అధ్యయనం చేసిన విదేశీ పరిశోధకులు పెద్దసంఖ్యలో ఈ సదస్సుకు హాజరయ్యారు. రాష్ట్రంలోని బౌద్ధకేంద్రాలు, స్తూపాలు, కోటిలింగాల, ధూళికట్ట, ఫణిగిరి, వర్ధమాను కోట, తిరుమలగిరి, వేముల వాడ, ధర్మపురిలపైనా, మెగాలిథిక్ బరియల్స్, దక్కన్ మినియేచర్ పెయింటింగ్స్ లాంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించారు.

తెలంగాణ చరిత్రకు సంబంధించి విదేశీయులు చేసిన పరిశోధించిన అంశాలను సదస్సులో వివరించారు. ఇటీవల బయటపడిన చారిత్రక ఆనవాళ్లు, వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. వరంగల్ కోటపై విదేశీ పరిశోధకుడు జార్జ్ మిచల్ చేసిన కోట డ్రాయింగ్స్, ఏరియల్ మ్యాప్‌ను సదస్సులో ప్రదర్శనకు ఉంచారు. గత 30 సంవత్సరాల నుంచి భారతదేశంలో అనేక అంశాలపై పరిశోధన చేస్తున్నప్పటికీ వరంగల్ కోటను పరిశోధించడం ఎంతో గొప్పగా ఉందన్నారు.

> వేల ఏళ్ల నాటి ఈ చిత్రాలు ఇప్పటికీ చెక్కు చెదరకండా ఉండడం గమనార్హం. 15 శతాబ్ధం నాటి రాగరాగిణి చిత్రమాలిక ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**వచ్చే ఏడాది వరంగల్‌లో సదస్సు**

పురావస్తు శాఖ నిర్వహించిన తొలి అంతర్జాతీయ సదస్సు విజయవంతం కావడంతో ఇకపై వీటిని ఏటా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి సదస్సు రెండు రోజులు జరగ్గా, ఇకపై మూడు రోజల పాటు నిర్వహించనున్నారు. 2018 జనవరి 18– 20 మధ్య వరంగల్‌లో సదస్సు జరపాలని నిర్ణయించారు. చివరి రోజు ప్రధాన పర్యాటక, పురావస్తు ప్రాంతాల్లో క్షేత్ర పర్యటనలు జరపాలని నిర్ణయించినట్టు పురావస్తు శాఖ సంచాలకురాలు విశాలాక్షి తెలిపారు.

**ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం**

తెలంగాణకు ప్రాచీన చరిత్ర, పురావస్తు సంపద ఎంతో ఉన్నదని, శిలాయుగం నాటి కట్టడాలు, అవశేషాలు ఇక్కడ లభిస్తాయి. వీటి పరిరక్షణ పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది. చరిత్రను పునర్నిర్మించుకునే దిశలో తెలంగాణ ఇప్పుడు అడుగులేస్తున్నదని చెప్పారు. తెలంగాణ చారిత్రిక సాంస్కృతిక వైభవాన్ని, ప్రాచీన కట్టడాల విశిష్టతను ప్రపంచానికి చాటేందుకు కృషి చేస్తున్నాం

**– రాష్ట్ర పర్యాటక, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి అజ్మీరా చందూలాల్**

చారిత్రక విశేషాల అన్వేషణ, వాటి పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం చూపుతున్న చొరవ ప్రశంసనీయం. క్రీస్తు పూర్వం నుంచి ఈ ప్రాంతానికి ఎన్నో సామాజిక, ఆర్థిక ప్రత్యేకతలున్నాయి. 19వ శతాబ్దంలో హైద్రాబాద్ నగరంలో వందలాది చరిత్ర పరిశోధనా సంస్థలుండేవి. తెలంగాణ మరో చారిత్రక ఉద్యమానికి నాందిగా నిలుస్తున్నది. ఇది దేశానికి స్ఫూర్తిదాయకం. తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్, నల్లగొండలో చారిత్రిక నగరాలు. అక్కడ గొప్ప జానపద సాహిత్యం ఉంది. చరిత్రకు ఆధారాలు ఈ సాహిత్యంలోనే లభ్యమవుతాయి కాబట్టి ఈ సాహిత్యాన్ని కాపాడుకుని పరిశోధించాల్సిన అవసరం ఉన్నది

**– సుదర్శన్, భారత చరిత్ర పరిశోధన మండలి చైర్మన్**

తెలంగాణ ప్రాంతానికి వేల ఏండ్ల చరిత్ర ఉన్నది. దీనిని మరింత లోతుగా అధ్యయనం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం పురావస్తు పరిశోధనలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది. విదేశీయులు సైతం తెలంగాణలోని బౌద్ధరామాలపై పరిశోధనకు ఆసక్తి చూపుతున్నారు.

**– పాపారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యుడు**

తెలంగాణలో పర్యాటకరంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నది. పర్యాటక శాఖ ఉపాధి అవకాశాల్లోనూ ముందంజలో ఉన్నది. **– రాష్ట్ర పర్యాటక కమీషనర్ సునీత ఎం భగవత్**



ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి చందులాల్, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, రాములు నాయక్

**చరిత్రకు సాక్ష్యం - పురావస్తు శాఖ నాణేల ప్రదర్శన**

తెలంగాణ నేల చారిత్రక వైభవాన్ని చాటే అవశేషాలు.. సాంఘీక, సాంస్కృతిక విశేషాలకు ఆనవాళ్ళు.. మైమరిపించే కళాకృతులు.. ఎన్నెన్నో కొలువుదీరాయక్కడ. అవును.. ఈ నేతల ప్రత్యేకతల్ని చాటే అనేకానేక విశేషాలను అక్కడ ప్రదర్శించారు. 'డిస్కవరింగ్ తెలంగాణ' అంతర్జాతీయ సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో జయశంకర్ భూపాల్‌పల్లి, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో బయల్పడిన ఒకటి, రెండు శతాబ్దాల నాటి హార్డియన్, అగస్టస్, నేర్వా, ఆంటోనియస్, ఫౌస్టినా జూనియర్, ట్రాజన్ రోమన్ బంగారు నాణేలను ప్రదర్శించారు. వరంగల్ తదితర ప్రాంతాల్లోని గుహల్లో బయల్పడిన ఆదిమకాలం నాటి చిత్రాలు సందర్శకులను అబ్బుర పరిచాయి. వేల ఏళ్ల నాటి ఈ చిత్రాలు ఇప్పటికీ చెక్కు చెదరకండా ఉండడం గమనార్హం. 15 శతాబ్ధం నాటి రాగరాగిణి చిత్రమాలిక ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**అక్కడ బాగ్దాద్.. ఇక్కడ ఓరుగల్లు!**

**ఒకే తరహా నగరాలన్న లండన్ నిపుణుడు జార్జ్ మైఖేల్**

"వృత్తాకారంలో నగరం.. మూడంచెలుగా ప్రాకారాలు.. ఒక్కోదానికి నలువైపులా నాలుగు ద్వారాలు.. నేరుగా వెళ్లే అవ కాశం లేకుండా మలుపులు తిరిగి ప్రవేశించేలా మార్గాలు.. మండ ల, స్వస్తిక్, యంత్ర పద్ధతులను అనుసరించి శత్రు దుర్భేద్యంగా తీర్చిదిద్దిన తీరు.. భారతదేశం వెలుపల ఈ తరహా వృత్తాకార నగర నిర్మాణం మళ్లీ ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో మాత్రమే కని పిస్తుంది. ఈ రెండు నగరాల నిర్మాణం ఒకదాని నమూనాపై మ రోటి ఆధారపడి తీర్చిదిద్దారన్న భావన కలుగుతుంది.." అని లం డన్‌కు చెందిన పురాతత్వ నిపుణుడు డాక్టర్ జార్జ్ మైఖేల్ వెల్ల డించారు. దీనికి శాస్త్రీయ రుజువులు మాత్రం లేవని చెప్పారు.

1980 దశకంలో ఓరుగల్లు నగర నిర్మాణం, కాకతీయుల విశిష్టతపై జార్జ్ మైఖేల్ విస్తృత పరిశోధన జరిపారు. ఆ తర్వాత కూడా మరో రెండుసార్లు వచ్చి అధ్యయనం చేశారు. తాజాగా తెలంగాణ పురావస్తు శాఖ 'రీడిస్కవరింగ్ తెలంగాణ' పేరుతో ఏర్పాటు చేసిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ఆయన తన నివేదికను సమర్పించారు. దేవాలయాలకు తోరణాలు (ద్వారాలు) ఏర్పాటు చేసినట్టుగా.. ఓరుగల్లు చుట్టూ కీర్తి

తోరణాలు ఏర్పాటు చేసిన ఆ రాజుల ఆలోచనను కీర్తించకుండా ఉండలేమన్నారు. పవిత్రంగా భావించే స్వస్తిక్ ఆకృతిలో నగరానికి నాలుగు వైపులా ఏర్పాటు చేసిన ద్వారాల నుంచి సవ్య దిశలో మాత్రమే వెళ్లేలా ఏర్పాట్లు, ఒక్కో ద్వారానికి ఒకటి ప్రతిబింబంలా ఏర్పాటు చేసిన తీరు గొప్ప నిర్మాణ కౌశలానికి నిదర్శనమని ప్రశంసించారు.


ఆర్కియాలజీ డైరెక్టర్ విశాలక్షి, అండ్రూ, డాక్టర్ బి.ఆర్. మణి (డైరెక్టర్ జనరల్, నేషనల్ మ్యూజియం, ఢిల్లీ), డాక్టర్ ప్రొ. కె.పి.రావు (యు.ఓ హెచ్.)

భారతదేశంలోని నగరాల నిర్మాణంలో నాయక్‌లకు ప్రాధాన్యం ఉండేదని... నగరం, దాని చుట్టూ కోట గోడ, రక్షణగా బురుజులు, ఒక్కో బురుజుకు ఒక్కో నాయక్‌తో నిరంతర పర్యవేక్షణ ఉండేదని జార్జ్ మైఖేల్ పేర్కొన్నారు. "వరంగల్ నగరానికి రక్షణగా వృత్తాకారంలో మూడు కోట గోడల నిర్మాణం ఆశ్చర్య పరుస్తుంది. ఆ తరహా వ్యవస్థలు మరెక్కడా కనిపించవు. నగర నిర్మాణ సమయంలో 72 బురుజులు ఏర్పాటు చేసి 72 మంది తో నాయక వ్యవస్థ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 45 బురుజులే కనిపిస్తున్నాయి. ఇక బహమనీలు, ఇతర ముస్లిం రాజులు ఓరుగల్లు నగరాన్ని ధ్వంసం చేశారు. ప్రస్తుతం ఒక్క కుష్ మహల్ మినహా అంతా ధ్వంసనిర్మాణాలే కనిపిస్తాయి. హిందూ ఆలయాలను కూల్చి ఆ శిథిలాలతో పెద్ద మసీదు నిర్మాణం ప్రారంభించినా, దాన్ని పూర్తి చేయలేదు. ఈ నగరానికి నిర్మించిన కీర్తి తోరణాలను చూసే కుతుబ్‌షాహీలు హైదరాబాద్‌లోని చార్మినార్‌కు నాలుగు వైపులా చార్‌కమాన్‌లు నిర్మించారు.." అని చెప్పారు.

**అద్భుత 'ఆదిమ' చిత్రాల నెలవు తెలంగాణ**

ఆదిమ మానవులు గీసిన అద్భుత వర్ణచిత్రాలకు తెలంగాణ నెలవు. అలాంటి చిత్రాలున్న ఎన్నో ప్రాంతాలను గత మూడు దశాబ్దాల్లో సహచర ఉద్యోగులతో కలసి వెలుగులోకి తేవడం నా జీవితాంతం గుర్తుండిపోతుంది. యునెస్కో గుర్తింపు పొందిన భీంబెట్కా కంటే వరంగల్ సమీపంలోని పాండవుల గుట్ట గొప్పది

**- పురావస్తు శాఖ ప్రత్యేకాధికారి రంగాచార్యులు**


నాణేలను తిలకిస్తున్న యం. వేదకుమార్

**వంద 'ఆదిమ' ప్రాంతాలు**

రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణలో ఆదిమ మానవుల వర్ణచిత్రాలున్న 26 ప్రాంతాలనే గుర్తించగా, తదనంతరం తనవంటి వారు వాటిని 66కు చేర్చారు. వచ్చే అంతర్జాతీయ సదస్సు నాటికి ఈ సంఖ్య 100కు చేరవచ్చు.

**- ద్యావనపల్లి సత్యనారాయణ, పురావస్తు పరిశోధకుడు**

**సదస్సు నిర్వహణ భేష్...**

సదస్సును గొప్పగా నిర్వహించారంటూ ప్రతినిధులు అభినందించారు. ముఖ్యంగా విదేశీ ప్రతినిధుల నుంచి ప్రత్యేక అభినందనలు వచ్చాయి

**- రాములు నాయక్, పురావస్తు శాఖ సహాయ సంచాలకుడు**

**నాణేలూ చరిత్ర చెబుతాయి**

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో లభించిన పురాతన నాణేలు చరిత్రకు సంబంధించి కొత్త పాఠాలు చెబుతున్నాయి. 3.5 లక్షల నాణేలతో హైదరాబాద్ స్టేట్ మ్యూజియం ప్రపంచంలోనే గొప్ప నాణేల మ్యూజియంగా వర్ధిల్లు తోంది.

**- నాణేల సేకర్త డాక్టర్ రాజారెడ్డి**

**కొత్త చారిత్రక ఆధారాలు**

లక్షల ఏళ్ల క్రితమే తెలంగాణ చరిత్ర ఉందని దేశ, విదేశ చరిత్రకారులు అంటున్నారు. ఏకంగా మూడు లక్షల ఏళ్ల చరిత్ర తెలంగాణ ప్రాంత సొంతమని ఉద్ఘాటించారు. ఈ చరిత్రంతా రాతి బొమ్మలు, పనిముట్లు, నాణేల్లో నిక్షిప్తమైనట్లు చెప్పారు. రీడిస్కవరింగ్ తెలంగాణ సదస్సులో పలువురు చరిత్ర పరిశోధకులు తెలంగాణ చరిత్రకు సంబంధించిన పలు అంశాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా పుల్లూరులో ఇటీవల బయటపడిన అస్థిపంజరం, వస్తువులు, వరుసగా బయటపడుతున్న రాక్ సైట్స్ ఇందుకు నిదర్శమని వారు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కొత్తగా 40 రాక్‌సైట్స్ వెలుగులోకి వచ్చినట్లు చరిత్ర పరిశోధకుడు సత్యనారాయణ తెలిపారు. శాతవాహనుల రాజధాని అయిన కోటిలింగాల ప్రాంతంలో బయటపడుతున్న నాణేల ఆధారంగా తెలంగాణ చరిత్రను మరింత లోతుగా తెలుసుకునే వీలు కలుగుతుందని పరిశోధకులు పేర్కొన్నారు. అక్కడ విదేశీ నాణేలు కూడా బయటపడుతున్నాయని లండన్ యూనివర్సిటీకి చెందిన రెబెకా చెప్పారు. ప్రముఖ వైద్యుడు రాజరెడ్డి శాతవాహనుల నాణేలపై చేసిన పరిశోధనలను వివరించారు. కుతుబ్‌షాహీ, మొఘల్, అస్‌ఫజాహీల కాలం నాటి నాణేలపై మనూ వర్సిటీ ప్రొఫెసర్ దానిష్ మోయిన వివరించారు. స్వస్తిక్ గుర్తును మొదట తెలంగాణలోనే వినియోగించడం విశేషం. చరిత్రకారుల పరిశోధనలో ఈ విషయం వెలుగు లోకి వచ్చింది.

**-సృజన్**

# గుంజాల కోయతూర్ లిపిలో రెండో వాచకం



గుంజాల కోయతూర్ లిపిలో రూపొందించిన రెండో వాచకం ఆవిష్కరణలో యు.ఓ.హెచ్. వీసీ ప్రొ॥ పి. అప్పారావు, డా॥ బుద్ధప్రకాశ్, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న, ఎంపీ నగేష్, ఎమ్మెల్యే బోథ్ బాపు రావు, ఎమ్మెల్యే శ్రీమతి రేఖా నాయక్, ప్రొ. జయధీర్ తిరుమల్‌రావు తదితరులు

నాగోబా జాతర సందర్భంగా గుంజాల కోయతూర్ లిపిలో రూపుదిద్దుకున్న రెండో వాచకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఉట్నూరు), సెంటర్ ఫర్ దళిత్ & ఆదివాసి స్టడీస్ అండ్ ట్రాన్స్‌లేషన్ (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్) ఈ పుస్తకాన్ని రూపొందించాయి. కొర్వేత విశ్వనాథ్ ఈ పుస్తకానికి బొమ్మలు వేశారు. శ్రీధరమూర్తి శ్రీకంఠం గుంజాల కోయతూర్ లిపికి ఫాంట్ తయారు చేసి, ఈ పుస్తకాన్ని డిజైన్ చేశారు.

**లిపులను బతికించాలి**

గోండులకు లిపి లేదని కొందరు అంటారు. కానీ ఆదిలాబాద్ గోండు ప్రజలు తమ అవసరార్థం స్థానికంగా 100 ఏళ్ళ క్రితం గుంజాల కోయతూరు లిపిని రూపొందించుకున్నారు. ఈ లిపిలో పది రాతప్రతులు గుంజాల గ్రామంలో లభ్యమయ్యాయి. ఈ లిపిని చదివే వారిలో ఇద్దరు వృద్ధులు ఇంకా జీవించి ఉన్నారు. ఈ లిపి గోండు పిల్లలకు సులభంగా అర్థమవుతున్నది. గుంజాలతో పాటుగా చుట్టుపక్కల అనేక గ్రామాలలో ఇప్పటికే కొన్ని వందల మంది ఆసక్తిగా ఈ లిపిని నేర్చుకుంటున్నారు. పదిహేను పాఠశాలల్లో ఈ లిపిని, భాషను నేర్పిస్తున్నాం. మంచి ఫలితాలు ఇవ్వడం వల్ల రెండో వాచకాన్ని కూడా తయారు చేశాం. ప్రజల్లో ప్రచారంలో ఉన్న లిపులను బతికించడం అవసరం. ప్రస్తుతం సిడాస్ట్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్న జయధీర్ తిరుమలరావు, డా మనోజ బృందం మొదటిసారిగా గుంజాల కోయతూర్ లిపిలో మొదటి వాచకం తయారు చేశారు.

**– ఆర్.వి కర్ణన్, ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐటీడీఏ, ఉట్నూరు**

**ఈ లిపి వారి వారసత్వం**

లోగడ గోండి భాషావాచకాలు కొన్ని తయారయ్యాయి. అవి తెలుగు లిపిలో ఉన్నాయి. రెండేళ్ళ క్రితం గుంజాల కోయతూర్ లిపిలో, గోండీ భాషలో మొదటి వాచకం వెలువడింది. ఈ లిపి, భాష గోండుల వారసత్వం. ప్రత్యేకం కూడా.

**– డా. బుద్ధప్రకాశ్ ఎం.జ్యోతి, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్**

**రాతప్రతుల సర్వేతో వెలుగులోకి...**

న్యూఢిల్లీలోని నేషనల్ మిషన్ ఫర్ మాన్యుస్క్రిప్ట్స్ వారి సహకారంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వ రాతప్రతుల గ్రంథాలయం, పరిశోధన కేంద్రం వారు 2006లో ప్రాచీన రాతప్రతుల సర్వే నిర్వహించారు. అప్పుడు గుంజాలలో ఉన్నటువంటి గోండి లిపి రాతప్రతులను ఆ సర్వే బృందం సభ్యులు గోపగాని రవీందర్, మెస్రం మనోహర్, ఆర్క మానిక్‌రావులు గుర్తించారు. ఆ లిపిని గిరిజన భాషాలిపిగా సర్వేయర్లు గుర్తించలేదు. 2010లో జయధీర్ తిరుమలరావుగారు ఉట్నూరు వచ్చినప్పుడు ఆ లిపిని చదవగలుగుతున్న గోండి పెద్దలను కలుసుకున్నారు. తదనంతరం వారితో పాటు ఆ రాత ప్రతులను హైదరాబాద్‌లోని కుమ్రం భీం స్టడీ సర్కిల్‌కి తీసుకువెళ్ళి ఐదు రోజుల పాటు అధ్యయనం చేశారు. కోయతూర్ భాషలు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినవని, గోండి, కోయ తదితర భాషలు ద్రావిడ భాషలతో ప్రాచీన సంబంధాన్ని కలిగి ఉన్నాయని నిర్ధారించారు. గోండి లిపిపై అధ్యయనం చేస్తూ, పాళి, బ్రాహ్మి, కన్నడ, తమిళం, మరాఠీ వంటి లిపులను ఈ లిపితో పోల్చిచూశారు. అలా చూసిన తరువాత ఆ లిపుల కన్నా ఇది భిన్నంగా, విలక్షణంగా ఉందని భావించారు. ఈ లిపిని విద్యాబోధనకు ఉపయోగించి సత్ఫలితాలు రాబట్టాలని నిర్ణయించారు.



**– కోట్నాక్ వినాయక్, కో–ఆర్డినేటర్, గుంజాల**

**అంతర్జాలంలో గుంజాల కోయతూర్ లిపి**

ఉట్నూరు ఐటీడీఏ, గోండి సమాజం పెద్దలతో కలసి హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో లోగడ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించాం. పలు సమావేశాలు, సదస్సులు, కార్యశాలలు ఏర్పాటు చేశాం. పది రాతప్రతులను ఆయా పెద్దలతో చదివింపజేసి దృశ్యమాధ్యమంలో డాక్యుమెంట్ చేశాం. వాటిని సిడాస్ట్ పరిశోధకులు తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలోకి అనువదించారు. మా విశ్వవిద్యాలయం ఈ లిపికి సాఫ్ట్‌వేర్ తయారు చేయించింది. ఆ లిపి ఫాంట్‌ను యూనికోడ్ కన్సార్టియం వారి పరిశీలనకు కూడా పంపించాం. త్వరలో అంతర్జాలంలో కూడా గుంజాల కోయతూర్ లిపి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రానుంది.

**– పొదిలె అప్పారావు, వీసీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్**

**(ఇంతకూ ఆ రాతప్రతుల్లో ఏముంది.. అసలు అవి ఎలా వెలుగులోకి వచ్చాయి... తదితర విశేషాలు వచ్చే సంచికల్లో)**

**– దక్కన్ న్యూస్**

# నాగోబా జాతరలో దర్బార్

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ వనంలో నిర్వహించే నాగోబా జాతర జనవరి 27వ తేదీ రాత్రి ప్రారంభమైంది. మెస్రం వంశీయులు నిర్వహించిన పూజలతో వన జాతర మొదలైంది. జాతరలో భాగంగా జనవరి 30న దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలన్నీ ఒకే వేదికపై ఆవిష్కృతమయ్యాయి.





ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ, గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్నారు. నాగోబా ఆలయాన్ని రూ. 3.9 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. అటవీ శాఖ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ, రూ. 25 కోట్లతో జోడేఘాట్‌లో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 500 జనాభా ఉన్న గిరిజన తండాలు, గూడేలను పంచాయతీలుగా గుర్తిస్తామన్నారు.

జాతరకు వచ్చిన జనంతో కేస్లాపూర్ జనసంద్రమైంది. లక్షలాదిగా తరలివచ్చిన ఆడవిబిడ్డలతో వనం పులకించింది. చెట్టు, పుట్ట, గుట్ట ఎటు చూసినా జన ప్రభంజనం కనిపించింది. నాగోబా జాతరలో భాగంగా నిర్వహించిన దర్బార్ విజయవంతమైంది. సంప్రదాయ వేషధారణలు, నృత్యాలు, డోలు, సన్నాయి, కాలికోం, తుడుం వాయి ద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర మంత్రులు జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంబీపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు బావురావ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ కుమ్రంభీం, మంచిర్యాల కలెక్టర్లు జ్యోతి బుద్ధప్రకాశ్, చంపాలాల్, ఆర్వీ కర్ణన్ గిరిజన సంప్రదాయ పగిడీలు ధరించి వెళ్లి నాగోబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఉత్సవాలకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన దర్బార్‌లో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్న మాట్లాడుతూ నాగోబా ఆలయ రాజగోపురం, మండపాల నిర్మాణానికి రూ. 3.90 కోట్లతో పనులు చేపడుతామన్నారు. దర్బార్ సందర్భంగా గిరిజన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చేందుకు వీలుగా వేదికను నిర్మిస్తామని చెప్పారు.

గిరిజనులు తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని పలితంగా వారు మంచి ఉద్యోగం సాధించే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వరకు నాలుగు వరసల రహదారిని నిర్మిస్తున్నామని.. దీంతో ఉట్నూర్, ఆసిఫాబాద్ వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ఉట్నూర్‌లో 100 పడకల దవాఖానను నిర్మిస్తున్నట్లు తెలిపారు. దర్బార్‌లో తెలియజేసిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తామన్నారు.

మెస్త్రం ఆనందరావు (నాగోబో కమిటీ చైర్మన్), టీఆర్‌సీ చైర్మన్ యం. వేదకుమార్, ఎస్పీ శ్రీనివాస్, ట్రైనీ కలెక్టర్ అనురాగ్ జయంతి తదితరులు ఈ జాతరలో పాల్గొన్నారు. **– దక్కన్ న్యూస్** ద





# గర్వభంగం



ఒక అడవిలో ఒక సింహం బాగా తిని చెట్టుకింద పడుకొంది. అటుగా వెళ్తున్న ఒక దోమ పడుకున్న సింహాన్ని చూసింది.

'అడవిలో జంతువులన్నీ సింహాన్ని రాజుగా గౌరవిస్తాయి కదా! ఈ సింహం గొప్ప ఏమిటి? ఇది నా కంటే గొప్పదా? దీని గొప్పతన మేమిటో చూస్తా?" అనుకొంటూ సింహం చుట్టూ 'జుయ్' మని శబ్దం చేస్తూ తిరిగింది. దోమ చేసిన శబ్దానికి సింహానికి మెళుకవ వచ్చింది. సింహం నిద్ర చెడిపోయినందుకు దోమ సంతోషిస్తూ సింహం ముందు వాలి –

"మృగరాజా! మృగరాజా!! అడవిలో నీవే బలమైనదానివని అందరూ అంటుంటారు కదా! నేను నీ కంటె గొప్పదానిని తెలుసా?" అంది దోమ సగర్వంగా–

దోమ మాటలకు సింహానికి చాలా కోపం వచ్చింది. వెంటనే అది దోమను చంపబోయింది. కానీ దోమ తక్కున తప్పించుకుని పైకి ఎగిరి –

"చూశా! నీవు నన్ను పట్టుకోలేక పోయావు" అంది నవ్వుతూ – సింహానికి కోపం మరీ ఎక్కువైంది. దోమ, సింహం చుట్టూ తిరుగుతూ సింహం ముక్కుపై వాలింది. సింహం తన పంజాతో ఒక్కటి కొట్టింది. దోమ 'జుయ్' మంటూ గాలిలోకి ఎగిరింది. పంజా తన ముక్కుపైనే పడి రక్తం చిమ్మింది. ఈ విధంగా దోమ, సింహం కన్నుపై, చెవులపై వాలుతూ సింహాన్ని బాధిస్తున్న దోమ హఠాత్తుగా పక్కనే చెట్టుకి ఉన్న సాలె గూడులో చిక్కుకు పోయింది. సాలె పురుగు తన గూడులో చిక్కుకు పోయిన దోమను లటుక్కున మింగింది.

'అన్నింటికంటే నేనే గొప్పదాని ననుకొని గర్వపడ్డాను. నాకంటే గొప్పవి కూడా ఉన్నాయని ఇప్పుడు తెలిసింది. నా గర్వమే నా చావుకు కారణమైంది" అనుకుంటూ దోమ ప్రాణం విడిచింది.

**–(లియో టాల్‌స్టాయ్ కథ ఆధారంగా)** నవంబర్ 1990 బాల చెలిమి



# కాగితపు బొమ్మల కథక్ నృత్యం

ఒక గమ్మత్తు చేయడానికి గాజుగిన్నె, గాజు మూత పలుచని కాగితం ముక్కలు, సిల్కుబట్ట కావాలి. సుమారు నాలుగు సెం.మీ. లోతున్న గాజుగిన్నె తీసుకో. గిన్నెలోతు కన్నా కొంచెం చిన్న సైజు (సుమారు 3 సెం.మీ. పొడవున్న ఆడ, మగ మనిషి బొమ్మలు నాలుగు జంటలు – ఈ బొమ్మలో చూపినట్లు – పలుచని కాగితం నుంచి కత్తిరించు. కావాలంటే వీటికి రంగులు వేయవచ్చు. ఈ కాగితపు బొమ్మల్ని ఆ గాజు గిన్నెలో వేసి, గాజు పలక మూత వెయ్యి.



సిల్కుబట్టతో గాజుమూత పై భాగాన రుద్దుతూ ఉంటే, ఈ బొమ్మలు పైకి ఎగిరి, గాజు మూతకు తగులుకొని తమాషాగా ఊగిసలాడుతూ కిందపడిపోతూ, మళ్ళీ లేస్తూ నృత్యం చేస్తాయి.

ఈ బొమ్మలు ఇలా ఎందుకు చేస్తాయో తెలిసిందా? సిల్కు బట్టతో రుద్దడం వల్ల గాజు మూత రుణ విద్యుత్తుతో నిండి ఉంటుంది. కింద ఉన్న కాగితపు బొమ్మలు తటస్థమైనవి కాబట్టి ఆకర్షించబడి పైకి ఎగిరి గాజు మూతకి అతుక్కుంటాయి. కొంతసేపటికి సహవాసం వలన ఆ బొమ్మల మీద కూడా రుణవిద్యుత్తు ఏర్పడుతుంది. గాజు మూతమీద బొమ్మలమీద కూడ ఒకే జాతి (రుణ) విద్యుత్తు ఉండడం వలన వికర్షణకు గురి అయ్యి మూతను విడిచి క్రింద పడిపోతాయి. రుద్దుతూ ఉంటే ఇదే చక్రం మళ్ళీ మళ్ళీ కొనసాగుతూ ఉంటుంది. **– డా॥ మహ్మాదర నళినీమోహన్,**

ఏప్రిల్ 1991 బాల చెలిమి

# చిత్రాల్లో మనుష్యులను....
# చిత్రాలతో మనల్నీ కట్టిపడేసేలా...

# విభిన్న చిత్రశైలితో నందిని గౌడ్

చిత్రకళలో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకోవడం అంత తేలిక కాదు. అందుకు ఎంతగానో శ్రమించాలి. ప్రఖ్యాత చిత్రకారుడి కుమార్తెగా తండ్రి ప్రభావం, వారసత్వం కొంత ఉన్న ప్పటికీ, తన స్వీయరాణింపుతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సాధించిన చిత్రకారిణి నందిని గౌడ్.

సుప్రసిద్ధ చిత్రకారుడు లక్ష్మాగౌడ్ కుమార్తెగా ఆమె కళా జగత్తులో అడుగుపెట్టినప్పటికీ, పెయింటింగ్‌లను చూడగానే వాటిని చిత్రించింది నందిని గౌడ్ అని గుర్తుపట్టేలా ఆమె శ్రమించారు. ఆ శ్రమనే నేడు ఆమెను ఉన్నత శిఖరాలకు చేర్చింది.

ఆమె చిత్రాలను చూడగానే అవి చిన్నారుల వేసినవా అనే భావన మొదటి కలిగినప్పటికీ, వాటిలో పరిపూర్ణతను చూసిన తరువాత చేయి తిరిగిన వారు వేసినవి అని అనిపిస్తుంది.

బరోడా స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ నుంచి పట్టా పొందిన ఆమె కాన్వాస్‌పై సమాజాన్ని సృష్టించే యత్నాలు చేస్తూ అందులో సఫలమవుతున్నారు. తద్వారా సమకాలీన చిత్రకళాజగత్తుకు ప్రతి నిధిగా నిలుస్తున్నారు. ఆమె గీసే గీతలు ఎంతో సరళంగా కనిపిం చినప్పటికీ, ఆ బొమ్మలకు అద్దే రంగులు మాత్రం మనల్ని మరో రంగుల ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. ఆ రంగుల చిత్రాలను చూ స్తుంటే, ఒక రంగు స్థానంలో మరో రంగును ఊహించుకోలేం. అంత నిర్దిష్టంగా ఆమె ఆ రంగులను ఎంచుకుంటారు.

కుటుంబాల సమూహమే సమాజం. సమాజానికి ఓ చిన్న ప్రతీక కుటుంబం. పిల్లలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు...ఇలా వి భిన్న అంతరాలతో భిన్న వ్యక్తులు. వారిని చిత్రించి చక్కటి రంగులు వేయడమంటే వారిని కాన్వాస్‌పైకి తీసుకువచ్చి కట్టిపడేయడమే. వారినే కాదు...వాటిని చూసే మనల్నీ కట్టిపడేస్తుంది ఆమె చిత్రకళా నైపుణ్యం.

థీమ్‌ను ఎంచుకోవడం దగ్గరి నుంచి అన్ని అంశాలనూ చ క్కగా మేళవించి అందించడం దాకా ఆమె తీసుకునే శ్రద్ధాసక్తులు ఆ చిత్రాల్లో వ్యక్తమవుతుంటాయి. వాటిని చూస్తుంటే మనకు తెలి యకుండానే మనమూ వాటిలో వ్యక్తులమైపోతాం. ఒక్కసారిగా చిన్న పిల్లల్లా మారిపోతాం. మరుక్షణంలో పెద్దవాళ్లమైపోతాం. చిత్రాన్ని తేరిపార చూసి, ఆ ప్రపంచంలో నుంచి బైటికివచ్చేసరికి మళ్ళీ మనమైపోతాం. కాకపోతే... ఆ చిత్రంలో మనమూ భాగమైపో



యిన అనుభూతి మాత్రం మనల్ని అలానే అంటిపెట్టుకుని ఉం టుంది. అలా గుర్తుకొస్తూనే ఉంటుంది.

పెద్దగా శ్రమపడకుండానే గీసినట్లుగా అనిపించి మంత్రముగ్ధ లమైపోతాం కానీ అలా మంత్రించినట్లుగా ఉండిపోవడం వెనుక ఆమె పడే శ్రమ మాత్రం ఎంతో ఉంటుంది. సమకాలీన చిత్ర ప్ర పంచం ఎంతో మంది చిత్రకారులను తనలో కలిపేసుకుంటుంది. ఆ ప్రవాహ ఒరవడిలో వారు అలా కొట్టుకుపోతారు. కొందరు మాత్రమే ఆ ప్రవాహానికి ఎదురు నిలుస్తారు. అలాంటి వారే పేరు ప్రఖ్యాతులు పొందగలుగుతారు. అలాంటి కొందరిలో ఒకరు నందిని గౌడ్. ఈ ప్రక్రియలో ఆమె కొన్ని సాంకేతికతలను పక్కనబెట్టి తనదైన శైలిని ఎంచుకున్నారు.

పికాసో వంటి ప్రఖ్యాత చిత్రకారుల నుంచి పొందిన స్ఫూర్తి ఆమె చిత్రీకరణలో జాలువారుతుంది. అలా పొందిన స్ఫూర్తి మనకు పికాసో లాంటి వారిని గాకుండా నందిని గౌడ్‌నే గుర్తుకు తెస్తుంది. ఒక చిత్రకారిణికి అంతకు మించి కావాల్సింది మరింకేం ఉం టుంది?

'శిక్షణ' పొందిన కళాకారులు కొందరు అచ్చుగుద్దినట్లుగా చిత్రీకరిస్తుంటారు. కానీ వాటిలో కనిపించే ప్రధాన లోపం చిత్ర కారుల శైలి అందులో లోపించడం. ఒక చిత్రానికి తనదైన రీతిలో కుంచెతో భాష్యం చెప్పడం గొప్ప. అలాంటి గొప్పదనాన్ని సొంతం చేసుకున్నారు నందిని గౌడ్.





**ప్రొఫైల్**

హైదరాబాద్‌లో 1967లో పుట్టిన నందిని గౌడ్ 1993లో ఫైన్ ఆర్ట్స్ ఎం.ఎస్ యూనివర్సిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కల్చర్, మానవ వనరుల అభివృద్ధి శాఖ నుంచి (1995) జాతీయ స్కాలర్‌షిప్ పొందారు. 1998-2000 మధ్యలో జూనియర్ ఫెలోషిప్ కూడా పొందారు.

**సోలో ప్రదర్శనలు**

- 1992 గ్యాలరీ ఎస్కేప్ ●1994 రినిలిస్సాన్స్ ఆర్ట్ గ్యాలరీ
- 1988 ది గిల్డ్ గ్యాలరీ, ముంబై

**గ్రూప్ ప్రదర్శనలు**

1994 గ్రూప్ షో ఆఫ్ ఉమన్ ఆర్టిస్ట్ (సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఆర్ట్, హైదరాబాద్‌చే స్పాన్సర్ చేసింది)

1995 యంగ్ ఆర్టిస్ట్ (వధేరా ఆర్ట్ గ్యాలరీ, న్యూఢిల్లీ)

పలు ఆర్ట్ క్యాంప్‌లలో ఆమె పాల్గొన్నారు. అమెరికా, రష్యా, బ్రిటన్‌లతో సహా వివిధ దేశాల్లో పర్యటించారు.

**కలెక్షన్స్**

పీబాడీ ఎసెక్స్ మ్యూజియం, సలెం, యూఎస్ఏ

చెస్టర్ డెవిడా హెర్విట్స్: ఫ్యామిలీ కలెక్షన్, యూఎస్ఏ

ఎం.ఎఫ్.హుసేన్, షంషాద్ హుసేన్, లక్ష్మా గౌడ్ లాంటివారితో కలసి ఆమె తన పెయింటింగ్స్‌ను పరంపరలో ప్రదర్శించారు. విశాఖపట్నంలో మహిళా చిత్రకారులతో కలసి ఫెమినైన్ మూసెలో పాల్గొన్నారు. క్యూరియాసిటీ గ్యాలరీ లాంటివాటిల్లో ఆమె తన చిత్రాలను ప్రదర్శించారు. హైదరాబాద్‌లో తన సొంత స్టూడియో నిర్వహిస్తున్నారు. గ్రామీణ జీవితం, నగర జీవితం, కుటుంబం, పెంపుడు జంతువులు, టేబుల్‌పై పండ్లు, ఫ్లవర్‌వేజ్‌లు, ఇంటి అలంకరణ, ఇళ్ళు లాంటివి ఆమె చిత్రాలకు థీమ్‌లుగా ఉంటాయి. నిత్యజీవితంలో తాను చూసే అంశాలే తన చిత్రాల్లో దర్శనమిస్తాయని అంటారు ఆమె. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆక్షన్ హౌస్ క్రిస్టీస్ లాంటి చోట్ల ఆమె చిత్రాలను వేలం వేశారు. ఆరంభంలో కొన్నేళ్ళపాటు ఆమె లోప్రొఫైల్ లోనే గడిపారు. ఒక ఆర్టిస్ట్‌కు అది స్వీయ ప్రవాసం లాంటిది. మరో విధంగా చెప్పాలంటే తనను తాను అన్వేషించుకునేందుకు, తీర్చిదిద్దుకునేందుకు ఒక చక్కటి అవకాశం లాంటిది కూడా. ఇద్దరు పిల్లలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ రోజులో కనీసం రెండు గంటల సమయాన్ని చిత్రాల కోసం వెచ్చిస్తుంటారు. చిన్నతనంలో సొంతూరుకు వెళ్ళినప్పుడు అక్కడి దృశ్యాలను చిత్రీకరించాల్సిందిగా తండ్రి తనను ప్రోత్సహించడాన్ని ఆమె ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. **-కిరణ్**








# సామాన్యుని అసామాన్య గాథను ఆవిష్కరించిన దృశ్య కావ్యం

(Chronicles of Temple Painter – డాక్యుమెంటరీ రివ్యూ)

'జీవితమే నాటకరంగం' అన్నాడొక వేదాంతి. జీవితాన్ని నాటకం గానో, కథగానో చూపించాలంటే కల్పనతోనే సాధ్యం అంటూ కవులూ, రచయితలూ తమ రచన ద్వారా చెప్పకుండానే చెప్పిండ్రు. నేల విడిచి ఊహల్లో తేలిపోయే రచయితలకూ, కవులకూ ఈ మాటలు వర్తించక పోవచ్చు. మరీ ముఖ్యంగా తమ మేధస్సులో పేరుకుపోయిన మకిలిని దృశ్యంగా మలిచి పుంఖాను పుంఖాలుగా వెలువరించిన తెలుగు సినిమా రంగానికి ఈ మాట అసలే వర్తించదు. ఇంతకాలం తెలుగు సినిమాగా ఊరేగిన ఆంధ్రాబాబుల సినిమాలు చాలామటకు పెట్టుబడి విలాసంగా వినోదం పేరున ఊరేగిన ప్రేలాపనలు. ఒక తరానికి తరం సెన్సి బిలిటీస్‌ని ధ్వంసం చేసిన వ్యాపార ప్రక్రియగా తెలుగు సినిమా రంగం కొనసాగింది. కొనసాగుతూనే ఉంది. ఇలాంటి చీకటి యుగం నుండి సినిమా రంగాన్ని తప్పించి ఒక కళగా మార్చిన వాళ్ళూ, మార్చాలని ప్రయత్నిస్తున్న వాళ్ళూ లేరని కాదు. కానీ జీవితాన్ని కళగా అర్థం చేసుకొని కళలో చూపించిన సత్యజిత్‌రే వంటి వారు తెలుగు సినీ రంగంలో ఎందుకు కానరారు? అడపాదడపా కన్పించినా 'రే' స్థాయినెందుకు అందుకోలేక పోయింద్రు? అన్న ప్రశ్నకు సమాధానం తెలుగు 'సినీ పరిశ్రమ' అన్న మాటలోనే కన్పిస్తుంది. సినిమాని ఒక (సాహిత్య) కళా ప్రక్రియగా గాక పరిశ్రమగా గుర్తిస్తున్న సామాజిక, రాజకీయ సందర్భం కావచ్చు, మారని పురుష ఫ్యూడల్ భావజాలం కావచ్చు మొత్తానికి కళను కల్ల స్థాయికి దిగజార్చినై.

'బ్రేకింగ్ న్యూస్' రణగొణలను కాదని, యే మాత్రం నాన్చు కుండా గోకుల్ బాంబు బ్లాస్టులో 47 మంది చనిపోయిన సంఘటను జ్ఞాపకం చేసే పొడి మాటలతో ఈ డాక్యుమెంటరీ మొదలవుతుంది.

సత్యజిత్‌రే, ఆదూరి గోపాల కృష్ణన్, గౌతం ఘోష్, రిత్విక్ ఘటక్, మన తెలంగాణ బిడ్డలు శ్యాం బెనగల్, బి.నర్సింగరావు లాంటి వాళ్లు తెరమీద జీవితాన్ని సృజించింద్రు, కళగా మలిచింద్రు. అయితే జీవితాన్ని ఉన్నదున్నట్టుగా తెరకెక్కించడం ఒక కళ. అట్లాంటి కళను ప్రపంచానికి తొలుత పరిచయం చేసిన వాడు Robert D.Flatherty. "Nanook of the North" అనే పేరుతో 1922లో ఆయన తీసిన డాక్యుమెంటరీ ఈ నాటికీ డాక్యుమెంటరీలు తీయాలనుకునే వాళ్ళకీ, తీసిన వాళ్ళకీ ఒక దిక్సూచి. కెనడాలోని ఉత్తర ధృవ క్యూబెక్ ప్రాంతపు మంచుకొండల్లో అనుక్షణం ప్రకృతితో సంఘర్షిస్తూనే వందల ఏళ్ళగా జీవితాన్ని కొనసాగిస్తున్న స్థానిక ఇనాట్‌ల ధృవ వాసుల జీవితం గురించిన ఈ Ethnographic Documentary Film నిర్మాణంలో రాబర్ట్ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. మంచు కొండల్లో దిమ్మరిగా తిరుగుతూ అక్కడి జీవితాన్ని రికార్డు చేయడం ఒకెత్తయితే వాళ్ళ జీవన విధానాన్ని ప్రపంచవానికి అర్థమయ్యేలా చెప్పాల్సిరావడం మరొకెత్తు. ఓ దశలో నెలల పాటు ఆయన రికార్డు చేసిన నెగెటివ్‌లు కాలిపోవడంతో ఆయన పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినా నిరాశపడ లేదు. అందులోంచే పాఠాలను నేర్చుకున్నాడు. అంతకు మునుపు తాను చేసినట్లు మొత్తం 'ఇనాట్' సమూహాన్ని జీవితాన్ని చిత్రించడం కాకుండా ఒకే వ్యక్తి కేంద్రంగా సమూహ జీవిత ప్రతిస్పందనలు చూపడం ఉత్తమమనే నిర్ణయానికి వచ్చింద్రు. 'ననూక్' అనే వేటకాని జీవితాన్ని కేంద్రంగా చేసుకొని ప్రపంచానికి ఇనాట్‌ల జీవితాన్ని అద్భుతంగా రూపు గట్టించిండు. అందుకే రాబర్ట్ డాక్యుమెంటరీ ప్రపంచంలోనే డాక్యుమెంటరీ కళలో క్లాసిక్‌గా నిల్చిపోయింది.

ఇంత ఉపోద్ఘాతమంతా ఎందుకు చెప్పాల్సొచ్చిందంటే సరిగ్గా రాబర్ట్‌లాగే 'పాపాలాల్' అనే ఒక హైదరాబాదు పాతనగరవాసి జీవిత యథార్థదతలోంచి మన తరపు సమాజ సంక్లిష్టతలను చూపించడంలో 'Chronicles of a Temple Painter' ద్వారా యువ దర్శకుడు శ్రవణ్ కటికనేని విజయం సాధించాడని చెప్పడానికే. ఎప్పుడో 1990ల్లో నేను చూసిన Nanook of the North నాపై ఎంత బలమైన ముద్ర వేసిందో సరిగ్గా అలాంటి ప్రభావాన్నే నా ఆలోచనలపై కల్గించిన డాక్యుమెంటరీ 'Chronicles of a Temple Painter'. 'బ్రేకింగ్ న్యూస్' రణగొణలను కాదని, యేమాత్రం నాన్చకుండా గోకుల్ బాంబు బ్లాస్టులో 47 మంది చనిపోయిన సంఘటను జ్ఞాపకం చేసే పొడి మాటలతో ఈ డాక్యుమెంటరీ మొదలవుతుంది. మనల్ని నేరుగా పాతనగరం గల్లీల్లోకి తీసుకెళ్తుంది. పాపాలాల్ అనే ఒక మామూలు వ్యక్తితో పాటుగా నడిపించే షాట్‌తో మనల్ని కథలో భాగం చేస్తుంది. మనకి తెలియకుండానే మనం పాపాలాల్‌తో కలిసి నడుచుకుంటూ కోఠీ చేరుకుంటం. గోకుల్ చాట్ విధ్వంసాన్ని పాపాలాల్ మాటల్లోనూ, అప్పటి టి.వి. వార్తా ప్రసారల క్లిప్స్ దృశ్యాల మీదుగా చూస్తుండగానే ఓ పాప ఒంటరిగా రక్తసిక్తమైన చేతుల్లో పందు పట్టుకొని ఏడుస్తున్న దృశ్యం మనకి గోచరమవుతుంది. విషయం



ఇంకా మనకి పూర్తిగా గ్రహింపుకు రాకముందే ఉన్నట్లుండి పాపాలాల్ తన ఇంటికి వచ్చి బుడిగె జంగానికి భిక్ష వేస్తున్న దృశ్యం కన్పిస్తుంది. ఇక్కడే దర్శకుడిగా శ్రవణ్ ప్రతిభ కన్పిస్తుంది. పాపాలాల్ గురించి ఏం మాట్లాడకుండానే శ్రవణ్ ఆయన్ని మనకు పరిచయం చేసిన విధానం సరిగ్గా నసూక్ 'కయాక్' లోంచి ఒక్కొక్కరిని దింపే దృశ్యం మాదిరిగా ముద్రించుక పోతుంది.

తర్వాతి సంభాషణలో పాపాలాల్ తను పాపను ఎత్తుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించేందుకు చేసిన ప్రయత్నం, చివరికి వేరే దారి లేక తనతో పాటు ఇంటికి తీసుకెళ్ళిన విషయం, అప్పటి పాప పరిస్థితి అంతా ఆయన భార్య జయశ్రీ మాటల్లో మనకి తెలుస్తుంది. అంతవరకు ఒక్క ఫ్రేములో కూడా కన్పించని పాప సీదా ఏమాత్రం గడబిడ లేకుండా ప్రేక్షకుల ముందుకొస్తుంది. తనకు కొత్తగా దొరికిన తండ్రి పాపాలాల్ పక్కనే కూర్చొని మనలాగే తన కథ వింటూ కనిపిస్తుంది. పాపని ఇంత సహజంగా ప్రేక్షకులకు పరిచయం చేయడంలోనూ శ్రవణ్ ప్రత్యేకత కనిపిస్తుంది. మొత్తం కథలో పాప తన కథకి తానే ప్రేక్షకురాలు. 'అంజలి'గా ఆ తర్వాత సోనియాగా ఆపైన సానియా ఫాతిమాగా పేరు మార్చబడిన క్రమంలో పాప ప్రమేయం ప్రేక్షకులుగా మన ప్రమేయం వంటిదే. కాకపోతే సమాజ బీభత్సంలో పాప కేవలం నిస్సహాయ ప్రేక్షకురాలే కాదు, ప్రత్యక్ష బాధితురాలు కూడా. మొత్తానికి గోకుల్‌చాట్ బాంబు దాడిలో (2007)ల తల్లిదండ్రులను కోల్పోయిన ఒక ముస్లిం బాలిక గాథను మన కళ్ళముందు ఆవిష్కరించే యథార్థ సంఘటనల సమాహారమిది. 'ఇన్సానియత్ కె నాతే' ఆ పాపను వొడి జేర్చుకున్న పాపాలాల్ కుటుంబ కథ ఇది. శ్రావణమాసంలో తమ ఇంటికి వచ్చిన లక్ష్మీదేవిలా ఆ పాప పాపాలాల్ కుటుంబంలో ఒకతిగా మారే క్రమంలో ఎదుర్కొన్న అనుభవాల రికార్డు ఇది.



పాప రాక తమకి అదృష్టం తెచ్చిందని పాపాలాల్, జయశ్రీలు నమ్ముతారు. ఆమె మూలంగానే తమ కడుపు పండిందని, తమకు కడుపు నిండుతోందని నమ్ముతారు. ఆ పాప తమకి దేవుడిచ్చిన వరం అని నమ్ముతారు. జనకుని వలె, యశోద వలె పాపను సొంత బిడ్డగా సాకుతారు. బన్సీలాల్ బడిలో చేర్చి విద్యాబుద్ధులు నేర్పి 'సోనియా' వలె తన కాళ్ళపై తను నిలబడుతుందని నమ్ముతారు. తాము జన్మ నిచ్చిన బిడ్డకి 'ఏక్తా' అని పేరు పెట్టుకొని మతాలు వేరైనా మనుషులు ఏకమవగలరు అని నమ్ముతారు. కానీ, అనాథ శిశువును దగ్గర తీసుకున్నందుకు చుట్టపక్కాలు, చుట్టుపక్కల వాళ్ళూ వెలివేస్తామని అన్నప్పుడు నమ్మలేకపోతారు. "భూమిని మించిన వాడు సూర్యుడు, సూర్యుని మించిన వాడు అల్లా – శరణు వేడుకో" అని ముల్లాలు అం టే ఒప్పుకోలేకపోతారు. హిందువులమని విర్రవీగే మరికొందరు పాపని వదిలేవేయమంటే శక్తిమేరకు ప్రతిఘటిస్తారు. అంజలి పేరును సానియాగా మార్చి సమస్యలను తప్పించుకో అని పెద్దలు నచ్చజెప్పినప్పుడు నిజమే కావొచ్చని నమ్ముతారు. పాప పేరు ఫాతిమగా మార్చి కుటుంబాన్ని రక్షించుకోవలనుకుంటారు. మొత్తానికి శాంతిని ధ్వంసం చేసే ఇలాంటి బీభత్స నమ్మకాల గురించీ, ఓ వ్యక్తి చైతన్యం, ప్రతిఘటనల గురించి తెలుసుకో వాలంటే 'Chronicles of a Temple Painter' చూడాల్సిందే.

చీమలకు చక్కెర (బిస్కెట్) పెట్టినందుకే తను విడుదలయ్యానని నమ్మే విశ్వాసిగా, ఒక నిబద్ధత కల్గిన ఆదర్శవాదిగా, కళాకారునిగా జీవితాన్ని మల్చుకోవడంలో పాపాలాల్ చూపిన ప్రతిఘటనలను ఒడిసిపట్టుకున్న ethnographic చిత్రమిది. పన్నాలాల్ యాదవ్ పగబట్టినా, ముల్లాలు మతం మారమన్నా, తల్లి ఇంటికి పట్టిన 'శని'ని వదిలించుకోమని పోరినా, తమ్ముడు తప్పుడు కేసు బనాయించినా, జైలుకి పంపినా, దెబ్బలు తిన్నా, ఇల్లు తగులబడినా, డబ్బున్న ఆసాములు పాపను పెంచుకుంటామన్నా, ఛాందసవాదులు చంపుతామన్నా తనకి దొరికిన బిడ్డని ఈ విధ్వంసకర సమాజంలో ఒంటరిగా వొదిలెయ్యక కంటికి రెప్పలా కాపాడుకుంటూ కష్టాలను ఎదుర్కొంటున్న పాపాలాల్, జయశ్రీల కథ ఇది. పాతనగరంలో ఈరోజు కూడా సంఘర్షణల మధ్య బతుకుతున్న ఓ విశ్వాసి కథ.

అలా చూస్తే ఈ డాక్యుమెంటరీ పాపాలాల్ గురించి మాత్రమే మాట్లాడదు. ఇది మన కాలపు సమాజ పోకడల గురించి మాట్లాడుతుంది. చివరికిది మన కథగా ఆవిష్కృతమౌతుంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మన కాలపు 'విశ్వాసాల' గురించి మనతో చర్చకు దిగుతుది. మతం అంటే విశ్వాసమా? విశ్వాసమంటే మతరీతులా? మతరీతులు మానవ సంబంధాలకు అడ్డంకా? అసలు మానవ సంబంధాల్లో మతం పాత్ర ఏంటి? మానవత్వం అనే భావనకి, విశ్వాసాలకు ఉన్న సంబంధం ఏంటి? లాంటి ఎన్నో ప్రశ్నలకు ఈ డాక్యుమెంటరీ తలుపులు తెరుస్తుంది.

మొత్తానికి ఫ్రెంచి ప్రగతి వాదానికి గమనం ఇచ్చిన సమానత్వ భావనలను ఆచరించి హైదరాబాదు స్థానికులచే మూసారాం, మూసారహీంగా మన్ననలందుకుంటున్న మన్సూర్ రేమండ్ స్థూపంగా పాపాలాల్ జీవితాన్ని ఆవిష్కరిస్తుది. గాంధీజీ గొంతులో ప్రాణం పోసుకున్న రాజకీయ నినాదంగా ముగుస్తుంది.

చివరగా హిందువునని గర్వించడం కాదు మనిషిగా బతకడం ఎలాగో బతికి చూపించే ఒక సామాన్యుని అసామాన్య గాథను మనసుకు హత్తుకునేలా, ఆలోచనలను రేకెత్తించేలా మనకందించిన శ్రవణ్ కటికనేని ముందు ముందు మరిన్ని గొప్ప సినిమాలు మనకందిస్తారని భరోసా కలుగుతున్నది. తెలంగాణ సినిమాకి మంచి భవిష్యత్తు ఉండొచ్చనే నమ్మకం కల్గిస్తున్న యువ దర్శకుడూ, ఎడిటర్ శ్రవణ్ కటిక నేనిని ఉత్తమ లఘు చిత్రం / డాక్యుమెంటరీ విభాగానికిచ్చే పైడి జయరాజ్ పురస్కారంతో తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ (తేనా) సత్కరించడం ఎంతైనా అభినందనీయం.

–కె. విమల




## బీసీఉప ప్రణాళికకై పోరాటం

బీసీ ఉప ప్రణాళిక సాధించేంత వరకు పోరాడుతామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, శాసనసభ్యుడు డా. లక్ష్మణ్ అన్నారు. ధర్నాచౌక్‌లో భాజపా ఓబీసీ రాష్ట్ర కమిటీ ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన హక్కులను సాధించుకునేందుకు 112 బీసీ కులాలు సమైక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కులవృత్తులు, చేతివృత్తులతో సంపద సృష్టించి పెడుతున్న బీసీ వర్గాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.

పోరాడకపోతే పట్టించుకునే వారుండరని అన్నారు. 54 శాతం బీసీ జనాభా ఉన్నందున తెలంగాణ బీసీల రాష్ట్రమని, వారి అభ్యున్నతి కోసం రూ. లక్ష కోట్లు అయినా సరే ఖర్చుపెడతామన్న మాటలు నీటిమూటలుగా మారిపోయాయని ధ్వజమెత్తారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింలను బీసీ జాబితాలో చేరుస్తామంటే సహించేది లేదన్నారు. వారికి వేరే కోటా కల్పిస్తే అభ్యంతరం లేదన్నారు. శాసనసభ్యుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ బీసీ సమస్యలపై శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామ న్నారు. శాసనమండలి సభ్యుడు రామచందర్‌రావు మాట్లాడుతూ బీసీ వర్గాలను ఓటు బ్యాంకులుగా వాడుకుని వదిలేశారని విమర్శించారు. భాజపా తెలంగాణ ఓబీసీ కమిటీ అధ్యక్షుడు కాటం నర్సింహా యాదవ్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో మాజీ శాసనసభ్యులు బద్దం బాల్‌రెడ్డి, వన్నాల శ్రీరాములు, మాజీ ఉప మేయర్ సుభాష్ చందర్ జీ, భాజపా నాయకులు దాసరి మల్లేశం, కర్నాటి ధనంజయ, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల దీక్ష

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర జూనియర్ కాలేజీలు, డిగ్రీ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సంఘాల ఐకాస ప్రధాన కార్యదర్శి డా. కొప్పిశెట్టి సురేష్ డిమాండ్ చేశారు. ధర్నాచౌక్‌లో మూడో రోజు రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సంఘాల ఐకాస హైదరాబాద్ కమిటీ నిరాహార దీక్ష కొనసాగించింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం ఉద్యోగాలు పొందినప్పటికీ ఒప్పంద అధ్యాపకులుగా పరిగణించడం అన్యాయమన్నారు. కళాశాలల్లో 80 శాతం ఒప్పంద అధ్యాపకులే ఉన్నారన్నారు. పదో పీఆర్‌సీ ప్రకారం మూల వేతనం, కరవు భత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, రజని, శోభన్‌బాబు, మనోహర్ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ బీడీఎల్ నూతన అధ్యక్షుడు దానకర్ణాచారి డిమాండ్ చేశారు. నగరంలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కాచిగూడ సుప్రభాత్ కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో బీసీ మహిళా సమాఖ్య జాతీయ అధ్యక్షురాలు ఎం. భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు.

## మత్స్యకారుల వృత్తి భద్రత కల్పించాలి

రాష్ట్రంలోని మత్స్య సహకార సంఘాల సభ్యుల వృత్తి భద్రతకు 'మత్స్య విధాన' ప్రకటన చేయాలని తెలంగాణ గంగపుత్ర సంఘం కోరింది. అంబర్‌పేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు దీటి మల్లయ్య తదితరులు మాట్లాడారు. బెస్తలకు సరైన ప్రాతినిధ్యం లేనందువల్ల నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

## విధుల్లోకి తీసుకోవాలని వినూత్న నిరసన

విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సేంద్రీయ వ్యవసాయ కార్యకర్తలు అర్ధ నగ్నప్రదర్శన చేశారు. ధర్నాచౌక్‌లో ఆరో రోజు తెలంగాణ సుస్థిర వ్యవసాయ జీవనోపాధుల క్లస్టర్ కార్యకర్తల సంఘం (సెర్ప్) వినూత్న ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షురాలు సీహెచ్ లలిత, ప్రధాన కార్యదర్శి బాల వెంకటయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల క్రితం తెచ్చిన పథకంలో భాగంగా సహజ ఎరువులతో పంటలు పండించడం రైతులకు నేర్పుతున్నామన్నారు. కేవలం రూ. 4,000 జీతంతో 642 మంది పనిచేస్తున్నారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం తమ సేవలను గుర్తించి రూ. 2000 అదనంగా చెల్లించిందని గుర్తు చేశారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 642 మందిని విధుల నుంచి తొలగించి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వయసు మీరిన తమను తొలగిస్తే బతకడం ఎలాగని ప్రశ్నించారు. దళితులు, గిరిజనుల చేత వ్యవసాయం చేయిస్తున్న తమకు అన్యాయం చేయవద్దన్నారు. వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, వేతనం పెంచాలని డిమాండ్ చేశారు.

## 'ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వెంటనే చేపట్టాలి'

తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే లక్షన్నర ఉద్యోగల భర్తీకి ప్రకటన విడుదల చేయాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో

ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గ్రంథాలయం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించి, రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మానవతా రాయ్, కల్యాణ్, కల్వకుర్తి ఆంజనేయులు మాట్లాడుతూ కార్పొరేషన్ లలో ఉన్న 40 వేల ఉద్యోగాలను ఒప్పందం పద్ధతిలో కాకుండా రెగ్యులర్ ప్రకటన ద్వారా భర్తీ చేయాలని, డీఎస్సీ, గ్రూప్1, 2, జేఎల్, డీఎల్ తదితరాలకు ప్రకటన విడుదల చేయాలన్నారు.

## అంతరించిపోయిన కళలపై అధ్యయనం చేయాలి

అంతరించిపోయిన కళలపై లోతైన అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి పేర్కొన్నారు. నటరాజరామకృష్ణ ఆంధ్రనాట్య ట్రస్ట్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో సుప్రసిద్ధ నాట్యాచార్యులు డా.నటరాజ రామకృష్ణ రచించిన 'దక్షిణాత్యుల నాట్య కళా చరిత్ర' ఆంగ్ల అనువాద పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత డా.రమేశ్ కృష్ణ ఆంగ్లంలోకి అనువదించారు. ఆవిష్కర్త డా.కె.వి.రమణాచారి మాట్లాడుతూ.. నాటరాజ రామకృష్ణ ఆశయాల సౌరభాన్ని ప్రపంచానికి పరిచయం చేసేదిగా ఈ గ్రంథం ముస్తాబైందన్నారు. ముఖ్యఅతిథి విశ్రాంత ఐపీఎస్ ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ.. నటరాజ రామకృష్ణ స్ఫూర్తితోనే నగరంలోని తారామతి ఒక అద్భుతమైన వేదికగా మారిందన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అధ్యక్షోపన్యాసం చేశారు.

## అంటరానితనంతో నాపైనా వివక్షే: గద్దర్

'ఏళ్ల తరబడి మహిళలు అక్షరాస్యతకు దూరమయ్యారంటే దీనికి ప్రధాన కారణం అగ్రకులాలే. నాకు ఒక హోదా ఉన్నప్పటికీ నన్ను మనిషిగా గుర్తించడం లేదు... దీనికి కారణం అంటరానితనమే. కుల రహిత సమాజాన్ని సాధించుకోవాలి అని ప్రజా గాయకుడు గద్దర్ పిలుపునిచ్చారు. పాలకులను విమర్శించే బదులు మనమే ప్రజల్లోకి వెళ్లి మహిళల అక్షరాస్యతను పెంపొందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. సుందరయ్య కళానిలయంలో ప్రజా వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని 'స్త్రీ విద్య ప్రాముఖ్యత'పై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందులో పాల్గొన్న హైకోర్టు విశ్రాంత జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ... మహిళల విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. సావిత్రిబాయి పూలే ఉద్యమస్ఫూర్తితో మహిళలంతా ఐక్యమై తమ హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. సమావేశంలో ప్రజాశక్తి మాజీ సంపాదకులు వినయ్‌కుమార్, ఉ.సాంబశివరావు, జేబిరాజు, రాం నర్సయ్య, దరవు అంజన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక విధానాలు ఉపాధి కల్పించేలా ఉండాలి

ప్రభుత్వ ఆర్థిక విధానాలు ఉపాధి కల్పించేలా ఉండాలని తెలంగాణ ఐకాస ఛైర్మన్ కోదండరాం అన్నారు. సుందరయ్య కళా నిలయంలో డిప్లొమో స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలిటెక్నిక్ విద్య.. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించిన చర్చ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన విద్యార్థులకు ఎయిర్‌లైన్స్, రైల్వే తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో 85 శాతం స్థానికత ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ కాలమానిని ఆవిష్కరించారు.

## చట్టాలు అమలుకాక ప్రజల్లో అసహనం

చట్టాలు సక్రమంగా అమలు కాకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసహనం పెరిగిపోతోందని మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఎ.సత్యప్రసాద్ అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర భూసేకరణ చట్ట సవరణ బిల్లు-2016 అంశంపై సుందరయ్య కళానిలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇలాంటి భూసేకరణ చట్ట సవరణలు రాజ్యాంగబద్ధంగా నిలబడటం కష్టమన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది దుర్గాప్రసాద్ మాట్లాడుతూ... గ్రామసభల్లో ప్రాజెక్టు నిర్మాణంపై సమగ్ర చర్చ జరిగి, ప్రజలు ఆమోదం తెలపాలన్నారు. ప్రభుత్వం కూడా భూనిర్వాసితులకు ముందుగా నోటీసులు ఇచ్చి వారి అభిప్రాయాలను సేకరించాలని, మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, ఐలు ఉపాధ్యక్షుడు పార్థసారథి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతల చంద్రారెడ్డి, మాజీ ఎంపీ సోలిపేట రాంచంద్రారెడ్డి మాట్లాడారు.

## విద్యావ్యవస్థను పట్టించుకోవాలి

ఫ్యూడల్ వ్యవస్థపై తిరుగుబాటే తెలంగాణ సాయుధ పోరాటం అని మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య అన్నారు. శంషాబాద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర రెండో మహాసభల సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో చుక్కారామయ్య మాట్లాడుతూ..దేశ భవిష్యత్తుకు విద్యార్థులే పునాదులన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ బాల్యవివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టి బాలికలను విద్యారంగం వైపు తీసుకొచ్చేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ.. ఫీజు రీయంబర్స్‌మెంట్, నిరుద్యోగం తదితర సమస్యలపై యువత రోడ్లెక్కుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు ఎన్నో ఆశలు కల్పించి మోసం చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలోనేతలు పీవీ సాహూ, కోట రమేశ్, జగదీశ్, ప్రకాశ్ కారత్, ఆనంద్, ప్రణయ్ పాల్గొన్నారు. ద

## అప్పీలు తేలేదాకా కార్యకలాపాలను నిలిపేయండి

**ట్రైబ్యునల్‌ను కోరిన తెలంగాణ సర్కారు**



గడువు పొడిగించిన ట్రైబ్యునల్ తెలుగు రాష్ట్రాలకే పరిమితమన్న తీర్పుపై... సుప్రీం కోర్టులో అప్పీలు తేలేదాకా కార్యకలాపాలను నిలిపివేయాలని బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌ను తెలంగాణ సర్కారు కోరింది. దీనిపై ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వి భజన చట్టం మేరకు ఈ ట్రైబ్యునల్ గడువును పొడిగించారు. అయితే, దీని పరిధిపై ఇటీవల వాదనలు జరిగాయి. నాలుగు రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు వాదించగా, రెండు రాష్ట్రాలకే పరిమితమవ్వాలని కర్ణాటక, మహారాష్ట్రలు పేర్కొన్నాయి. కేంద్రం కూడా రెండు రాష్ట్రాలకే వర్తిస్తుందని తెలిపింది. దీంతో తెలుగు రాష్ట్రాలకే పరిమి తమవుతున్నట్లు ట్రైబ్యునల్ తీర్పు చెప్పి... ప్రాజెక్టుల వారీగా కేటా యింపు, తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు వినియోగంపై అభిప్రాయా లు తెలపాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను కోరింది. రెండు రాష్ట్రాలకే పరిమితమైతే తమ రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర నష్టమని తెలంగాణ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. మొదటి, రెండో ట్రైబ్యునళ్ల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరిగిందని, ఈ తీర్పును నిలిపివేసి నాలుగు రాష్ట్రాల భాగస్వామ్యంతో చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలంటూ సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చే సింది. తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లినందున.. నీటి పంపకాలపై తమ అభిప్రాయం చెప్పడం సరికాదని భావించింది. సుప్రీంకోర్టులో అప్పీలు తేలే వరకూ విచారణను నిలిపివేయాలని ట్రైబ్యునల్‌లో మెమో దాఖలు చేసింది. ట్రైబ్యునల్ చెప్పిన గడువు ముగిసినా, ఏపీ ప్రభుత్వం ఇంకా తన అభిప్రాయాన్ని చెప్పలేదు. ట్రైబ్యునల్ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లాలా, లేదా అన్నదానిపై ఇంకా తుదినిర్ణయం తీసుకోలేదని తెలిసింది.

## సంపూర్ణ గోవధ నిషేధానికి ఆదేశించలేం

గోవధను సంపూర్ణంగా నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిం ది. గోవధను సంపూర్ణంగా నిషేధించాలని లేదా వధ, స్మగింగ్‌కు గురికాకుండా పశువులను రక్షించేందుకు సమగ్ర విధానాన్ని రూపొం దించాలని కోరుతూ ఢిల్లీ వాసి వినీత్ సహాయి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గోవధ, పశువుల రవాణాపై వేర్వేరు రాష్ట్రాలు భిన్నమైన విధానాలు అనుసరిస్తున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో గట్టి చట్టాలు ఉన్నప్పటికీ కేరళలో ప శువుల వధను అనుమతిస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగా రాష్ట్రాల మధ్య పశువుల అక్రమ రవాణా సాగుతున్నదని తెలిపారు. ఈ నే పథ్యంలో పశువుల రక్షణ, గోవధ నిషేధంపై దేశం మొత్తం ఒకే విధానం అనుసరించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. అయితే, పశువుల వధను నిషేధిస్తూ చట్టాన్ని రూపొందించాలని తాము రాష్ట్రాలను ఆదేశించలేమని చీఫ్ జస్టిస్ జేఎస్ ఖెహర్, జ స్టిస్ ఎన్వీ రమణలతో కూడిన ధర్మాసనం పే ర్కొంది. వారి చట్టాల్లో తాము జోక్యం చేసు కోబోమని తెలిపింది. పశువుల అక్రమ తరలింపు ను అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గతంలోనే సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చే సిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఈ పిటిషన్‌ను స్వీక రించేందుకు కోర్టు నిరాకరించింది. పశువులను రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య అక్రమంగా రవాణా చేస్తున్నారన్న మరొక పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు.. ఇటువంటివాటిని నిరోధించేందుకు నిబంధనలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వా న్ని కోరింది. నేపాల్‌లో ఐదేండ్లకోసారి జరిగే గధిమాయి ఉత్సవా లకు భారత్ నుంచి పెద్ద సంఖ్యలో పశువులను రవాణా చేస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌లో సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

## సమాచార హక్కు చట్టం సామాన్యులకు వరం

అభివృద్ధి, పరిపాలనలో పారదర్శకత, అవినీతి అక్రమాలను నిరోధించేందుకు ఈ చట్టం దోహదపడుతుందని కేంద్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. ఈ చట్టం ప్రశ్నించే తత్వాన్ని పెంపొందిస్తుందని వెల్లడించారు. దీని దృష్ట్యా ఈ చట్టంపై సామాన్యులలో అవగాహన తీసుకువచ్చి అవినీతి, అక్రమాలను నివారించేందుకు తోడ్పాటునందించాలని కోరారు. ఈ మేరకు సమాచార హక్కు వికాస సమితి రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరణ సభను బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించారు. సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కాచం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు హాజరైన మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ. చట్టం వచ్చిన తర్వాత వ్యవస్థలో కొంత మార్పు వచ్చిందని అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాల సహ చట్టం ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడు తూ.. సహ చట్టం వచ్చిన తర్వాత అధికార దుర్వినియోగానికి పా ల్పడే వారికి భయం ఏర్పడిందన్నారు.

## న్యాయవృత్తికి న్యాయం చేయాలి

న్యాయ వ్యవస్థలో ఉన్న వారు తమ వృత్తికి న్యాయం చేయాలని హైకోర్టు న్యాయమూర్తి పీవీ సంజయ్‌కుమార్ అన్నారు. న్యాయ స్థానాల్లో ప్రజలకు తగిన న్యాయం అందించడంలో నాణ్యత కొర వడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులు తీర్పులు గర్వపడేలా ఉండాలన్నారు. మల్కాజిగిరి కోర్టు నూతన భవనం ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థ అర్థవంతంగా ఉండాలంటే, అందరు తమ వృత్తికి న్యాయం చేయాలని కోరారు. ప్రతిభను మరింత మెరుగుపర్చి రేపటి తరానికి ఆదర్శనంగా ఉండాలన్నారు. ద

## బి.సి.ల వైతాళికుడు, హైద్రాబాద్ నగర మొదటి మేయర్

# కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్

**బాల్యం:**

క్రీ.శ. 1893 సెప్టెంబర్ 03న, ఔరంగాబాద్ సుబా (ప్రస్తుతం మహారాష్ట్ర)లో అజంతాకు దగ్గరలో ఉన్న 'జాల్నా' అనే పట్టణంలో, ఎల్లయ్య బిజుబాయి దంపతులకు 4వ సంతానంగా మగబిడ్డ జన్మించాడు. ఆ రోజు కృష్ణాష్టమి. అందుకని ఆ బాలునికి 'కృష్ణస్వామి' అని పేరు పెట్టారు. కృష్ణస్వామి బాల్యం జాల్నా లోనే గడిచింది. ఇతని పూర్వీకులందరు నిజాం సైన్యంలో పనిచేశారు. ఎల్లయ్య హైద రాబాద్ కాంటిజెంట్ 95వ రస్సెల్స్ ఇన్‌ఫెంట్రాలో పనిచేశారు. సైనికు నిలో ఉండే ధైర్యసాహసాలన్ని కృష్ణస్వామికి జీన్స్ ద్వారా సంక్రమిం చాయి. కాని ప్రాథమికవిద్య మాత్రం సక్రమంగా సాగలేదు. అయిన ప్పటికి పట్టుదలతో హింది, ఉర్దూ, మరాఠి, తెలుగు భాషలు నేర్చు కున్నాడు.



**ఉద్యోగం:**

17 ఏండ్ల వయసులోనే 'పర్భిణి' అనే పట్టణంలో తాత్కాలిక హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. కాని, కొడుకు పోలీసు ఉద్యోగం చేయడం తండ్రికి ఇష్టం లేదు. దాంతో ఆ ఉద్యోగాన్ని వదిలేసి మరో ఉద్యోగాన్వేషణలో హైద్రాబాద్ చేరుకున్నాడు. ఎంత ప్రయత్నించినా ఏ ఉద్యోగం దొరకలేదు. ఆర్థిక ఇబ్బందులతో పాటు ఎన్నో బాధలు పడ్డాడు. ఆసమయంలోనే ఇద్దరు ఆపద్బాంధువులు, రాయ్‌భవాన్‌ప్రసాద్, హకీం మక్సూద్ అలీఖాన్‌లు తారసపడ్డారు. వారు కృష్ణస్వామిని అన్ని విధాలుగా ఆదుకున్నారు. వారి సహకారంతో చాదర్‌ఘట్ ఉన్నత పాఠ శాలలో చేరి మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. ఇంటర్మీడియెట్ వరకు కొనసాగించాడు. ఉన్నత విద్య చదివే స్తోమత లేకపోవడంతో ఇక చదువును అంతటితో ఆపివేసి టైప్ రైటింగ్ షార్ట్ హాండ్ నేర్చుకున్నాడు.

కృష్ణస్వామి అక్క సాయమ్మను హైదరాబాద్‌కు ఇచ్చారు. బావకి పాల వ్యాపారం ఉండేది. ఆయన ప్రధానమంత్రి కిషన్ పర్షద్ ఇంటికి కూడా పాలు పోసేవాడు. అప్పుడప్పుడు కృష్ణస్వామి కూడా పాలు పోయడానికి కిషన్ పర్షద్ ఇంటికి వెళ్ళేవాడు. కృష్ణస్వామిలోని చురుకుదనాన్ని, వినయవిధేయతలను గమనించి కిషన్ పర్షద్ అతని టైప్‌రైటింగ్ అర్హతను తెలుసుకొని తన ఆంతరంగిక సహాయ కార్యదర్శిగా ఉద్యోగం ఇచ్చాడు. కృష్ణస్వామి ఆ ఉద్యోగంలో మూడు ఏండ్లు పనిచేశాడు. తర్వాత ఆ ఉద్యోగాన్ని వదులుకొని ప్రభుత్వరంగ సంస్థ అయిన నిజామ్స్ బ్రిగేడ్‌లో చేరాడు. కొంతకాలానికి అక్కడి నుండి అకౌంట్జనరల్ ఆఫీస్‌కు బదిలీ అయ్యాడు. ఆ ఉద్యోగంలో తొమ్మిది ఏండ్లు పనిచేశాడు. ఆ ఉద్యోగాన్ని కూడా వదులుకొని బొంబాయి వెళ్ళి ప్రింటింగ్ అండ్ పబ్లిషింగ్ రంగంలో శిక్షణ పొంది వచ్చాడు. ఆ నైపుణ్యంతో, తన కుమార్తె చంద్రకాంత పేరు మీద 'చంద్రకాంత ప్రెస్'ను స్థాపించాడు. ఇందులో తన కుటుంబంతో పాటు తమ్ముని కుటుంబం, బావమరిది కుటుంబంలోని సభ్యులంతా పనిచేసేవాళ్ళు. అంతా ఒకే ఇంట్లో ఉండేవాళ్ళు. ప్రారంభంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా కొద్ది కాలంలోనే దక్షిణ భారత ప్రెస్‌లల్లో ప్రముఖ ప్రెస్‌గా పేరు సంపాదించింది. 'పిక్టోరియల్ హైదరాబాద్'ను ముద్రిస్తున్న సమయంలో ఎందరో రాజ ప్రతినిధులు, ప్రముఖులు ఆ ప్రెస్‌ను సందర్శించి ప్రశంసించేవారంట! తాను సంపాదకత్వం వహించే 'దక్కన్ స్టార్', ఆర్యసమాజ్ పత్రిక 'మసావత్', 'న్యూ ఎరా' పత్రికలు కూడా చంద్రకాంత ప్రెస్‌లోనే ముద్రించేవాడు.

**పాత్రికేయుడుగా:**

'హిందూ' (ఆంగ్లం) పత్రికకు హైద్రాబాద్ విలేఖరిగా పని చేశాడు. 1926లో 'దక్కన్ స్టార్' (ఇంగ్లీష్) అనే వార పత్రికను ప్రారంభించి, దానికి తానే సంపాదకత్వం వహించాడు. ఆర్య సమాజ భావజాలాన్ని హైద్రాబాద్ స్టేట్‌లో ప్రచారం చేయడానికి 'మసావత్' (ఉర్దు) అనే వారపత్రికను స్థాపించి, సంపాదకత్వం వహించాడు. హైద్రాబాద్ స్టేట్ భారత దేశంలో విలీనమైన తర్వాత 1948లో 'న్యూ ఎరా' (ఇంగ్లీష్) దినపత్రికను స్థాపించి, సంపాదకత్వం వహించాడు. తన చివరి ఘడి యల వరకూ ఏదో పత్రికకు విలేకరిగానో, సంపాదకవర్గ సభ్యుడిగానో పని చేస్తూ చైతన్యవంతంగా జీవించాడు. ఈయన వ్యాసాలు 'ఇమ్రోజ్', 'రహనుమాయే దక్కన్', 'మిలప్', 'సియాసత్' వంటి పత్రికల్లో వచ్చేవి.

**రాజకీయ ప్రవేశం:**

వివిధ సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పనిచేస్తున్న కృష్ణస్వామి 1921లో జరిగిన అహ్మదాబాద్ కాంగ్రెస్ సమావేశానికి హాజరయ్యాడు. 1922లో గాంధీజీ చేపట్టిన ఖిలాపత్ ఉద్యమాన్ని హైదరాబాద్ రాష్ట్రంలో విజయవంతం కావడంలో తన వంతు పాత్ర నిర్వహించాడు. 1924లో బూర్గుల రామకృష్ణారావు నాయకత్వంలో ఏర్పడిన 'స్టేట్ రిఫార్మర్స్ అసోసియేషన్స్' స్థాపనలో ముఖ్యపాత్ర పోషించాడు. 'హైదరాబాద్ లెజిస్లేటివ్ కౌన్సిల్' ఏర్పాటు చేయడానికి నిజాం తలొగ్గేటట్లు చేయడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. 1928లో 'ఆంధ్ర కాన్ఫరెన్స్' సమావేశాన్ని ఏర్పరచి కార్యక్రమాలను విస్తృతం చేశాడు. ఆ కాన్ఫరెన్సే తర్వాతి కాలం (1938)లో 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్'గా మారింది. దీనిని నిజాం నిషేదించినపుడు (సెప్టెంబర్ 1938) 400 మందితో సత్యాగ్రహం చేసి అరెస్ట్ అయ్యాడు. విడుదలయ్యాక నిజాం చట్టాలకు చిక్కకుండా ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలు చేస్తూ, హరికథలు, భజనలు, వేడుకలు జరుపుతూ ప్రజలను నిత్య చైతన్యవంతులను చేస్తుండేవాడు.

1933లో హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చుడిబజార్ నుండి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యాడు. 1940లో నిజాం ప్రభుత్వం అతన్ని 'నాయబ్ మీర్ మజ్లీస్'గా నియమించింది. 1955లో డిప్యుటి మేయర్‌గా ఎన్నికయ్యాడు. ఈ హోదాలో అనేక కమిటీలకు సలహాదారుగా పని చేశాడు. 1957లో మేయర్‌గా ఎన్నికయ్యాడు. కృష్ణస్వామి, స్వాతంత్ర్యా నంతరం హైద్రాబాద్‌కు మొదటి మేయర్ (మొదటి నుండి వరుస క్రమంలో నాల్గవ మేయర్). మేయర్‌గా హైద్రాబాద్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని 'మాస్టర్ ప్లాన్' తయారు చేయించాడు. దాన్ని అనుసరించే నేటి మహానగరం రూపుదిద్దుకుంది. మేయర్‌గా ఎన్నో ప్రజోపయోగకర మైన పనులు చేశాడు. మానవతా దృక్పథంతో చేతిరిక్షాలను నిషేధిం చాడు. బ్రతుకుతెరువు కోసం ఒక మనిషి ఇంకొక మనిషిని మోయడం మానవజాతికే అవమానమని ఆయన భావన. ఆ వృత్తిపై ఆధారపడిన వాళ్ళకు ప్రత్నామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాడు. తాను మేయర్‌గా ఉన్న కాలంలోనే భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మొదటిసారిగా హైద్రాబాద్‌కు వచ్చి 'సివిక్ రిసిప్షన్'ను పొందాడు. యుగోస్లోవేకియా అధ్యక్షుడు మార్షల్ టిటో హైద్రాబాద్‌ను సందర్శిం చాడు. మేయర్ కృష్ణస్వామి టిటోకి స్వాగతం పలకడానికి ఫతేమైదాన్ (లాల్ బహదూర్ స్టేడియం)లో గొప్ప సన్మానసభ జరిపాడు. ఆ సభలో కృష్ణస్వామి ఉపన్యాసానికి ప్రేక్షకులు కరతాళధ్వనులతో సభను హోరెత్తించారు. అది చూసి ముగ్ధుడైన టిటో, కృష్ణస్వామిని ఆలింగనం చేసుకొని తనచేతి గడియారాన్ని తీసి బహూ కరించాడంట! ఇది కృష్ణస్వామిలోని ఉపన్యాస కళను వెల్లడిస్తుంది.

కృష్ణస్వామి నిస్వార్థ ప్రజాసేవకుడు. మా రుతున్న రాజకీయాల కనుగుణంగా మారలేక రాజకీయాల నుండి తప్పుకుని ప్రజాసేవకుడిగా ఉంటూనే బి.సి.కులాలను చైతన్య పరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడు.

**సమాజసేవ**

కృష్ణస్వామిలో సంఘసేవా దృక్పథానికి నాంది అతని విద్యార్థి దశలోనే పడింది. 1917లో హైద్రాబాద్ స్టేట్‌లో ప్రబలిన ఇన్‌ఫ్లూయెం జాను అరికట్టడంలో సహాయపడుతున్న ఒక టీంలో చేరి సహాయ కార్యక్రమాలలో పాల్గొన్నాడు. అతని సేవాతత్పరతను చూసి ఎందరో పెద్దలు ప్రశంసించారు. 1918లో నాందేడ్ జిల్లా, హద్ గామ్‌లో జరిగిన 'సోషల్ సర్వీస్ కాన్ఫరెన్స్'లో యువకుడైన కృష్ణస్వామిని వర్కింగ్ కమిటి సభ్యునిగా ఎన్నుకొన్నారు. 1927లో జరిగిన 'అఖిల భారత స్టేట్ పీపుల్స్ కాన్ఫరెన్స్'లో కృష్ణస్వామి 'ముఖ్య ప్రతినిధిగా' పాల్గొన్నారు. 'జీవరక్ష ప్రచార మండలి'ని స్థాపించి జాయింట్ సెక్రటరీగా పనిచేశాడు. 'హైద్రాబాద్ హెల్త్ లీగ్' అనే వ్యాయామశాలను స్థాపించి, వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్గించాడు. 1926లో సుల్తాన్ బ జార్‌లో 'తెలుగు గ్రంథాలయ రజతోత్సవ సమావేశం' జరిగింది. ఈ సందర్భంగా 'ఆంధ్రవాలెంటర్ కోర్'ను స్థాపించగా దానికి అతన్నే కెప్టన్‌గా ఎన్నుకున్నారు. తర్వాత శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ కమిటీ మెంబర్‌గా 14 సంవత్సరాలు పనిచేశాడు.

**విద్యాసేవ:**

హైద్రాబాద్ స్టేట్‌లో విద్యావ్యాప్తి కొరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు స్థాపించడానికి ప్రోత్సాహం అందించాడు. నారాయగూడలోని రెడ్డికాలేజ్, మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాల స్థాపనల్లో కృష్ణస్వామి ప్రముఖపాత్ర పోషించాడు.

హైదరాబాద్ స్టేట్‌లో దేశభాషయైన హిందీ భాష వ్యాప్తికోసం కృషి చేసిన వారిలో కృష్ణస్వామి ప్రాతఃస్మరణీయులు. 1920లో హైద రాబాద్‌లోని చుడిబజార్‌లో 'హిందీ కన్యా పాఠశాల'ను స్థాపించాడు. ఇది ఇప్పటికీ పనిచేస్తుంది. లాహోర్‌లో జరిగిన 'ఆల్ ఇండియా హిందూ సాహిత్య సాహిత్య కాన్ఫరెన్స్'లో పాల్గొని 'స్టాండింగ్ కమిటీ రిప్రెజెంటింగ్ దక్షిణ ప్రాంత మెంబర్'గా ఎన్నుకోబడ్డాడు. దానికి అనుబంధంగా ఉన్న 'రిసెప్షన్ కమిటికి వైస్ చైర్మన్'గా ఎన్నుకోబడ్డాడు. 'హిందీ వాలెంటర్ ఆర్గనైజేషన్'కు ఇన్‌చార్జిగా పనిచేశాడు. హైద్రాబాద్‌లో 'ఆల్ ఇండియా కాన్ఫరెన్స్'ను నిర్వహించారు. హైద్రాబాద్‌లోని హుస్మద్ గంజ్, చుడిబజార్‌లలో హిందీ గ్రంథాలయాలు స్థాపించడంలో ప్రముఖ పాత్ర పోషించడమే కాకుండా ప్రతి సంవత్సరం వార్షికోత్సవాలు నిర్వ హించాడు. 1938లో 'పీపుల్స్ ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్'ను స్థాపించాడు. కాని దీని నిజాం ప్రభుత్వం నిషేధించింది. అయినా కృష్ణస్వామి పట్టు వదలకుండా కాన్ఫరెన్స్‌లను నిర్వహిస్తూ హైదరాబాద్ స్టేట్‌లో విద్యా వ్యాప్తికి దోహదపడ్డాడు.



భారత ప్రధాని నెహ్రూతో కృష్ణస్వామి...

'నిజాం రాష్ట్ర విద్యాసలహాదారు బోర్డు' సభ్యునిగానే కాకుండా 1957లో హైద్రాబాద్ మున్సి పల్ కార్పొరేషన్ ప్రతినిధిగా ఉస్మానియా విశ్వవిద్యాల యానికి సెనెట్ మెంబర్‌గా నియమించబడ్డాడు.

**ధార్మికసేవ**

హైద్రాబాద్‌లో 'శ్రీవిష్ణు కాన్ఫరెన్స్' హిందూ సమావేశాన్ని నిర్వ హించడానికి ప్రయత్నిస్తే నిజాం అనుమతించలేదు. దాంతో కృష్ణస్వామి ఏ పేరు లేకుండానే కోఠిలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రముఖ మతాచార్యుల చేత, సంఘసంస్కర్తలచేత ఉపదేశాలిప్పించాడు. ఆ సందర్భంగా నిజాంకు వ్యతిరేకంగా 'మిస్ రూల్ ఆఫ్ నిజాం' అనే కరపత్రాన్ని విడుదల చేశాడు.

1925లో 'హిందూ ధర్మపరిషత్'ను స్థాపించాడు. అదే ఏడాది జాంబాగ్ (కోఠి)లోని దేవాలయంలో గొప్ప ధార్మిక మహాసభను నిర్వ హించాడు. ఆ సభలో హరిజనోద్ధరణ గురించి ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. అన్ని మతాల సారమొక్కటేనని కృష్ణస్వామి విశ్వసించే వాడు. అందుకే హైద్రాబాద్‌లో ఎక్కడన్నా ఏ కొంచెం ఘర్షణ వా తావరణం నెలకొన్నా వెంటనే ప్రత్యక్షమయ్యేవాడు. మతసామరస్యం కాపాడడానికి అవసరమైతే పలుకుబడినంతా ఉపయోగించేవాడు. అందుకే నాటి ముస్లీం పెద్దలు కృష్ణస్వామిని 'ఎంబడిమెంట్ ఆఫ్ సెక్యులరిజం' అని కొనియాడే వారు.

**బి.సి. కాన్సెప్ట్:**

కృష్ణస్వామి వెనకబడినవారి అభ్యున్నతి కోసం పాటుపడ్డాడు. హైద్రాబాద్ స్టేట్‌లో ఉన్న వెనకబడిన వర్గాలన్నింటినీ ఒక్కతాటిపైకి తేవడానికి ఎంతగానో కృషిచేశాడు. మాడపాటిలాంటి ప్రముఖులతో కలిసి 'ఆల్ హైద్రాబాద్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ అసోసియేషన్'ను స్థాపించి దానికి ఉపాధ్యక్షునిగా పనిచేశాడు. 'హైదరాబాద్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ కమిటీ' స్థాపనలో ప్రముఖ పాత్ర పోషించాడు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ బ్యాక్ వర్డ్ క్లాసెస్'కు సభ్యునిగా నియమించబడి మూడు సంవత్సరాలు పనిచేశాడు. ముదిరాజ్ కుల సంఘం స్థాపనతో పాటు యాదవ సంఘం, మున్నూరుకాపు సంఘం మొదలైన కుల సంఘాల స్థాపనల్లో ప్రముఖపాత్ర పోషించాడు.

**కులసేవ**

హైద్రాబాద్ స్టేట్‌లో తెలుగు, తెనుగు, ముత్తరాశి, ముదిరాజ్, భంటు మొదలైన పేర్లతో పిలువబడుతున్న తెలుగు కులస్థుల్లో రాజకీయ చైతన్యం కల్గించడానికి ఒక సంఘాన్ని స్థాపించాలని భావించిన వాళ్ళల్లో ముఖ్యులు కె.కృష్ణస్వామి, ఆర్.కేశవ్‌లు. వీరిద్దరి కృషి వల్ల 30.9.1922న 'ముదిరాజ్ (ముక్తరాజ) మహాసంఘము-దక్షిణ హైద్రాబాద్' అనే పేరుతో ముదిరాజ్ కుల సంఘం స్థాపించబడింది. ఈ ఇద్దరూ ప్రథమ కార్యదర్శులుగా, జి.రామకృష్ణయ్య ముదిరాజ్ ప్రథమ అధ్యక్షులుగా ఈ సంఘం తన కార్యకలాపాలను ప్రారంభించింది. కార్యాలయం గౌలిగూడలో ఉండేది.



మేయర్‌గా సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణస్వామి

1941లో తుల్జాభవన్‌లో జరిగిన ముదిరాజ్ మహాసమ్మేళనంలో కె.కృష్ణస్వామి ముదిరాజ్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. అప్పటి నుండి 1961 వరకు నిర్విరామంగా ఈ సంఘానికి అధ్యక్షునిగా పనిచేశారు. తాను అధ్యక్షునిగా 1954లో 'అఖిల భారత ముదిరాజ్ ప్రథమ మహాసభ'ను హైద్రాబాద్‌లోని నవజీవన మండలిలో నిర్వహించాడు. ఈ సభలోనే కృష్ణస్వామి 'అఖిల భారత ముదిరాజ్ మహాసభ'కు అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు. దీని తర్వాతనే ముదిరాజ్ సంఘం 'ముదిరాజ్ మహాసభ'గా మార్చబడినట్లు తెలుస్తుంది. 1961లో తన అధ్యక్షతన జరిగిన 'ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ' సమ్మేళనంలో కృష్ణస్వామి అధ్యక్షపదవి నుండి తప్పుకుని తరువాతి తరానికి అవకాశమిచ్చాడు. ఇది నేటి నాయకులకు ఆదర్శనీయం.

**సాహిత్య సేవ**

కృష్ణస్వామి ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు. ఆయన రాసిన చరిత్ర గ్రంథాల్లో ఒక్కొక్కటి ఒక్కో పిహెచ్.డి.పట్టా పొందే అర్హత కలిగి ఉన్నాయి.

**రచనలు:**

1. హైద్రాబాద్ నగర నిర్మాణ చరిత్ర (ఇంగ్లీష్‌లో)
2. గోవారాష్ట్ర స్వాతంత్ర్య ఉద్యమం (ఇంగ్లీష్‌లో)
3. ముదిరాజుల జాతి చరిత్ర (ఉర్దూలో)
4. హైద్రాబాద్ రాష్ట్ర 30 సంవత్సరాల రాజకీయ పోరాటం (1918-1948) (ఉర్దూలో)
5. హైద్రాబాద్ మున్సిపల్ పరిపాలన వ్యవస్థ చరిత్ర (1280 ఫసలి / క్రీ.శ. 1871 నుండి)
6. నవాబ్ దీన్ దయాల్ జంగ్ బహదూర్ జీవిత చరిత్ర (ఇంగ్లీస్‌లో)
7. పిక్టోరియల్ హైద్రాబాద్ (హైద్రాబాద్ రాజవంశీయులు, నవాబులు, జాగిర్దారుల చరిత్ర) -1, 2. (ఇంగ్లీష్‌లో)

'పిక్టోరియల్ హైద్రాబాద్' గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. హైద్రా బాద్ చరిత్రను ఫోటోగ్రాఫులతో సహా ప్రపంచానికి ప్రచారం చేసినవి ఈ రెండు గ్రంథాలు. ఇప్పుడు చెప్పుకుంటున్న బ్రాండ్ హైద్రాబాద్‌ను కృష్ణస్వామి ఆనాడే (1929) సాధించారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఫొటోలు సమకూర్చడం కోసం ప్రత్యేకంగా ఒక ఫోటోగ్రాఫర్‌నే పెట్టుకున్నాడంటే చరిత్రకు అవసరమైన సాక్ష్యాలను దృశ్య రూపంలో చూపడంలో ఆ పరిశోధ కుడికి ఉన్న ఆసక్తి ఏపాటిదో ఊహించవచ్చు. చరిత్రను ఛాయాచిత్రాలతో చెప్పడం వల్ల సామాన్య పాఠకులకు చాలా సులువుగా అర్థమవుతుంది. అందుకోసం తీసిన అద్భుతమైన ఫొటోలే ప్రస్తుతం పాత హైద్రాబాద్ స్వరూపాన్ని పట్టి చూపిస్తున్నాయి. ఇది నిజంగా హైద్రాబాద్‌ను భవిష్యత్తరాలకు అందించాలనే తపనతో చేసిన పని. దీని ముద్రణకు అవసరమైన మేలిమిరకం పేపర్‌ను ప్రత్యేకంగా లండన్ నుండి తెప్పించుకున్నాడంట. ఈ గ్రంథాన్ని, గ్రంథకర్తను గురించి జాతీయ పత్రికలే కాకుండా అంతర్జాతీయ పత్రికలు కూడా కొనియాడినవి. ఈ గ్రంథాలకైన ఖర్చుతో ఒక ఆధునిక ముద్రణాలయాన్నే స్థాపించవచ్చని వారే ఒక చోట రాసుకున్నారు. ఈ ఒక్క గ్రంథానికే డాక్టరేట్‌తో పాటు ఏ అవార్డైనా ఇవ్వవచ్చు. ఆయన పట్టాలు లేని పరిశోధకుడు.

కృష్ణస్వామి సేవలకు గౌరవ సూచకంగా 1996లో, అప్పటి ప్రభుత్వం, బేగం బజార్ కూడలి నుండి జుమేరాత్ బజార్ కూడలి వరకు గల రోడ్డును 'శ్రీకృష్ణస్వామి ముదిరాజ్ మార్గం' అని నామకరణం చేసింది (G.O.MS.NO.996)

**ఆదర్శజీవనం**

కృష్ణస్వామి గాంధీజీని తన రాజకీయ గురువుగా ఎంచుకున్నాడు. గాంధీజీ ఆదర్శాలను తన ఆదర్శాలుగా భావించాడు. జీవితాంతం ఖద్దరు దుస్తుల్ని వదలలేదు. ఎంతోమంది ఆడపిల్లలకు పెళ్ళిళ్ల చేయించాడు. పేద విద్యార్థులకు ఫీజులు కట్టి చదివించాడు. కృష్ణస్వామికి అతని రక్త సంబంధికులుగాని రాజకీయ సంబంధికులుగాని నిజమైన వారసులుగా ఎవరూ ఎదగలేక పోయారు. ఆ స్తబ్దత నేటికీ కొనసాగుతుంది. వెనకబడిన కులాల్లో పెరిగిన రాజకీయ చైతన్యం ఇంకా ఇట్లా ఒడిదుడుకుల బాటల్లో ఎందుకిట్లా కూనరిల్లుతుందో తాత్వికంగా ఆలోచించవలసిన అంశం. నేటి బి.సి. నాయకులు కృష్ణస్వామి జీవితాన్ని ఒక రకంగా పాఠంగా.. మరో రకంగా గుణపాఠంగా భావించి అధ్యయనం చేయాలి.

-డా. తెలుగు యాదేశ్ పుట్ట
మొబైల్: 9490143067

## తెలంగాణ & చైనాల మధ్య

# నాటక కళతో సాంస్కృతిక వంతెన

చిన్నతనంలో నేను అథ్లెటిక్స్‌లో పాల్గొనే వాడిని. అప్పటి నుంచి కూడా చైనా అంటే నాకు ఇష్టం. అదే సమయంలో మార్షల్ ఆర్ట్స్‌ను ఎంతగానో అభిమానించే వాడిని. బ్రూస్‌లీ, జాకీ చాన్, జెట్‌లీ వంటి వారి సినిమాలు చూసే వాడిని. తెలంగాణ ఉద్యమం కొనసాగు తున్న సమయంలో, చైనా సాంస్కృతిక విప్లవం గురించి చదివాను. ప్రజల ఆకాంక్షల వ్యక్తీకరణపై కొన్ని అంశా లను గ్రహించాను. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ డిగ్రీ (ఎంపీఏ థియేటర్ ఆర్ట్స్) చేసేటప్పుడు చైనీస్ ఒపెరా శిక్షణ విధానాలు, ఇతర పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ గురించి అధ్యయనం చేశాను. అదృష్టవశాత్తు, 2008లో దక్షిణ కొరియా లోని సియోల్‌లో జరిగిన ఇంటర్ ఆసియా సమ్మర్ క్యాంప్ సందర్భం గా ఒక చైనా మిత్రుడిని కలుసు కున్నాను. ఈ కలయిక నా జీవితం లో పెను మార్పులకు దారి తీయ గలదని అప్పట్లో నేను ఊహించ లేదు. చైనీస్ మిత్రుల సలహాతో, నా పీహెచ్‌డీ సూపర్‌వైజర్‌తో పలు మార్లు చర్చించిన అనంతరం, 2009లో నేషనల్ అకాడమీ ఆఫ్ చైనీస్ థియేటర్ ఆర్ట్స్‌లో స్వల్పకాలిక బీజింగ్ ఒపెరా పర్‌ఫార్మర్ ట్రైనింగ్‌కు దరఖాస్తు చేసుకున్నాను. ఈ సంస్థకు పెద్ద చరిత్రనే ఉంది. ఇది 1958లో ప్రారంభమైంది. శాస్త్రీయంగా అభివృద్ధి చేసిన విధానాల్లో అనుభవజ్ఞులైన శిక్షకులతో సంప్రదాయక ఒపెరాలో, ఇతర అడ్వాన్స్ కోర్సుల్లో అత్యుత్తమ శిక్షణ ఇవ్వడంలో ఇది చైనాలో పేరుగాంచింది. ఈ అకాడమీ నుంచి నాలుగేళ్ళ గ్రాడ్యుయేషన్ (బీఎఫ్ఏ), మూడేళ్ళ మాస్టర్స్ (ఎంఎఫ్ఏ) పూర్తి చేసిన తరువాత విద్యార్థులు చైనీస్ ఒపెరా పర్‌ఫార్మింగ్, టెలివిజన్, కల్చర్ అండ్ ఫిల్మ్ ఇండస్ట్రీస్, సంబంధిత రంగాల్లో వృత్తినిపుణులుగా మారుతారు. ప్రస్తుతం ఇక్కడ పర్ ఫార్మింగ్ ఆర్ట్స్, డైరెక్టింగ్, డ్రమటిక్ రైటింగ్, మ్యూజిక్, స్టేజ్ డిజైన్, న్యూ మీడియా ఆర్ట్స్ వంటి వివిధ విభా గాల్లో సుమారు 3,000 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. 250 మంది అనుభవ జ్ఞులైన శిక్షకులు ఉన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన వాడిని కావడంతో కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యా యి. అదృష్టవశాత్తూ ప్రొఫెసర్ జయశంకర్ గారు నన్ను కేసీఆర్ గారికి పరిచయం చేశారు. ఆయన అండతో నేను దక్షిణ కొరియా, ఫ్రాన్స్, చైనాలకు వెళ్ళగలిగాను. తెలంగాణ ఉద్యమ సమయంలో నేను 30కిపైగా స్టేజ్ షోలు, వీధినాటకాలు రూపొందిం చాను.




**నేను గమనించిన తేడాలు**

బీజింగ్ ఒపెరా పర్‌ఫార్మర్ ట్రైనింగ్‌కు గాను చైనా ప్రభుత్వ స్పాన్సర్‌షిప్‌తో చదివేందుకు చైనాలోని థియేటర్ ఆర్ట్స్‌కు చెందిన ప్రతిష్టాత్మక అకాడమీ నుంచి ఆఫర్ వచ్చింది. తొలిసారిగా చైనాకు వెళ్ళడం, అక్కడ థియేటర్ కల్చర్‌ను పరిశీలించే అవకాశం లభిం చడం ఎంతో ఉద్వేగాన్ని కలిగించింది. ప్రపంచం మొత్తం మీద అందుబాటులో ఉన్న మత గ్రంథాలను బట్టి భారతీయ, చైనా, గ్రీకు నాగరికతలు ఎంతో పురాతనమైనవని, విజ్ఞానం, సంస్కృతి పరంగా అన్ని అంశాల్లోనూ ఉన్నతమై నవని చెప్పవచ్చు. చైనాకు బయటి వ్యక్తిగా బీజింగ్ ఒపెరా ప్రదర్శనలను చూస్తుంటే రెండు అంశాలు నాకు ఆశ్చర్యం కలిగించేవి. వాటిలో ఒకటి ప్రదర్శకుల కళానైపుణ్యాలు, మరొకటి ఆయా ప్రదర్శనలతో భారతీయ కళా రూపాలకు ఉన్న పోలికలు. అకా డమీలో చేరిన కొద్ది రోజుల తరు వాత, అందులో చేరిన తొలి భారతీ యుడిననే విషయం నాకు తెలిసి ఆశ్చర్యం కలిగింది. అది నన్ను మరింత బాధ్యతతో మెలిగేలా చేసింది. చైనీయుల బాడీ లాంగ్వేజ్ కాస్తంత భిన్నంగా ఉండడం, వారి నిత్యజీవితంలో, కళల్లో బౌద్ధ మత ప్రభావాన్ని నేను గమనిం చాను. అక్కడి విద్యావిధానం కొంత ఆసక్తి కల్పించేదిగా ఉంది. ప్రాథమిక విద్య పూర్తయిన తరువాత ఏ తరహా మాధ్యమిక పాఠ శాలల్లో చేరాలనే విషయానికి సంబంధించి వి ద్యార్థులు తప్పనిసరిగా ఒక పరీక్ష కు హాజరు కావాలి. సాధారణంగా ఈ పరీక్ష పదేళ్ళ వయస్సులో ఉంటుంది. వారి జీవిత గమ్యం అప్పుడే నిర్దేశింబడు తుంది. ఆ పరీక్షలో ఎంతో పోటీ ఉంటుంది. అంత చిన్న వయ స్సులోనే ఆ పిల్లలు తమ జీవిత లక్ష్యాల, సాధించబోయే విజయాల పట్ల ఎంతో అవగాహన కలిగిఉంటారు. చైనాలో ఆసక్తి కల్పించే మరో అంశం మార్షల్ ఆర్ట్స్. కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్‌కు స్ఫూర్తిని చ్చింది కేరళకు చెందిన కలారి పయట్టు కావడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఫిజికల్ ఫిట్‌నెస్‌కు తగిన శిక్షణ పొందడం వారి సంస్కృతిలో భాగంగా ఉంటుంది. ఆ విషయంలో మరే దేశం కూడా చైనాకు సాటిరాదనే చెప్పవచ్చు.





అక్కడి విద్యార్థులు తమ సంప్రదాయక ఒపెరాను అభ్యసించేందుకు అపార అవకాశాలు ఉంటాయి. చిన్న వయస్సులోనైనా, యుక్త వయస్సులోనైనా సరే, తాము ఎంచుకున్న అకాడమీ లేదా శిక్షణ పాఠశాలలో చేరేందుకు వారికెన్నో అవకాశాలు ఉంటాయి. ఒక ప్రణాళిక ప్రకారం జరిగే బోధన, క్రమశిక్షణాయుత అభ్యాసం కారణంగా టీనేజ్‌లోనే వారు చక్కటి ప్రతిభ కలిగిన కళాకారులవుతారు. ఈ ఘనత అంతా కూడా మీ లాన్‌ఫాంగ్ (లెజండరీ నటుడు) ప్రభావంతో రూపుదిద్దుకుని దశాబ్దాల కాలంలో శాస్త్రీయంగా వికసిస్తూ వచ్చిన శిక్షణ వ్యవస్థదే అని చెప్పవచ్చు. చైనీస్ ఒపేరాలో అద్భుత ప్రదర్శనా నైపుణ్యాలతో ఆయన ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సాధించారు. చైనీస్ మార్షల్ ఆర్ట్స్‌ను ప్రాక్టీస్ చేసేటప్పుడు వివిధ శరీర భాగాలకు కఠోర వర్కవుట్స్ ఉండేవి. బాధ, ఆనందంతో శరీరంపై, శ్వాసపై నియంత్రణ సాధించేందుకు చేసే ప్రయత్నాలు నాకు భారతీయ మార్షల్ ఆర్ట్స్‌ను, నా యోగా గురువును గుర్తు చేసేవి.

చైనాలో అనుసరిస్తున్న విద్యావిధానం గురించి మనం మరింతగా అధ్యయనం చేసి అవసరమైన మార్పుచేర్పులతో ఇక్కడ ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది.

**డా॥ జి.కుమార స్వామి**, ఎంపీఏ, పిహెచ్.డి
తెలంగాణ సాంస్కృతిక సారథి (టీఎస్ఎస్)
ఫోన్ నెం: 99480 35372
మెయిల్: kumhcu6@gmail.com,
kumarasiantheatre14@gmail.com

ద

# తెలంగాణ బతుకు చిత్రం 'ఎండపొడ'





సామాన్యశాస్త్రం Gallery
#8-1-284/OU/227, Near Alankar hotel, OU Colony, Manikonda Road, Shaikpet, Hyderbad, Telangana -500 008. Mobile + 91 99480 77893

**మ**ణికొండలోని ఓయూ కాలనీలో 'ఎండపొడ' పేరుతో సీనియర్ పాత్రికేయుడు, ఫొటోగ్రాఫర్ కందుకూరి రమేశ్ బాబు ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, నమస్తే తెలంగాణ సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. రమేశ్‌బాబు ఛాయాచిత్రాల్లో తెలంగాణ బతుకు చిత్రం కనిపిస్తుందన్నారు. రమేశ్‌బాబు తన చిత్రాల్లో తెలంగాణ జీవితాన్ని ఆవిష్కరించారని అన్నారు. కట్టా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ జీవితంలోని వివిధ పార్శ్వాలను రమేష్‌బాబు తన కెమెరాలో బంధించారన్నారు. సామాన్యుడి జీవితాన్ని లక్ష్యంగా చేసుకొని ఆయన చేస్తున్న కృషి విజయవంతంగా కొనసాగుతున్నదని అన్నారు. ఈ కృషి ముమ్ముందు కూడా కొనసాగాలని శేఖర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఫిబ్రవరి 14 వరకు కొనసాగే ఈ ప్రదర్శన సాధారణ రోజుల్లో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు శని, ఆదివారాల్లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని రమేశ్‌బాబు తెలిపారు. ద

# సంగీతమే మహాధనం

లక్ష్మీబాయి జాదవ్ ఉస్తాద్ అల్లాదియాఖాన్ శిష్యురాలే. ఆమె గాత్రంలో మాధుర్యగుణం అధికం. ఆమె పాడుతూవుంటే రసిక శ్రోతలకు పండువెన్నెలలో కూర్చుండి తీయని సంగీతరసాన్ని ఆస్వాదించే అనుభూతి కలిగేదట. అప్పటి జగద్గురు శంకరాచార్యుల వారు ఆమె సంగీతానికి ముగ్ధులై ఆమెకు 'గానచంద్రిక' అనే బిరుదు ప్రదానం చేసినాడట.

దత్తాత్రేయుని భక్తులైన పరాడ్కర్ల ఇంట హారతి సమయంలో రోజూ తన సంగీతం వినిపించేదట హీరాబాయి బరోడేకర్. అప్పుడామె ఉస్తాద్ వహీద్‌ఖాన్ దగ్గర సంగీతం నేరుస్తూ వున్నది. ఒకనాడు పరాడ్కర్ల ఇంట లక్ష్మీబాయి జాదవ్ తన సంగీతం వినిపిం చిందట. ఆమెను మొదటిసారి విన్న హీరాబాయి "పాడితే అలా పాడాలి" అని తన గురువుగారితో తనను గూడా అటువంటి గాయికగా చేయవల సిందని విన్నవించుకున్నదట. ఉస్తాద్ అల్లాదియా ఖాన్ కొడుకులు, బడ్జీ, మంజీలు, ఉస్తాద్ వహీద్ ఖాన్‌కు సమవయస్కులైన మిత్రులు. విదుషి లక్ష్మీబాయి జాదవ్ సోదరిబాయి సుందరాబాయి బొంబాయి ఆలిండియా రేడియోస్టేషన్‌లో పని చేసింది. గురు శిక్షణ లేకున్నా ఆమె ఎవరి గాత్రా న్నయినా అనుకరించగలిగేదట. అప్పటివన్నీ లైవ్ ప్రోగ్రాములే. ఏ ఆర్టిస్టు రాకపోయినా, ఆ ఆర్టిస్టు పాడవలసిన పాటలను సుందరాబాయి పాడి ప్రోగ్రాం నిర్వహించేదట.



ఇక్కడ ఇంకొక మాట చెప్పాలె. ఉస్తాద్ అల్లాదియాఖాన్, ఉస్తాద్ మంజీఖాన్ దగ్గర సంగీతం నేర్చిన గాయికలైనా, గాయకులైనా కొన్నిరాగాలు ఉస్తాద్ భుర్జీఖాన్ దగ్గర నేర్చినారు. కొందరు ఉస్తాద్ భుర్జీఖాన్ కొడుకు బాబా దగ్గర కూడా నేర్చినారు. కానయితే బాబా శాస్త్రజ్ఞానం సాకల్యంగా ఉన్న వాడైనా వేదికనెక్కి పాడినవాడు కాదు. మొదట్లో అతడు వేదికమీద పాడే ప్రయత్నం చేస్తే అతని శరీరంలోని నెత్తురు కళ్లలోకి దిగేదట. అతడెప్పుడూ గళమెత్తి పాడ గూడదని డాక్టర్లు హెచ్చరించినారట. అతని దగ్గర నేర్చుకునే ప్రయత్నం చేసిన వాళ్లకు తన పద్ధతిలో నేర్పేవాడు కాని ఆదర్శంగా పాడి నేర్పలేకపోయేవాడు. భుర్జీఖాన్ కూడా మధుమేహ పీడితుడు కనుక తమ ఘరానా శిష్యులకు పాడి వినిపించేవాడు కానీ శ్రోతలతో నిండిన సభలలో అంతగా పాడగలిగేవాడు కాదు. ఉస్తాద్ అల్లాదియా ఖాన్ బొంబాయి నగరానికి వెళ్లిపోయినప్పుడు లక్ష్మీదేవి గుడిలో పాడటానికి ఉస్తాద్ భుర్జీఖాన్, బాబా ఇద్దరే మిగి లినారు. ఉస్తాద్ పెద్దకొడుకు నశీరుద్దీన్‌ఖాన్. అతడు పెద్దవాడు కనుక బడ్జీ అనేవాళు. రెండవ వాడు బద్రుద్దీన్. అతడు నడిపివాడు కనుక మం జీ అనేవాళ్ళు. చిన్నవాడు షంషుద్దీన్. అతనిది గౌరవర్ణం కనుక భుర్జీ అన్నారు. ఉస్తాద్ అల్లా దియా ఖాన్ ముగ్గురు కొడుకులు ఛత్రపతి సా హూమహారాజ్ కొడుకులతోపాటు రాజభవనం లోనే పెరిగినారు. రాజకుమారులు తినే తిండే తిన్నారు. రాజకుమారుల లానిటి దుస్తులే ధరిం చినారు. రాజకుమారుల విద్య నేర్చినారు. ఇం గ్లీష్ బాగా నేర్చుకున్నారు. క్రికెట్ ఆడటం, గు ఱ్ఱపు స్వారీ, పోలో ఆడటం నేర్చుకున్నారు. ఈ విద్యల్లో పడి తమ ఘరానా విద్య సరిగ్గా నేర్చుకోవటం లేదని బడేఖాన్ సాహెబ్ (అల్లాదియా ఖాన్) బాధపడేవాడు. ఖాన్‌సాహెబ్ కుమారుల పట్ల అత్యంత వాత్సల్యంగల ఛత్రపతి సాహూమహారాజ్ ఉస్తాద్ కొడుకులను పిలిచి, "మీరు మీ ఘరానా విద్య నేర్చుకోండి. రాజ కుమారుల వెంట వుండకూడదని శాసించినాడు. ఎంతో స్వాభి మానం గల మంజీఖాన్ చాలా కోపంతో, "మీ ఇంట్లో వుండవలసిన అవసరం మాకులేదు. మీ ధనం మీది. మా ధనం మాది. మాకున్న సంగీతమనే ధనంతో మీ వంటి ఛప్పన్న రాజులను కొనుక్కోగలం" అన్నాడట. ఛత్రపతి

## సంగీతంపై ఒక కొత్త శీర్షిక

చిత్రలేఖనం, ఫొటోగ్రఫీలతో సహా వివిధ కళలు, కళారూపాలపై ప్రత్యేక కథనాలను అందిస్తున్న దక్కన్ ల్యాండ్ ఈ మాసం నుంచి సంగీతంపై కూడా దృష్టి సారించనుంది. అందులో భాగంగా డాక్టర్ సామల సదాశివ రచించిన 'స్వర లయలు' నుంచి కొన్ని వ్యాసాలను మొదటగా ప్రచురిస్తున్నాం. వీలు వెంట ఈ రంగానికి చెందిన ప్రముఖుల పరిచయాలను అందిస్తాం.

డాక్టర్ సామల సదాశివ రచించిన 'స్వర లయలు' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (2011) రావడం విశేషం. చెలిమి ఫౌండేషన్ ఈ పుస్తకాన్ని మొదట 2009 నవంబర్‌లో ప్రచురించింది. అవార్డు వచ్చిన తరువాత, 2012 జనవరిలో ఈ పుస్తకాన్ని పునర్ ముద్రించింది. 'సంగీత, సాహిత్యాలకు సంబంధించి చెలిమి ఫౌండేషన్ ప్రచురించిన మొదటి పుస్తకానికే అత్యున్నత పురస్కారం లభించడం మాకు ఆనందం కలిగిస్తున్నది. ఈ రంగాలకు సంబంధించి మరికొన్ని పుస్తకాలను ప్రచురించడానికి మాకు ఉత్సాహం కల్పించింది"అని ప్రచురణ కర్త యం.వేదకుమార్ అన్నారు.




## చెలిమి 'స్వర లయలు'

హిందుస్తానీ సంగీతం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బెంగాల్‌లలో బాగా అభివృద్ధి చెందింది. ఢిల్లీ, లక్నో, బనారస్, పంజాబ్‌లు కూడా హిందుస్తానీ సంగీతానికి కేంద్రాలు. ఆయా ప్రాంతాల్లో విలసిల్లిన ఘరానాలు, వాటికి చెందిన ఉస్తాదులు, ఆ ఉస్తాదుల వద్ద సంగీతకళను అభ్యసించి దేశవిదేశాల్లో ప్రచారం చేసిన గాయకుల, కళాకారుల సమాచారం ఇందులో ఉంది.

చెలిమి ఫౌండేషన్ 1988 నుంచి తన పరిధి విస్తరించుకుంటూ వచ్చింది. సహజ వనరులు, పర్యావరణం, గ్రామా భివృద్ధి, పట్టణ ప్రణాళిక, మానవ జీవన హక్కులు లాంటి వివిధ అంశాలపై ప్రగతిశీలక దృక్పథంతో వ్యవహరిస్తోంది. బాలసాహిత్యం, విజ్ఞానం లాంటి అంశాలతో కూడిన ప్రచు రణలను చెలిమి ఫౌండేషన్ వెలువరిస్తోంది. చెలిమి కథలు లాంటివి ఇప్పటికే వెలువడ్డాయి. మరిన్ని ప్రచురణలు త్వరలోనే రానున్నాయి.

స్వరలయలు పుస్తకంలో 'నా మాట'గా సామల సదాశివ పలు అంశాలను ప్రస్తావించారు. తన రచనావ్యాసంగం సాగిన తీరును వివరించారు. 'ఈ 'స్వరలయ'లను అదే పేర సాహితీ బంధువు, సహృదయులు శ్రీ యం.వేదకుమార్ గారు తమ సంస్థ 'చెలిమి ఫౌండేషన్' ద్వారా ఈ గ్రంథాన్ని ప్రచురిస్తున్నారు. వారికి కృతజ్ఞతాభినందనలు' అని పేర్కొన్నారు. 'నా పుస్తకాలు చాలా వరకు మిత్రులు ప్రొ॥జయధీర్ తిరుమలరావు పూనుకొని ప్రచురణ పొందేట్లు చేస్తున్నారు. నా రెండు పుస్తకాలను అన్నీ వారే అయి ప్రచురింపజేసినారు' అని తెలిపారు.

ముందు ఎంత గొప్ప వాళ్లయినా అట్లా మాట్లాడే సాహసం చేయరు. తన యుక్తి ఫలించినందుకు ఛత్రపతి మంద హాసం చేసినాడట కానీ అతన్ని మందలించలేదట. బడ్జీఖాన్‌కు బడేఖాన్ సాహెబ్ తన సంగీతమంతా శ్రద్ధగా నేర్పినాడు. దాదాపు తండ్రంతటి గాయకుడైనాడు బడ్జీఖాన్. అయితే స్థానికులైన గాయకు లు కొందరు బడేఖాన్ సాహెబ్ నేమీ చేయలేరు కానీ అతని కొడుకులు కూడా తమకు స్థానం లేకుండా చేయగలరని భయపడి దాన్ని నివారించే ప్రయత్నాలు మొదలుపెట్టినారు. రాజగృహాల్లో కుహకాలు, కుతంత్రాలు సహజవే. రాజకుమారులతో క్రికెట్ ఆడుతున్నప్పుడొకనాడు క్రికెట్ బంతి బడ్జీఖాన్ ఛాతీకి గట్టిగా తగిలింది. నోటిలోంచి కొన్ని నెత్తురుచుక్కలు కూడా పడ్డాయి. స్థానిక గాయకులకు అవకాశం దొరికింది. రాజవైద్యునికి పెద్ద మొత్తంలో లంచమిచ్చినారు. రాజవైద్యుడైన ఆ డాక్టరు బడ్జీ శారీరకంగా దుర్బలుడని, అతని గుండె కూడా దుర్బలమయింది కాబట్టి అతడు స్వరప్రస్తారం చేస్తే గుండె అవిసిపోవచ్చునని బడేఖాన్ సాహెబ్‌ను, బంధువులను భయపెట్టినాడు. గాయనానికి పనికిరాడని తెలుసుకున్న అతని బంధువులు బడ్జీఖాన్‌ను రాజస్థాన్‌లోని ఉన్యారా గ్రామంలో తమ ఆస్తిపాస్తులను, వ్యవసాయాన్ని చూసుకునే బాధ్యత అప్పజెప్పి కొల్హాపూర్ నుంచి పంపించినారు. అల్లాదియాఖాన్ జీవిత చరిత్రలు రాసిన వాళ్లందరు చెప్పటమేకాక, దోంధూతాయికూడా నమితాదేవి దయాల్‌తో, "అదంతా మోసం. బడ్జీగుండె బలిష్ఠమయింది. తొంబై ఏళ్ల వయస్సు వచ్చే వరకు ఆరోగ్యంగా వున్నాడు. హాయిగా పాడినాడు" అని చెప్పింది. ఉస్తాద్ అల్లా దియాఖాన్ మరణించిన తరువాత అతని చాలీస్వానాడు (అనగా 40 దినాల నాడు) వామన్‌రావు దేశ్‌పాండే ఇంట్లో జరిగిన స్వరాంజలి సమావేశంలో బడ్జీఖాన్ తండ్రిపాడినంత నేర్పుతో ఖంబావతి రాగాన్ని, కామోద్ రాగాన్ని వినిపించినాడట. అంతటి గాయకుడు కొల్హాపూర్‌లో నిలువలేక పోయినాడు. అతడు మధ్య కొల్హాపూర్‌కు వస్తూపోతూ వుండేవాడు కాని చాలీస్వానాడు తప్ప మరెన్నడూ తన సంగీత కళను కొల్హాపూర్‌లో ప్రదర్శించలేదు.

మంజీఖాన్‌కు తండ్రి సంగీతం సమస్తం దొరిగింది. గాయకుల్లో అతడొక్కడే సూటుబూటు తొడుక్కొని చక్కగా ఇంగ్లీష్ మాట్లాడుతూ తన సొంతకారులో తిరిగేవాడు. గజానన్‌రావు జోషి, మల్లికార్జున్ మన్సూర్ లాంటి అన్యఘరానాలకు చెందినవాళ్లు ఉస్తాద్ మంజీఖాన్ దగ్గర జైపూర్ ఘరానా సంగీతం నేర్చుకునేవాళ్లు. తండ్రి జీవించి వుండగానే ఉస్తాద్ మంజీఖాన్ యాభైఏండ్లు కూడా నిండని వయసులో మరణించినాడు. ధీరోదాత్తుడైన బడేఖాన్ సాహెబ్ అర్భకునివలె విలపిస్తూ "మంజీ! నేడు నువ్వొక్కనివే పోలేదు. వంద సంవత్సరాల నా ఘరానా సంగీతం నీవెంటే పోయింది" అన్నాడట. మంజీఖాన్ శిష్యులు, బడేఖాన్ సాహెబ్ శిష్యులు ఉస్తాద్ భుర్జీఖాన్ దగ్గర తమ సాధనను సంపూర్ణం చేసుకున్నారు. లక్ష్మీబాయి జాధవ్ కూడా చివరికి భుర్జీఖాన్ శిష్యురాలే అయింది. భుర్జీఖాన్ పోయిన తరువాత కూడా పండిత్ మల్లికార్దున్ మన్సూర్ సకుటుంబంగా కొల్హాపూర్‌లో నివసించి తాను నేర్వని అనేక రాగాలను బాబా దగ్గర నేర్చుకున్నాడు. (స్వర లయలు పుస్తకం నుంచి) ద

# తెలంగాణ సినిమాకు తొలి చరిత్రకారుడు

**భా**రతదేశంలో సినిమా జర్నలిజానికి తొలినాళ్లలో ద్వితీయ శ్రేణి గౌరవముండేది. పాశ్చాత్య దేశాల్లో సినిమాను సీరియస్‌గా తీసుకోకమునుపే సినిమా జర్నలిజాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఇంకా చెప్పాలంటే అక్కడ సినిమాతో సమాంతరంగా సినీ జర్నలిజం ఎదిగింది. అదే భారతదేశంలో బెంగాల్‌లో జరిగిన సినిమా పరిణామాలు ఇక్కడి సినీ జర్నలిజాన్ని మలుపు తిప్పినవి. రిత్విక్ ఘటక్, సత్యజిత్‌రే వంటి వారి నవ్య సినిమాలు ఇందుకు కారణమైనవి. అంటే భారతదేశంలో సినిమాను సీరియస్‌గా తీసుకున్నప్పుడు గాని జర్నలిజం గురించి ఆలోచించడం ప్రారంభించాము. అప్పటికి కూడా సినిమా జర్నలిజం వృత్తిగా గుర్తింపబడలేదు. జీవికను నడిపేస్థాయి సినిమా జర్నలిజానికి లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. అందుకే చాలా మంది హాబీగానే సినిమా విమర్శకులుగా, చరిత్రకారులుగా కొనసాగారు.



ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ప్రాంతం నుండి సినిమా విమర్శకులు, చరిత్రకారుల గురించి ఆలోచించడం అత్యాశే అవుతుంది. తొలి తరంలో ఉన్న వారంతా సీమాంధ్ర దృక్కోణంలోనే తెలుగు సినిమాను చూశారు. కానీ ఒక చారిత్రక సందర్భంలో తెలుగు సినిమాలో మొత్తం భారతీయ సినిమా చరిత్రలో తెలంగాణ ఎక్కడుందోనని వెదకడం దురాశే అవుతుంది. కానీ ఆ ప్రయత్నంలో అనూహ్యంగా విజయం సాధించిన వారు హెచ్. రమేష్‌బాబు. తెలుగు సినిమాలోనూ, భారతీయ సినిమాలోనూ తెలంగాణ సినిమా ఉనికిని వెలికితీసి ఇదీ మన సినిమా అని సాధికారికంగా నిరూపించారు. మూకీల కాలంలోనే మనమే తెలుగు సినిమా కన్నా ముందున్నామని చరిత్రకెక్కించారు. జాతీయ సినిమాతో సమాంతరంగా తెలంగాణ సినిమా చరిత్ర సాగిందని నిరూపించారు.

హెచ్.రమేష్‌బాబు తొలినాటి మహబూబ్‌నగర్ జిల్లా, నేటి వనపర్తి జిల్లా ఏదులలో 1966 జూన్ 20న జన్మించారు. ప్రస్తుత నివాసం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం. తండ్రి తులసీరాం, తల్లి సక్కుబాయి. దిగువ మధ్యతరగతి కుటుంబం. ఎం.ఏ. పట్టభద్రులు. తండ్రి సాహిత్యాభిలాష, కళాభిమానం, ఊరికంతా వాళ్లింటోనే వినిపించే రేడియో. రమేష్‌బాబుచే తొలుత కవిత్వం రాయించాయి. ఇంట్లోని హోం లైబ్రరీలో పుస్తకాలు, రచనా వ్యాసంగానికి ప్రేరణగా నిలిచినవి. 1984లో ఇంటర్మీడియట్‌లోనే కవిత్వం రాయడంతో మొదలైన రచనా వ్యాసంగం. ఆ తరువాత కథారచన, వ్యాసరచన మీదుగా ముందుకు సాగింది. ఇప్పటిదాకా నూరుకుపైగా కవితలు, 25 కథలు రాసిన రమేష్‌బాబు 50కిపైగా పత్రికలలో 4500 పైగా వ్యాసాలు రాశారు. వీటిలో సాహిత్య, నాట్య, సంగీత, జానపద కళారంగాలు, సినిమారంగాలకు సంబంధించినవే గాక రాజకీయ విశ్లేషణలు కూడా ఉన్నవి. వీటిలో 2000 వరకు సినిమా వ్యాసాలే ఉండటం గమనించదగిన విషయం.

2005లో తొలిసారిగా హెచ్.రమేష్‌బాబు తెలంగాణ సినిమా గురించిన ఆలోచన చేశారు. గడచిన 20 ఏళ్లలో తన సినిమా పరిశోధనలో తెలుగు సినిమా రంగంలో తెలంగాణ వారు ఎవరున్నారు? హైదరాబాదు, ఇతర తెలంగాణ ప్రాంతంలో సినిమా ప్రభావం ఏమున్నదనే ప్రయత్నం తెలంగాణ సినిమా చరిత్ర రచనకు దారి తీసింది. ఆ తరువాత తెలంగాణ సినీ ప్రముఖులు జైరాజ్, అజిత్, చంద్రశేఖర్, జుబేదా, నిగార్ సుల్తానా, లలితాదేవి వంటి బాలీవుడ్ తారలు మనవారేనని చెప్పడమేగాక వారికన్నా ముందుగానే బొంబాయి వెళ్లిన రాం ప్యారీ, సునాళిని, మృణాళిని దేవిలను తొలి సారిగా వెలుగులోకి తెచ్చారు. అంతేకాదు – 1922 లో ధీరేన్ గంగూలీతో హైదరాబాద్ సినిమా రంగ చరిత్ర ప్రారంభమవుతుందన్న చాలా మంది వాదనను తిప్పికొట్టి 1896లోనే హైదరాబాద్‌లో స్టీవెన్‌సన్ అనే పాశ్చాత్యుడు మూకీల ప్రదర్శనలు చేశారని, 1908లో బాబూ పి.ఎస్. అనే ఆయన "ఇంపీరియల్ బయోస్కోప్ కంపెనీ" పేరున తెలంగాణలో మూకీ సినిమాలు ప్రదర్శించారని తొలిసారిగా వెలుగులోకి తెచ్చారు. అట్లా 120 ఏండ్ల కిందనే హైదరాబాద్ రాజ్యంలో సినిమారంగం ఉందనేది రుజువు పరిచాడు. ఇంకా తెరమరుగైపోయిన నూటికి పైగా సినీ ప్రముఖులను తెలంగాణ వారిగా వెలుగులోకి తీసుకురావడంలో హెచ్.రమేష్‌బాబు తెలంగాణ సినీచరిత్ర శోధనలో పడిన శ్రమ నిరూపితమవుతుంది.

ఒకవైపు సినిమా విమర్శకులుగానే గాక రచయితగా వెంకయ్య అవార్డు వెలుగులు (2004), ఫాల్కే అవార్డు విజేతలు (2003), నంది అవార్డు విజేతలు (2006), దాదాఫాల్కే జీవిత చరిత్ర (2004), కాంచనమాల (2005), కన్నాంబ, మహానటి సావిత్రి (5 ముద్రణలు), కె.వి.రెడ్డి (2012), ఆదుర్తి సుబ్బారావు (2013), (కాఫీ టేబుల్ బుక్స్) వంటి సినిమా పుస్తకాలే గాకుండా, తను పుట్టి పెరిగిన పాలమూరు జిల్లా చరిత్రను, వివిధ రంగాల ప్రముఖుల జీవితాలను గ్రంథస్తం చేసే ప్రయత్నంలో కళాభారతి (2002), ప్రజల మనిషి (2004), నందిని (2005), వైతాళికుడు

– పాలెం సుబ్బయ్య (2006), నెమలీక (2006), వాహిని, మహనీయుడు, నా జీవనయానం, రావూజీ రంగస్థల వైభవం (2007), తొలినాటి సినిమా పాటల పుస్తకములు (1933 – 1940), రెండు సంపుటాలు 1200 పేజీలు (2012), పాలెంఏ50 (2013) వంటి 30 పుస్తకాలు ప్రచురించారు. ఇలా కవిత్వం, కథ, సినిమా చరిత్రల రచనతో హెచ్.రమేష్‌బాబుది బహుముఖీన ప్రతిభ, మరోవైపు హెచ్.రమేష్‌బాబు ఇల్లు భారతీయ సినిమా చరిత్రకు సంబంధించిన అరుదైన గ్రంథాలు, పత్రికలకు నిలయం. ఫిల్మిండియా, సినిమా రంగం, కినిమా, విజయ చిత్ర, చిత్రసీమ, సినిమా, ఫిల్మాలయా స్క్రీన్, ఫిలింఫేర్ వంటి పత్రికలన్నీ వీరి వద్ద లభ్యమవుతాయి. అంతేకాదు వివిధ రంగాలకు సంబంధించిన తొలినాటి పత్రికలు, గ్రంథాలను 3 లక్షల పేజీలు కంప్యూటరైజ్ చేసి భద్రపరిచారు. ఇంతేగాక 1935 నుండి 1995 వరకు విడుదలైన సినిమాలలో 2000 దాకా సినిమాలను హార్డ్ డిస్కులలో సేకరించి భద్రపరిచారు.

స్వీయ ప్రచారానికి, ఆర్భాటాలకు దూరంగా ఉండే హెచ్. రమేష్‌బాబు సాహిత్యాభిరుచిని, ఆలోచనలను తెలుసుకోవాలంటే ఆయన పుస్తకాలు చూస్తే తెలిసిపోతుంది. ఎందరో తెరమరుగైపోయిన పాలమూరు జిల్లా ప్రముఖులపై వరుసగా 2008, 2009 సంవత్సరాలలో వెలువరించిన “పాలమూరు వెలుగులు” క్యాలెండర్‌లు అతనికి తన జాతిపట్ల ఉన్న భక్తిని నిరూపిస్తాయి.

వీరి పరిశ్రమకు గుర్తింపుగా నెహ్రూ యువ సాహితీవేత్త పురస్కారం (1997), జయప్రకాష్ నారాయణ్ మెమోరియల్ పురస్కారం (2002), విశాఖలో అమ్మ సంస్థాన్ ట్రస్టు పురస్కారం (2007), తెలుగు యూనివర్సిటీ, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖల గౌరవ సన్మానం (2002) పొందారు. డజనుకు పైగా సెమినార్లలో పరిశోధనా పత్రాలు సమర్పించారు.

ఆలోచనలో, కార్యాచరణలో, జీవనశైలిలో కూడా భిన్నంగా ఉండాలనే హెచ్.రమేష్‌బాబు ఇరవై ఏళ్లు తెలుగు సినిమా గురించి రాస్తే రాని కీర్తి ప్రతిష్ఠలు, పదేళ్లలో తెలంగాణ సినిమాను పరిశోధిస్తే వచ్చిందంటారు. తెలంగాణ ఉద్యమంలో స్వయంగా పాల్గొన్న వీరు నేటి నాగర్‌కర్నూల్ జిల్లాలో మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. జేఏసీ నాయకుడు కూడా. “తెలంగాణ నా హృదయ స్పందన” అంటారు. అందుకే తెలంగాణ సినిమాకు తొలి చరిత్రకారుడయ్యారు.

(తెలంగాణ పునర్నిర్మాణం, సాంస్కృతిక వైభవం కోసం కృషి చేస్తున్న వారికి గుర్తింపుగా తెలంగాణ ఎన్ఆర్ఐ అసోసియేషన్ ప్రదానం చేసే ‘తెనా అవార్డు’లను జనవరి 12న రవీంద్ర భారతిలో ప్రదానం చేశారు. ఈ అవార్డు అందుకున్న వారిలో హెచ్.రమేశ్ బాబు కూడా ఉన్నారు)

– వంశీ

## ఏడుగురికి తెనా అవార్డులు



తెలంగాణ పునర్నిర్మాణం, సాంస్కృతిక వైభవం కోసం కృషి చేస్తున్న వారికి గుర్తింపుగా తెలంగాణ ఎన్ఆర్ఐ అసోసియేషన్ ప్రదానం చేసే ‘తెనా అవార్డు’లను జనవరి 12న రవీంద్ర భారతిలో ప్రదానం చేశారు. కళలు, సామాజిక సేవ, పరిశోధన రంగాల్లో కృషి చేస్తున్న వారినని గుర్తించి ప్రోత్సహించేందుకు తెనా కృషి చేస్తున్నది వెంకట్ మారోజు అన్నారు. ఆ కృషిలో భాగంగానే ఈ అవార్డులు అందజేస్తున్నామన్నారు. ఎనిమిది కేటగిరిల్లో తెనా అవార్డులు అందుకున్న వారు చిందు ఎల్లమ్మ (కళా సంస్కృతి) పురస్కారం కవి, గాయకుడు జయరాజు, ప్రొఫెసర్ జయశంకర్ (పరిశోధన – ఆవిష్కరణ) పురస్కారం హెచ్ రమేష్‌బాబు, కుమ్రం భీం (సామాజిక మార్పు) పురస్కారం కనక సుగుణ, సోయబుల్లాఖాన్ (పత్రికరంగం) పురస్కారం పాశం యాదగిరి, పైడి జయార్ (లఘుచిత్రం, డాక్యుమెంటరీ) పురస్కారం శ్రవణ్ కటికనేని, సురవరం ప్రతాపరెడ్డి (ప్రచురణ గ్రాంట్) పురస్కారం తాయమ్మ కరుణ, జీవన సాఫల్య పురస్కారం రవ్వా శ్రీహరి, డిప్లొమా ఆఫ్ మెరిట్ (జ్యూరీ స్పెషల్) అవార్డు వి6 టీవీ ఛానల్‌లో ప్రసారమయ్యే తీన్మార్ కార్యక్రమ బృందం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెనా అధ్యక్షులు వెంకట్ మారోజు, చైర్మన్ నారాయణ స్వామి, తెనా అవార్డుల జ్యూరీ సభ్యులు విమల కటికనేని, బీ నర్సింగరావు, అమ్మంగి వేణుగోపాల్, వేణు సంకోజు తదితరులు పాల్గొన్నారు.

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA & FAU Hyderabad)
6-3-248/1/1A, 2nd Floor, Bhaskar Plaza, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Telangana, India
Ph : 040-66105270, 9703372442, 9703277053, E-mail : jbrarchitecture@gmail.com, www.jbrachitecture.com

## నిగార్ సుల్తానా

# బాలీవుడ్‌లో భాగ్యనగర్ సౌందర్యరాశి

**హిం**దీ చిత్రసీమలో ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన నటీమణుల సంఖ్య టాకీల కాలం నుండి ఎక్కువే. జుబేదా బేగం సురయ్యా, ముంతాజ్, నూర్జహాన్, మెహతాబ్, ఖుర్షీద్‌బాను, నసీమ్‌బాను వంటి తొలితరం ముస్లిం తారలు హిందీ సినీరంగాన్ని ఏలారు. ఇండస్ట్రీలోకి 1950 నాటికి రెండో తరం ప్రవేశం మొదలైంది. నర్గీస్, మీనాకుమారి వంటి వారు హీరోయిన్లుగా వెలిగిపోవడం మొదలైంది. వీరి కోవలో నాయికగా తెరపైకి వచ్చిన హైదరాబాదీ తార నిగార్ సుల్తానా.

టాకీల శకం మొదలైన తరువాత బొంబాయి వెళ్లిన రెండో నటి మన నిగార్ సుల్తానా. హైదరాబాదు నగరంలో 1932 జూన్ 21న సంప్రదాయ ముస్లిం కుటుంబంలో పుట్టింది. గన్‌ఫౌండ్రీలో ఆమె కుటుంబం నివాసముండేది. ఇంట్లోనే ఉర్దూ, ఇంగ్లీషు చదవడం, రాయడం మాట్లాడటం దాకా ప్రైవేట్‌గా నేర్చుకున్నది. ఆ విధంగానే సంగీత, నృత్యాలలో శిక్షణ పొందింది. ఇవన్నీ కలిగిన నిగార్‌కు సినిమాల పట్ల ఆసక్తి కలగడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ సంప్రదాయాలను నిష్ఠగా పాటించే ఆమె కుటుంబ పెద్దలు ఎట్టి పరిస్థితుల్లో వొప్పుకునేది లేదన్నారు.



కాగా బొంబాయిలో ఉన్న వారి బంధువులు మన నిగార్ ఆశలకు ఊతమిచ్చి ప్రోత్సహించడమే గాక ఆమె తల్లిదండ్రులను ఒప్పించి బొంబాయికి రప్పించుకోవడంతో నిగార్ సినిమా రంగ ప్రవేశానికి ద్వారాలు తెరుచుకున్నవి.

1946లో వచ్చిన 'రంగభూమి'లో నటించడంతో నిగార్ సినిమా జీవితం మొదలైంది. తరువాత 'బేలా' (1947(, 'నావ్', షికాయత్' 'ఖిలోనా' (1948) చిత్రాలతో కథానాయికగా స్థిరపడి పోయింది. అయితే 1948లోనే ఆమె నటజీవితం మహత్తరమైన మలుపు తిరిగింది. అదే ఇండియన్ షోమెన్‌గా ఆ తరువాత విశ్వ ఖ్యాతి గాంచిన రాజ్‌కపూర్ దర్శక నిర్మాతగా, హీరోగా తీసిన తొలిసినిమా ఆగ్‌లో ముగ్గురు కథానాయికల్లో ఒకర్తిగా నటించింది. మిగతా ఇద్దరు నర్గీస్, కామినీ కౌషల్. కాలిపోయిన ముఖంతో కురూపిగా మారిన రాజ్‌కపూర్ వివాహానంతరం మొదటి రాత్రి గదిలోకి వెళ్లగానే పెళ్లికూతురిగా నిగార్ చూపిన నటన విమర్శకుల ప్రశంసలందుకున్నది. తరువాత పతంగా (1949)చిత్రం. ఈ సినిమాలో చాలా పాపులరైన మేరే పియాగయే రంగూన్ పాట మన నిగార్‌పైనే చిత్రీకరించారు.

తరువాత ట్రాజెడికింగ్ దిలీప్‌కుమార్ సరసన 'యాహుది' (1958), ప్రాన్‌తో 'శీష్ మహల్' (1940), మన హైదరాబాదీ హీరో అజిత్‌తో 'పతంగా' (1949), ధామన్ (1951), తనఖ్వా, దుర్దేశ్ నందిని (1956) చిత్రాలలో, మిర్జా గాలిబ్ (1954)లో భరత్‌భూషణ్‌తో, 'సంగీత' (1950)లో శ్యామ్‌తో కలిసి కథానాయికగా నటించిన నిగార్ సుల్తానాకు నటిగా గొప్ప పేరు తెచ్చిన చిత్రం మొఘల్ - ఏ - అజమ్ (1960). ఆ రోజుల్లో నిగార్ సుల్తానా క్రేజీ ఎంతగా ఉండేదంటే 1952లోనే హైదరాబాద్ కీ నాజ్‌నీన్ అనే సినిమా ఆమె హీరోయిన్‌గా తీశారు. మొత్తం ఆమె నటించిన సినిమాల సంఖ్య 51.

కె.ఆసిఫ్ ప్రతిష్ఠాత్మకంగా తీసిన మొఘల్-ఏ-అజమ్‌లో రాజనర్తకి బహార్‌గా నిగార్ సుల్తానా నటన హిమాలయ శృంగాన్ని అందుకున్నది. ఆ పాత్రలో ఈ నాటికి వేరొకరిని వూహించలేము. సలీం అనార్కలిల ప్రేమను విచ్ఛిన్నం చేయడానికి అసూయ కూడిన నటన నిగార్‌కి గొప్పపేరు తెచ్చి పెట్టింది.

'మొఘల్-ఏ-అజం' తరువాత, షాన్-ఏ-హింద్, 1961లో 'సాయా', 'నూర్జహాన్' (167), 'దోకలియా' మేరే హమ్‌దమ్ మేరే దోస్త్ '1968', బస్సీ బిర్జూ (1972) వంటి చిత్రాల్లో కారెక్టర్ పాత్రలు చేశారామె. సినిమాల్లోకి వచ్చిన తొలి రోజుల్లో నటుడు జగదీష్ సేథి, కవి, దర్శకుడు డి.ఎన్. మధోక్‌లు నిగార్‌కి సినిమా అవకాశాలకు సహకరించారు. ఆమె నాటి దర్శకుడు ఎస్.ఎం. యూసుఫ్‌ని పెళ్లాడింది. అయితే దేశ విభజన జరగడంతో యూసుఫ్ పాకిస్తాన్ వెళ్లిపోగా, దర్శకుడు కె.ఆసిఫ్‌ని పునర్వివాహం చేసుకున్నది. నటి హీనా కౌసర్ ఆమె కుమార్తెనే. తన 68 ఏటి నిగార్ 2000 సంవత్సరం ఏప్రిల్ 23న బొంబాయిలో తనువు చాలించింది. హిందీ తెరపై మూడు తరాలకు తన నటనను చూపిన నిగార్ సుల్తానా హైదరాబాద్‌కీ నాజ్‌నీన్‌గా బాలీవుడ్‌లో భాగ్యనగర సౌందర్య శిఖరంగా చరిత్రలో నిలిచిపోయింది.

అన్నట్లు హిందీ తెరపై మన తొలి తారలుగా జుబేదాబేగం టి.లలితాదేవి, నిగార్, జైరాజ్‌ల గురించి, ఇప్పటి వరకు గుర్తు

**నిగార్ సుల్తానా నటించిన చిత్రాలు**

1946 – రంగభూమి, 1857
1947 – బేలా
1948 – ఆగ్, మిట్టీకే ఖిలోనే, నావ్, షికాయత్
1949 – బాలమ్, బాజార్, దిల్‌కీ బస్తీ, పతంగ, సునహారే దిన్
1950 – డోల్తీ నయ్యా, కామోష్‌సిపాహి, ఖేల్, మగ్రూర్, సంగీత, షీష్‌మహల్
1951 – బిక్రీమోతీ, దామన్, గుమస్తా, పూలోంకి హార్
1952 – హైదరాబాద్‌కీ నాజ్‌నీన్
1953 – ఆనంద్‌భవన్ దారా
1954 – కైబర్, మస్తానా, మంగూ, మీర్జాగాలిబ్, రిస్తా
1955- మదుర్ మిలన్, సర్దార్
1956- దుర్గేష్ నందిని తనఖ్వా
1957- రాజా విక్రమ్, షేరేబాగ్దాద్
1958 – దో మస్తానే, లైట్‌హౌస్, యహుబీ
1959 – కమాండర్, తికడ్ అంబాజ్
1960 – మొఘల్-ఏ-ఆజం, షాన్ ఏ హింద్
1961 – సాయా
1967 – నూర్జహాన్
1968 – దో కలియా (తెలుగు తేనె మనసులు రీమేక్)
1969 – మేరే హమ్‌దమ్ మేరే దోస్త్
1970 – పురస్కార్
1972 – బన్నీబిర్జు
సాజ్ (సెన్సార్ కాని చిత్రం).



చేసుకున్నాం. వీరందరి కన్నా ముందుగా 1927లోనే బొంబాయి వెళ్లి మూగసినిమాల్లో నటించిన మనతార ఒకరున్నారు.

(నిగార్ బాల్యం గురించిన విశేషాలు బూర్గుల నరసింగరావు గారితో జరిపిన సంభాషణ ఆధారంగా..)

రెఫరెన్స్ కర్టసీ: హరీష్ రఘువంశీ (గుజరాత్)

– హెచ్.రమేష్‌బాబు,
మొబైల్: 94409 25814
మెయిల్ : hrameshbabu5@gmail.com

ద

# జల్లికట్టు స్ఫూర్తితో కంబళ

జల్లికట్టుకు అనుకూలంగా ఆర్డినెన్స్ తీసుకురావడంలో తమిళులు విజయం సాధించగా, వారి స్ఫూర్తితో కర్ణాటకలో 'కంబళ' ఉద్యమం ప్రారంభమైంది. నిషేధం తొలగించేలా ఆర్డినెన్స్ తేవాలని రాజకీయ, సినీ ప్రముఖులు డిమాండ్ చేశారు. పలు రాష్ట్రాల్లోనూ ఇలాంటి డిమాండ్లే వస్తున్నాయి. గతంలో నిషేధానికి గురైన తమ సంప్రదాయ క్రీడలను పునరుద్ధరించాలని డిమాండ్లు చేస్తున్నారు. ముఖ్యంగా కర్ణాటకలో 'కంబళ' ఉద్యమానికి సీఎం సహా రాజకీయ, సినీ ప్రముఖులు మద్దతు పలుకుతున్నారు.



కంబళ ఎక్కువగా తీర ప్రాంతాల్లో జరుగుతుంది. దేవుడు తమ పశువులను రోగాల బారిన పడకుండా కాపాడినందుకు కృతజ్ఞతగా ఈ పోటీలు నిర్వహిస్తామని కొన్ని ప్రాంతాల ప్రజలు చెప్తుంటారు. రైతులు నాగలికి రెండు దున్నపోతులను కట్టి బురద పొలంలో పోటీ పడుతారు. ఎవరు తక్కువ సమయంలో అవతలి గట్టుకు చేరుకుంటే వారు గెలిచినట్టు. వీటి నిర్వహణకు ప్రత్యేకంగా 'కంబళ కమిటీ' ఉంటుంది.

ఈ పోటీల సీజన్ నవంబర్‌లో మొదలై మార్చితో ముగుస్తుంటుంది. ఈ పోటీల్లో జంతువులను హింసిస్తున్నారంటూ పెటా, జంతు సంరక్షణ సంఘాలు కోర్టులను ఆశ్రయించగా, 2014లో సుప్రీంకోర్టు కంబళతోపాటు, జలిల్లకట్టుపై నిషేధం విధించింది.

జల్లికట్టు ఆర్డినెన్స్ నేపథ్యంలో కంబళపై నిషేధాన్ని ఎత్తివేయాలని కర్ణాటక రాజకీయ, సినీ ప్రముఖులు గళమెత్తుతున్నారు.

మహారాష్ట్రలో నిషేధంలో ఉన్న ఎడ్లబండి పోటీలను పునరుద్ధరించడానికి సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం న్యాయ సలహా తీసుకోవాలని నిర్ణయించింది. అసోంలో మాఘ్ బిహు ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఎడ్ల పందేలపై 2015లో ఆ రాష్ట్ర హైకోర్టు నిషేధం విధించింది. ఈ క్రీడను పునరుద్ధరించాలని 'హయగ్రిబ్ మధాబ్' దేవస్థానం పండితుడు శివప్రసాద్ వర్మ డిమాండ్ చేస్తున్నారు.

ద

# కలెబడె కవి అలిశెట్టి

కవులు, రచయితలు, కళాకారుల్ని బతికున్నప్పుడు ఏమాత్రం పట్టించుకోకుండా చనిపోయిన తర్వాత మాత్రమే గౌరవించడమనేది ఇవ్వాళ తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాన్ని పట్టిపీడిస్తున్న జాడ్యం. సరే కనీసం చనిపోయిన తర్వాతైనా పట్టించుకుంటున్నారన్నది కొంత సంతృప్తి ఇచ్చే విషయం. అయితే ఈ పనిని వారి మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు మాత్రమే ఎక్కువగా చేస్తున్నారు. కానీ కవి, రచయిత తాను జీవితకాలం ఏదైతే సంస్థతో అసోసియేట్ అయి వున్నాడో ఆ సంస్థలు వాళ్ళని పట్టించుకోవడం లేదు. సమగ్ర రచనలు ప్రచురించకున్నా కనీసం జయంతి, వర్ధంతులు కూడా నిర్వహించడం లేదు. ఇది ఏదో ఒక సంస్థను దృష్టిలో పెట్టుకొని చెబుతున్న విషయం కాదు. అన్ని సంస్థలు అట్లానే ఉన్నాయి. అరసం, విరసం, తెరసం ఏ సంఘమైనా కానివ్వండి అన్నీ అలానే వ్యవహరిస్తున్నాయి. బాధ్యతగా భావించి గౌరవించాల్సిన ప్రభుత్వాలు ఈ విషయంలో 'సెలిక్టివ్'గా వ్యవహరిస్తున్నాయి. 63వ జయంతి, 24వ వర్ధంతిని జరుపుకుంటున్న అలిశెట్టి ప్రభాకర్ కు కూడా ఇది వర్తిస్తుంది.



అభ్యుదయ రచయితల సంఘానికి ఆ యువు పట్టుగా నిలిచి, నడిపించిన తాపీ ధర్మారావు సమగ్ర రచనలు ఇప్పటికీ తెలుగు పాఠకులకు ఒక్క దగ్గర అందుబాటులో లేవు. అలాగే విద్వాన్ విశ్వం రచనలు కూడా సమగ్ర సంపుటాలుగా అందుబాటులో లేవు. ఆళ్వారు స్వామి రచనలూ సమగ్ర సంపుటంగా వెలువడలేదు. (తెలుగు అకాడెమీ ప్రచురించినా ఆ సంపుటం అసమగ్రం). మరోవైపు పొట్లపల్లి రామారావు రచనల్ని భూపాల్ సాయంతో ఆయన కుటుంబసభ్యులు వెలుగులోకి తెచ్చారు. అట్లాగే విప్లవ రచయితల సంఘం స్థాపన నాటి నుంచి చనిపోయే వరకూ దాంట్లో భాగమైన కె.వి.రమణారెడ్డి రచనల్ని ఆయన కుటుంబసభ్యులు వరుసగా ప్రచురిస్తున్నారు. అయితే అలిశెట్టి ప్రభాకర్ రచనల్ని సమగ్ర సంకలనంగా ఆయన మిత్రులు నర్సన్, నిజాం వెంకటేశం, జయధీర్ తిరుమలరావు తదితరులు పూనుకొని వెలువరించారు. ఇందులో ఇంకా సిటీలైఫ్‌లో భాగంగా వెలువడ్డ కొన్ని కవితలు జోడించాల్సి ఉంది.

సేవ చేసిన సంస్థలు పట్టించుకోకపోవడమనేది ఇవ్వాళ కొత్తగా జరుగుతున్నది కాదు. ఆది నుంచి ఈ తంతు ఇలాగే కొనసాగుతోంది. 1953కు ముందు హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ రచయితల సంఘం ఏర్పడింది. దీని ద్వారా ఎక్కువగా సంస్థ బాధ్యులైన దాశరథి, నారాయణరెడ్డిల స్వీయ ప్రచురణలే ప్రచురితమయ్యాయి. సురవరం ప్రతాపరెడ్డి లాంటి వారి రచనలు వీళ్లు వెలువరించలేదు. దీని వల్ల ఆయన రచనలు సమగ్రంగా అందుబాటులో లేకుండా పోయాయి. సంఘాల తరపున దాని బాధ్యుల స్వీయ రచనలు అప్పుడూ వెలువడ్డాయి. ఇప్పుడూ ఇబ్బడి ముబ్బడిగా వెలువడుతున్నాయి. అయితే తెలుగు సాహిత్యానికి చిరస్మరణీయమైన సేవ చేసినట్టి వెలుగుల రచనలన్నీ ఒక్క దగ్గర లేకపోవడం మూలంగా సాహిత్య చరిత్రకూ, సాహితీవేత్తలకు, సృజనకారులకు అన్యాయం జరుగుతోంది. న్యాయంగా, హక్కుగా దక్కాల్సిన గౌరవం నుంచి వాళ్ళు వంచితులవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరపున కొంతమంది విస్మృతుల్ని, వారి రచనల్ని పాఠ్యపుస్తకాల్లో జోడించాలని ప్రయత్నించినపుడు అవి అందుబాటులో లేవు. దీని వల్ల వారి గురించి తెలుసుకునే అవకాశాన్ని కోల్పోయాం. అయితే అలిశెట్టి రచనలన్నీ ఒక్క దగ్గర ఉండడం మూలంగానే ఆయన రచనని పాఠ్యాంశంగా నిర్ణయించడానికి వీలయింది. నిజానికి అలిశెట్టి ప్రభాకర్ 1993లో చనిపోతే 2013 వరకూ ఏ సంస్థా ఆయన మీద సభలు, సమావేశాలు నిర్వహించ లేదు. విప్లవ రచయితల సంఘం ఆయన మరణానంతరం 'మరణం నా చివరి చరణం కాదూ' పేరిట చిన్న కవితా సంపుటిని వెలువరించింది. అయితే నర్సన్, నిజాం వెంకటే శం, దాసరి నాగభూషణం, వి.సామ్రాట్ అశోక్, గుండేటి గంగాధర్ ఇంకొంతమంది 2012 జన వరిలో అలిశెట్టి ప్రభాకర్ సంస్మరణ పెట్టే వరకు లబ్ధప్రతిష్టులైన ఆయన మిత్రులెవరికీ ఆయన స్మ రణలో లేడు. బతికున్నప్పుడంటే తమకు పోటీ అవుతాడు కాబట్టి అలిశెట్టిని విస్మరించారు కావొచ్చు. కానీ చనిపోయాక...అదీ 20 ఏండ్ల వరకూ ఆయన రచనలేవీ అందుబాటులో లేవు అంటే అలి శెట్టిని కవిగా ఖతం చేయడమే! ఇదే కాలంలో శ్రీశ్రీ రచనలు సమగ్ర సంపుటాలుగా విరసం, మనసు ఫౌండేషన్ వాళ్ళు ప్రచురించారు. అట్లాగే ఇప్పటికీ ఎవరో ఒకరు మహాప్రస్థానం ప్రచురిస్తూనే ఉన్నారు. 'కవి' అనే రెండక్షరాలతో ఇద్దరినీ పోల్చడం కాదు గానీ అలిశెట్టి కవిత్వం ఒక్కసారి చదివితే చాలు నిద్రాణంగా ఉన్నవాణ్ని సైతం నినాదమై మేల్కొలుపుతుంది.

ఈ మేల్కొలుపు కవిత్వానికి పునాది జగిత్యాలలో పడింది. అలిశెట్టి 1974 నుంచి కవిత్వం రాస్తున్నా, 1978 జగిత్యాల జైత్రయాత్రలో ఔట్‌సైడర్‌గానే ఉన్నడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ కవుల రచనలు అతి తక్కువగా పత్రికల్లో ప్రచురితమయ్యేవి. అడపా దడపా దాశరథి, సి.నారాయణరెడ్డిల రచనలు పత్రికల్లో అచ్చయ్యేవి. అయితే ఈ స్థితిని అధిగమించేందుకు తెలం

గాణలో కొంత ప్రయత్నం అన్ని జిల్లాల్లో జరిగింది. దీంట్లో భాగంగా జగిత్యాల కేంద్రంగా బి.నర్సన్, గంగాధర్, ధరన్ బాబులు స్వయంగా కవితా సంకలనాలు తీసుకురావాలని సంకల్పించారు. అందుకే తామే సొంతంగా వివిధ ప్రాంతాల్లోని కవులకు ఒక వేదికగా 'సాహితీ మిత్ర దీప్తి' ని ఏర్పాటు చేసింర్రు. దీని ద్వారా ఐదు కవితా సంపుటాలు వెలువరించింర్రు. ఈ కవితా సంపుటాల ప్రచురణ, సాహితీ మిత్ర దీప్తి దోస్తానా అలిశెట్టిని కవిగా నిలబెట్టింది. అందుకు ఆయన ఎదిగొచ్చిన సమాజం, ఎదుర్కొన్న ఒడిదొడుకులు పాఠాలను నేర్పాయి.

నిజానికి 1970ల నుంచే దొరలు, భూస్వాములు నక్సలైట్ ఉద్యమానికన్నా ముందే తమ పిల్లల చదువుల కోసం గ్రామాల నుంచి పట్టణాల బాట పట్టింర్రు. దాదాపు ఇదే సమయంలో అప్పటికే పట్టణ ప్రాంతాల్లోని బీసీలు మొదటిసారిగా టీచర్, క్లర్క్ లాంటి చిన్న చిన్న ఉద్యోగాల్లో చేరింర్రు. అట్లాగే ఉత్తర తెలంగాణలోని రైలు ట్రాక్ వెంబడి ఉన్న పట్టణాల నుంచి సింగరేణికి వలసలు పెరిగినయి. ఈ కాలంలోనే అలిశెట్టి ప్రభాకర్ తండ్రి టీచర్‌గా పనిచేసేవాడు. ఆయన అలిశెట్టికి 15 ఏండ్ల వయస్సున్న పుడు చనిపోయిండు. అప్పటి నుంచి తల్లీ అన్నీ తానే అయి పెంచింది. నిజానికి అప్పటికీ ఇప్పటికీ జగిత్యాలలో పద్మశాలీలది పెద్ద జనాభా. ఎక్కువ మందికి బీడీల్జేసుడే వృత్తి. ఈ దశలో తాను పుట్టినప్పటినుంచి ఉన్న పట్టణానికి చుట్టుపక్కల గ్రామల నుంచి వలసొచ్చిన దొరలు, వాళ్ళ కొడుకుల దబాయింపు, అజమాయిషీని, ఆధిపత్యాన్ని జీర్ణించుకోలేక ప్రతిఘటించేవాడు. వాళ్ళ విచ్చల విడితనం కూడా అలిశెట్టిని కదిలించింది. పిట్టపిల్ల కాయమైనా భౌతికంగా దాడిచేయడానికి కూడా వెనుకాడేవాడు. అందుకే అలిశెట్టి కవిత 'రక్తరేఖ' లో ఇలా సాగుతుంది.

> సమాజాన్ని శస్త్ర చికిత్స చేసేందుకు ఇన్‌స్ట్రుమెంట్లుగా ఇచ్చిండు. గుండె లోతుల్లోకి వెళ్ళి ఛిద్రమౌతున్న సమాజాన్ని, అడుగంటుతున్న మానవీయ విలువల్ని హృదయంతో చూసిండు. రక్తంతో రాసిండు.

**"నువ్వు ఉరిమి చూసినప్పుడు ఊరంతా పాలేర్లే**

**వాళ్ళే ఊరినించి తరిమికొడితే నీ బ్రతుకంతా పల్లేర్లే"** అని దొరలను హెచ్చరించిండు. అలాగే నిరుద్యోగం గురించి.."పుస్తకం లోంచి దులిపేసిన అక్షరాల్లా లక్షలకి లక్షలు దేశమంతా నిరుద్యోగులై నిండుకున్నారు" అన్నడు. కవిత్వంలో రాజకీయాన్ని చీల్చి చెండాడిండు. తెలుగులో ఇంత పదునుగా రాజకీయ-కవిత్వం అల్లినవాళ్ళు అరుదు.

**"జలగలూ' 'బ్రహ్మ'జెముళ్ళూ**
**అవకాశవాది 'రూలుకర్ర'**
**'ఆరణాల కూలీ'**
**'పునాది'లేని 'భవనం' నాచారం 'సన్యాసులూ'**
**వరుసగా ఎవరెవరు ముఖ్యమంత్రులైనా**
**ఇరవైనాలుగ్గంటల కుర్ర**
**ఇంకొకడ్ని ప్రమాణ స్వీకారం చేయించినా-**
**అక్షరాలా అరాచకంలో మార్పుండదు"** అని అంజయ్య, చెన్నారెడ్డి, ఎన్టీఆర్, నాదెండ్ల ఇలా ఆనాటి ముఖ్యమంత్రుల ముసుగుల్ని తొలగించిండు. వాళ్ళ అరాచకాల్ని చిత్రికగట్టిండు.

జగిత్యాలలో ఉన్న సమయంలో అలిశెట్టి కవితలు రాయడం, పోస్టు చెయ్యడమే పనిగా పెట్టుకున్నడు. తాను అనుభవించిన పేదరికం, దగ్గర నుండి చూసిన అణగారిన వర్గాల వెతలే అక్షరాలుగా తెలుగు నేలంతా అలికిండు. ఆ పంట నుంచి ఒక్కసారైనా బువ్వ తినని కవులు లేరంటే అతిశయోక్తి కాదు. తన కవిత్వంలో మహిళల పట్ల ప్రేమ, ఆర్తిని కలగలిపిండు. దళిత, ముస్లిం, చేనేత, గౌడ బతుకుల వెతలను రాసిండు. రైతు, కార్మికుడు, విద్యార్థి, ఇలా అందరి గురించీ రాసిండు. నిత్య చైతన్యంతో ఎదిగి వచ్చిన ఒక తరానికి తన రాజకీయ కవిత్వాన్ని సమాజాన్ని శస్త్ర చికిత్స చేసేందుకు ఇన్‌స్ట్రుమెంట్లుగా ఇచ్చిండు. గుండె లోతుల్లోకి వెళ్ళి ఛిద్రమౌతున్న సమాజాన్ని, అడుగంటుతున్న మానవీయ విలువల్ని హృదయంతో చూసిండు. రక్తంతో రాసిండు.

అందుకే కవిత్వమంటే ఏమిటో తాను 1978లో ప్రకటించిన తొలి కవితా సంకలనం 'ఎర్రపావురాలు' లో

**"నా గుప్పిట్లో మండుతూన్న ఎన్నో గుండెలు...**

**ఒక్కొక్కదాన్లో దూరి, వాటిని చీరి, రక్తాశ్రువులు ఏరి**

**పరిశీలిస్తాను నేను''** అన్నాడు.

**"వర్తమానానికి భవితవ్యానికీ నడుమ// ప్రగతి వంతెన కట్టాలని అనుక్షణం// పరితపిస్తున్నాను"** అని రాసిండు.

పేదరికం, ఆకలితో సహవాసం చేయడాన్ని అలవాటు చేసుకున్నడు. నిరుద్యోగం, నగర జీవితం గురించి రాసిండు. మెజారిటీ ప్రజల బాధలూ గాధలే తన కవిత్వానికి ముడి సరుకని చెప్పుకున్నడు. 'గొర్రెల మందతో నడిచేకంటే.. చీమల బారులో చేరితే మేలు' అనే సోయున్నవాడు. 'కవిత్వం, జీవితం' రెండూ వేర్వేరు కావని కవమనమల్లినవాడు. భావజాల వ్యాప్తికన్నా బాధితుల గుండె చప్పుడు వినిపించడానికే ఎక్కువ ఇష్టపడ్డడు. ఆఖరి వరకూ ఆత్మాభిమానంతో ఉన్నడు. అందుకే

**"చితికి... చితికి... చివరికి**
**పత్రిక పారితోషికమే జీవనాధారంగా**
**స్వీకరిస్తున్న నేపథ్యంలో**
**హృదయం విప్పి నన్నీ నాలుగు మాటలు**
**చెప్పుకోనివ్వండీ"**అని రాసిండు.
**సామాజిక స్పృహ ఉన్నవాడు కాబట్టే**
**"గడ్డ కట్టిన కారంచేడు నెత్తుటి మడుగులో**
**అగ్రవర్ణాల అహంకారపు గొడ్డళ్ళు మునిగి**
**ఉపరితలమ్మీద**
**ఆరుగురి హరిజనుల శిరస్సులు మొలిచి**

**హాహాకారాలు చేస్తుంటాయ్"** అన్నడు.

అలిశెట్టి ప్రభాకర్ అర్ధాంతరంగా ప్రయాణం ముగించినా... ఆయన వేసిన దార్లు ఇంకా కొత్తగానే ఉన్నాయి. ఈ దారుల్లో కొంతమంది 'టేక్ డైవర్షన్' అని కొత్తగా బోర్డులు పెట్టి తప్పుదోవ పట్టిస్తున్నవారూ ఉన్నరు. నిజానికి ఆయన గ్రామాల నుంచి నగ రానికి దారులు వేసిండు. అక్షరాల్లో 'సిటీ లైఫ్'ని చిత్రించిండు. అన్యాయం ఎక్కడ కనబడ్డా అక్షరాలనే గొడ్డళ్ళుగా తయారు చేసి వాడిండు. ఇవ్వాళ ఆయన్ని, ఆయన రచనల్ని ఆలింగనం చేసుకునే సంస్థల బాధ్యులూ ఎన్నడూ అలిశెట్టి కుటుంబం గురించి ఆలో చించలేదు. 1993లోనే కొంతమంది తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ మిత్రులం ఆనాటి తెలుగు యూనివర్సిటీ వీసీ సి.నారాయణరెడ్డి మీద ఒత్తిడి తెచ్చి అలిశెట్టి అర్ధాంగి భాగ్యకు అటెండర్ ఉద్యోగమైనా ఇప్పించాం. ఇన్నేండ్లూ కంటిజెన్సీగానే కొనసాగుతున్న ఆమెను తెలంగాణ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి, ఉండేందుకు ఇంత నీడ కల్పించాల్సిన అవసరమున్నది.

**– సంగిశెట్టి శ్రీనివాస్,**
**మొబైల్:** 98492 20321
**మెయిల్:** sangishettysrinivas@gmail.com

# అన్యాయాన్ని ఎదిరించిన 'అలిశెట్టి' అక్షరం

## 'అలిశెట్టికి అక్షరాంజలి' సభలో వారాల ఆనంద్, పి.ఎస్.రవీంద్ర

**ఆ**కలిని, స్త్రీల అంతర్వేదనలను చిత్రిక పట్టి, భయాన్నివ ఈడి, సహృదయపూరిత వివేకంతో అలిశెట్టి కవిత్వాన్ని అధ్యయనం చేయాల్సిన బాధ్యత నేటి సమాజానికుందని అలిశెట్టితో కలిసి కవి త్వం రాసిన ప్రముఖ కవులు వారాల ఆనంద్, పి.ఎస్. రవీంద్ర అన్నారు.

జనవరి 8న తెలంగాణ రచం యితల సంఘం, కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక పార్యరడైజ్ పాఠశాలలో నిర్వహించిన 'అలిశెట్టికి అక్షరాంజలి' కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



అలిశెట్టి ప్రభాకర్‌కు నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రక్తాశ్రువులను కారుణ్యంతో లిఖించి, కుంచెను, కెమెరాను, కలాన్ని ముప్పేటలా సమాజోప యోగానికి అంకితం చేసిన దార్శనిక కవి అలిశెట్టి అన్నారు.

కష్టజీవుల పట్ల ఆలోచించి ఆఖరి శ్వాస దాకా పోరాడిన కలం యోధుడన్నారు. అక్షర సూర్యునిగా భాసిల్లి, తెలంగాణ సాహితీ జగత్తుకు ప్రాణం పోసిన యోధుడు అలిశెట్టి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కలువకుండీ రామకృష్ణా సభాధ్యక్షత వహించారు.

తె.ర.సం. ప్రధాన కార్య దర్శి, కొత్త అనిల్ కుమార్, సాహితీ గౌతమి అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి, ప్రధాన కార్యదర్శి గాజుల రవీందర్, తెలంగాణ రచయితల సంఘం కోశా ధికారి గుర్రాల మాధవ్, మెరుగు ప్ర వీణ్, ప్యారడైజ్ సంస్థల చైర్మన్ ఫా తిమారెడ్డి, గంప ఉమాపతి, శ్రీకాంత్, ఇస్రత్ సుల్తానా, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భాషా దీపం దేవులపల్లి రామానుజరావు

**తె**లంగాణ భాష, సంస్కృతీ, సంప్రదాయాలకు ముప్పు వాటిల్లుతు న్న సమయంలో ఎదురొడ్డి నిలిచిన మహానుభావులలో దేవులపల్లి రామా నుజరావు ఒకరని వక్తలు అన్నా రు. మహబూబ్‌నగర్ లోని జడ్పీ సమావేశ మందిరంలో జనవరి 29న దేవులపల్లి రామానుజరావు శతజయంతి వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లా డుతూ తెలంగాణ భాష నిజాం కాలంలో నిరాదారణకు గురవుతున్న తరుణంలో దేవులపల్లి



రామానుజ రావు తన కలంతో నిజాం ప్రభుత్వం పై దండెత్తార న్నారు. వల్లపురెడ్డి మనోహర్‌రెడ్డి, బుర్రి వెంకట్రాంరెడ్డి ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య మసన చెన్నప్ప, మంత్రి రామారావు, గిరిజా మనోహర్‌బాబు, పల్లెర్ల రాంమోహన్ రావు,డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్,డాక్టర్ గుంటిగోపి,కట్టా గిరిజారమణ శర్మ జలజం సత్యనారాయణ, కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి ,డాక్టర్ జె.విజయ్‌కుమార్‌జీ, బాదేపల్లి వెం కటయ్య, డాక్టర్ అగ్రహారం చందోజీరావు, డాక్టర్ బడుగుల వనిత, పరిషత్ కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, కమలేకర శ్యాం ప్రసాద్‌రావు, గోపినాథ్ రాథోడ్ పాల్గొన్నారు.

# కాలం కన్నుల్లోంచి రాలిన సిరాచుక్కలు

తెలుగు సాహిత్య చరిత్రలో 1980వ దశకం కీలకమైన దశగా విమర్శక, పరిశోధకులు గుర్తించారు. సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ అనేక అస్తిత్వ వాదాలు, ధోరణలు ఉద్యమరూపంలో వెలువడినాయి. సరిగ్గా ఆ 80వ దశాబ్ది కాలంలో రాసిన రచనల సమాహారమే ప్రొ॥ కట్టా ముత్యంరెడ్డి "కాలం కన్నుల్లోంచి.." గ్రంథం. ప్రొ॥ ముత్యంరెడ్డి విశ్వవిద్యాలయ ఉత్తమ ఆచార్యులుగా, పాలనాదక్షులుగా, సామాజిక, రాజకీయ అంశాలపై సునిశితమైన విశ్లేషకులుగా, సహృదయుడిగా, బలమైన తాత్విక సిద్ధాంత చర్చలు చేసే తెలంగాణావాదిగా అందరికి తెలిసిన ముత్యం ఈ గ్రంథంలో సాహిత్యకారుడిగా కనిపించడం విశేషం. 'నవోదయ' సాహితీ సాంస్కృతిక సంస్థ సభ్యుడిగా, 'జీవనాడి' మాసపత్రిక పాఠకుడిగా వున్న ముత్యంరెడ్డి అనివార్య పరిస్థితుల్లో రచయితగా మారవలసి వచ్చింది. ఆ క్రమంలో పాటలు, కథలు, నాటకం, బుర్రకథ, వ్యాసాలుగా మొత్తం అయిదు ప్రక్రియల్లో రచనలు చేసారు. 1970-80ల నాటి ఉద్యమావేశాలు, ఉద్విగ్న పరిస్థితులు, ఆధిపత్యానికి వ్యతిరేక ధిక్కార స్వరాలు, ప్రజాస్వామిక హక్కుల పోరాటాలు, ఆందోళనలు, సంఘీభావ సదస్సులు మొత్తంగా ఒక సాంస్కృతిక, సాహిత్య కళారూపంగా ఈ గ్రంథం మనకు అనుభూతినిస్తుంది. ఇందులోని పాటలపై నిఖిలేశ్వర్, కథలపై డా.ఎస్.రఘు, నాటకంపై డా. ఎస్. జతిన్‌కుమార్, బుర్రకథపై ఉ.సా, వ్యాసాలపై చుక్కారామయ్యగార్లు విలువైన అభిప్రాయాలు ఉన్నాయి. ఈ పుస్తకంలోని 1974 లో రాసిన 'గైరాను భూమి', పాడెనుక కథలను మాత్రమే ఒకసారి పరామర్శిద్దాం. ఈ కథల ద్వారానే ఈ గ్రంథం ప్రాధాన్యత కొంత అర్థమవుతుంది.




'గైరాను భూమి', 'పాడెనుక...' ఈ రెండు కథలను చదివాక కథా శిల్ప నిర్మాణ వ్యూహాల పద్ధతిలో చదవకూడదనిపించింది. రచయిత సామాజిక, రాజకీయ కార్యాచరణ వేదిక మీది నుండి కథాంతరంగంలోకి ప్రవేశిస్తేగాని ఈ కథలు అర్థం కావు. 1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రోద్యమంలో చురుకైన కార్యకర్తగా పాల్గొన్న ముత్యంరెడ్డిగారి ఆలోచనల భావధార ఎంత లోతుగా ప్రవహించిందో ఈ కథలను చదివితే అర్థమవుతుంది. తెలంగాణ జీవన చిత్రమంతా పల్లెలోనే కనిపిస్తుంది. అటువంటి పల్లెల మూలాల్లోకి వెళ్ళివచ్చిన ముత్యంరెడ్డి మనిషితనం ఈ కథల్లో ఆవిష్కృతమైంది. నిరుపయోగంగా ఉన్న 'గైరాను భూమి'ని తన కథన రంగంగా మార్చుకుని గ్రామ రాజకీయాల్లోని కుట్రలను, కుతంత్రాలను కనులకు కట్టినట్లుగా వర్ణిస్తూ తెలంగాణ జనాన్ని జాగృతం చేసారు. పోరాట చైతన్యాన్ని, ధిక్కార స్వరాన్ని ఆ రోజుల్లోనే ఇంత బలంగా వినిపించిన రచయిత మరిన్ని కథలు ఎందుకు రాయలేదనే అసంతృప్తి మనల్ని వెంటాడుతుంది. గైరాను భూమి కథలో గ్రామపెద్దల స్వభావాల్ని పరిచయం చేసిన తీరు. రచయితలో దాగిన మనోవిశ్లేషకుడు కనిపిస్తాడు. గ్రామాల్లోని బడి, గుడి రాజకీయ సమీకరణాలకు కేంద్రంగా ఏ విధంగా మలచుకుంటారో ఈ కథ స్ఫురిస్తుంది. కాలం మారిపోయినా ఇంకా ఫ్యూడల్ భావజాలం మనల్ని వెంటాడుతూనే ఉందన్న సత్యం స్ఫురిస్తుంది.

నూరెకరాల గైరాను భూమిని సాగు చేసుకుని పొట్ట నింపుకునే హక్కు కోసం ఒక చిన్న పల్లెలో యువజన సంఘం చేసిన పోరాటం మామూలు విషయం కాదు. రచయిత ఈ ఇతివృత్తాన్ని ఎన్నుకోవడంలోనే గొప్ప సాహసం చేశారు. ఒక రాజకీయ, ఆర్థిక సిద్ధాంతాన్ని శక్తివంతంగా కథగా మలచుకోవడానికి రచయిత చేసిన పాత్రోచితవాదనలు ఆనాటి సమాజానికి దిశానిర్దేశాన్ని సూచిస్తుంది. రచయిత లక్ష్యం కూడా అదే. గ్రామ పెద్దల ఆధిపత్యాన్ని అడ్డుకొని గైరానుభూమిని సాగు చేయడానికి ఊరి ప్రజలందరు ఒక్కటై కదలిరావడం సహజంగా అనిపిస్తుంది. 'రండి అయ్యమ్మలారా - కదలిరండి రండీ అక్కన్నలారా' అంటూ జనమంతా పాట పాడుకుంటూ కదలడంతో ఇక్కడ కథ ముగుస్తుంది. కానీ, తెలంగాణలో అసలు కథ ఇక్కడి నుంచే ప్రారంభమయింది. తెలంగాణ జీవితంలో పాట, పోరాటం ఎంతగా పెనవేసుకపోయాయో ఈ కథ ద్వారా నిరూపితమవుతుంది.

'పాడె ఎనుక' కథ విషాద వేదనామయ వాస్తవ గాథ, పల్లెలో నెలకొన్న కరువు తీవ్రతను, రెక్కల కష్టంపై ఆధారపడి బతికేవాళ్ళ దుస్థితిని మనసు కదిలి చెదిరిపోయేలా చిత్రించారు రచయిత. కన్న పిల్లల ఆకలి తీర్చలేని తల్లి ఆవేదనను మనమూ అనుభవిస్తాం. నూకలు నమిలితే పిడచగట్టిన గొంతులో కలిగిన బాధ మనకు కలుగుతుంది. మంచినీళ్ళతోనయినా పిల్లల ఆకలి తీరుద్దామని దిగుడు బావికి వెళ్ళిన తల్లి సత్తువ లేక బావిలోకి జారిపడి చనిపోయింది. ఇక్కడ జారిపడింది పాలనావ్యవస్థ. జారిపడవలసింది ఆధిపత్యపు వ్యవస్థ.

ఒక తల్లి మరణం వెనక ఉన్న వాస్తవ బతుకు వెతలను, సంక్షోభాలను, కరువు తీవ్రతను కథగా కాకుండా వెంటాడే వ్యథగా వినిపించారు ముత్యంరెడ్డి. కథలో పొంగిన దుఃఖం మనల్ని తడిపేస్తుంది. ఈ రెండు కథలు బతుకులోని అనుకూల, ప్రతికూల

**తెలుగు కథా ప్రపంచంలో ఒక చారిత్రక తప్పిదం జరిగిపోయింది. ఈ కథల్లోని వర్ణనలు, వాతావరణం రచయిత శిల్పనైపుణ్యానికి నిదర్శనాలు. 'గైరాను భూమి'లో జనమంతా వానకోసం ఆకలిగొన్న వాళ్ళలా ఆకాశం వైపు చూస్తున్న దృశ్యాన్ని అద్భుతంగా వర్ణిస్తారు. 'మృగశిర కార్తె, చిమ్మనచీకటి, చీకటితో పాటు చుట్టూ చల్లదనమావరిస్తోంది. ఇంతలో పెద్దగాలి దుమారం వార్తాహరుడిలా వర్షపు వార్తనెత్తుకొచ్చింది. ఆకాశం నల్లటి మేఘాలతో తొమ్మిది నెలల గర్భవతిలా ఉంది. స్త్రీ ప్రసవ వేదననుభవిస్తుంటే మంత్రసాని దగ్గరికి పరుగెత్తినట్టు యువజన సంఘం సభ్యులు ఇంటింటికి పరుగెత్తి వర్షం పడుతుంది?.. అని చెప్పే సంబూరాన్ని చెప్పడంలో ఆనందం పాత్రలదే కాదు. రచయిత ది కూడా.**

ధోరణులను చూపెడుతూ తీవ్ర సంఘర్షణకు గురిచేస్తాయి.

ముత్యంరెడ్డిగారుఈ రెండు కథలతో ఆగిపోకుండా నిరంత రాయంగా రాసుకుంటే పోతే తెలుగు కథకు ఒక మంచి కథకుడు దొరికేవాడు అనుకుంటా. తెలుగు కథా ప్రపంచంలో ఒక చారిత్రక తప్పిదం జరిగిపోయింది. ఈ కథల్లోని వర్ణనలు, వాతావరణం రచయిత శిల్పనైపుణ్యానికి నిదర్శనాలు. 'గైరాను భూమి'లో జనమంతా వానకోసం ఆకలిగొన్న వాళ్ళలా ఆకాశం వైపు చూస్తున్న దృశ్యాన్ని అద్భుతంగా వర్ణిస్తారు. 'మృగశిర కార్తె, చిమ్మనచీకటి, చీకటితో పాటు చుట్టూ చల్లదనమావరిస్తోంది. ఇంతలో పెద్దగాలి దుమారం వార్తాహరుడిలా వర్షపు వార్తనెత్తుకొచ్చింది. ఆకాశం నల్లటి మేఘాలతో తొమ్మిది నెలల గర్భవతిలా ఉంది. స్త్రీ ప్రసవ వేదననుభవిస్తుంటే మంత్రసాని దగ్గరికి పరుగెత్తినట్టు యువజన సంఘం సభ్యులు ఇంటింటికి పరుగెత్తి వర్షం పడుతుంది?.. అని చెప్పే సంబూరాన్ని చెప్పడంలో ఆనందం పాత్రలదే కాదు. రచయిత ది కూడా. గాలి దుమారం ఎక్కువయి చెట్లు కూకటివేళ్ళతో కూలి పోతున్న విషయాన్ని తెలపడంలో తరతరాలుగా భూస్వాముల, దొరల దోపిడీ, దౌర్జన్యాలు కూకటివేళ్ళ తో తొలగిపోవాలనే ధ్వనిని ప్రతీకాత్మకంగా వినిపించడం ఔచిత్యవంతంగా ఉంది. ఇలాంటి వ్యక్తీకరణలు చాలా చోట్ల కథానుగుణంగా కనిపిస్తూ ఆసక్తిని రేకెత్తి స్తాయి. 'పాడెఎనుక..' కథలోని మృత్యువు, దేవుడు సంబంధించి గ్రామప్రజలు మాట్లాడుకునే మాటలు రచయితలోని వేదాంత జ్ఞానాన్ని, తాత్విక జీవనలోతుల్ని తెలుపుతాయి.

ఈ కథల్లోని తెలంగాణ భాష జీవశ్శక్తిని నింపుకుని అస్తిత్వ చైతన్యంతో తొణికిసలాడుతూ భావసాంద్రతను, కథన గాంభీర్యాన్ని అందిస్తుంది. సహజమైన తెలంగాణ భాషావ్యక్తీకరణ శైలి అల వోకగా ప్రయోగిస్తూ కథకు కొత్త సౌందర్యాన్ని తీసుకువచ్చారు. తెలంగాణ పలుకుబడిని శక్తివంతమైన ఆయుధంగా మార్చుకుని ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసిన కథకుడిగా కనిపించారు ముత్యం రెడ్డి. ఈ బాటలోనే నడిస్తే తెలుగు కథకు డా. పి. యశోదా రెడ్డి లాంటి ఉత్తమ వారసుడు లభించేవాడేమో. జీవద్భాషలో వచ్చిన ఈ రెండు కథలు తెలుగు కథకు కొత్త శక్తిని నిండుదనాన్ని అందించాయి.

ఇలాంటి రచనలే మిగతా ప్రక్రియల్లో ఈ గ్రంథంలో ఉన్నాయి. అవన్నీ అమూల్యమైన మనచరిత్రను ఒకసారి నెమరు వేసుకున్నట్లుగా అనుభూతి కలుగుతుంది. ఈ గ్రంథానికి ముందు మాట రాసిన ప్రముఖ రచయిత్రి ఓల్గా , మిత్రవాక్యం రాసిన అక్కినేని కుటుంబరావుగారి మాటలు ముత్యంరెడ్డిగారిపై మరింత ఆత్మీయతను, గౌరవాన్ని పెంపొందిస్తాయి. పంచభూతా ల్లాగా ముఖ్యమైన ఐదు ప్రక్రియల్లో వెలువరించిన ఈ సారస్వత సర్వస్వం నిజమైన పాఠకులకు ఎంతో ఆలోచనను, ఆనందాన్ని అందిస్తుంది.

**-డా.ఎస్.రఘు**
మొబైల్: 9848208533

పుస్తకం: కాలం కన్నుల్లోంచి..
రచయిత: ప్రొ. కట్టా ముత్యంరెడ్డి
వెల: రూ.150/-
ప్రతులకు: రామయ్య విద్యాపీఠం,
అన్ని పుస్తకాల షాపుల్లో

ద

## పత్రికలు - పరిచయం:

గమనిక: ఈ శీర్షికలను ప్రచురించేందుకు ఆయా పత్రికలు, ప్రత్యేక సంచికల వివరాలను మాకు తెలియ జేయగలరు.

**వ్యవసాయ పాడిపంటలు**
ప్రధాన సంపాదకులు:
డా.ఎం.జగన్ మోహన్




ఫోన్: 040-23383519

**మూసీ (మాసపత్రిక)**
సంపాదకులు :
డా॥ సాగి కమలాకర శర్మ




ఫోన్: 9347971177

**అతిథి (మాసపత్రిక)**
సంపాదకులు:
ఎం. వెంకటేశ్వరరావు




ఫోన్: 98483 81202

**పర్యావరణం (న్యూస్‌లెటర్)**
కో-ఆర్డినేటర్:
డా.ఎం. సునీల




ఫోన్: 040-23180120



ఎ గైడ్ టు ద హెరిటేజ్ ఆఫ్ హైదరాబాద్
రచన: వి. మధు
వెల: రూ.495/-
సేల్స్ సెంటర్: అలహాబాద్, బెంగళూరు, చండీగఢ్, చెన్నై, హైదరాబాద్, జైపూర్, కాఠ్మాండ్, కోల్‌కతా, ముంబై




నిశ్శబ్ద ధ్వని (మినీ కవితా సంపుటి)
రచన: ఆప్కారి సూర్యప్రకాశ్
వెల: రూ.100/-
ప్రచురణ: ఇందూరు భారతి
ప్రతులకు : పి.వి.ఎన్‌క్లేవ్, సమతానగర్, పాత బోయినపల్లి, సికింద్రాబాద్. ఫోన్: 9550993232

---




ధనక్
సినిమా నవలీకరణ: అనుష్కా రవిశంకర్
తెలుగు: కె.సురేశ్ వెల: రూ.70/-
ప్రచురణ: మంచి పుస్తకం
ప్రతులకు: మంచి పుస్తకం, తార్నాక, సికింద్రాబాద్, ఫోన్: 9490746614




రచన: గుప్పిట జారే ఇసుక
ఉర్దూ మూలం: జీలానీ బానూ,
తెలుగు: మెహెక్ హైదరాబాదీ
వెల: రూ.120/-
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

---




రిజర్వేషన్లు (ప్రజాస్వామిక దృక్పథం)
రచన: కె. బాలగోపాల్
వెల: రూ.140/-
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్ ఆర్యసమాజ్ ఎదురు వీధి, కాచిగూడ చౌరస్తా,
ఫోన్: 040- 24652387



ద లాస్ ఆఫ్ యిన్నో సెన్స్ (కథలు)
రచన: కుప్పిలి పద్మ
వెల: రూ.120/-
ప్రచురణ: ముక్త పబ్లికేషన్స్
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్ ఆర్యసమాజ్ ఎదురు వీధి, కాచిగూడ చౌరస్తా, ఫోన్: 90004 13413

---




దళితుల్నెవ్వరూ చంపలేదా?
మూలం: మీనా కందసామి
తెలుగు: నౌడూరి మూర్తి
వెల: రూ.50/- ప్రచురణ: మాతృక
ప్రతులకు: న్యూడెమొక్రసీ కార్యాలయం, 2-1-716 9బి-6, ఎఫ్-4), ఎస్‌విఇఎస్ స్కూలు ఎదురుగా, విద్యానగర్, హైదరాబాద్



భారత సవురు
సంపాదకత్వం: టి. శ్రీరంగస్వామి
వెల: రూ.100/-
ప్రతులకు: శ్రీలేఖ సాహితి, 27-14-53, మండల కార్యాలయం ఎదురుగా, హసన్‌పర్తి, వరంగల్లు.
ఫోన్: 9949857955

---



జనసారథులు
రచన: గడ్డం కేశవమూర్తి
వెల: రూ.200/-
ప్రతులకు: జికెఎం. ఏజెన్సీస్, కుమర్‌పల్లి, హన్మకొండ, వరంగల్.
ఫోన్: 08008794162, 09390101862




ఓ బాలిక డైరీ
మూలం: ఆన్ ఫ్రాంక్ తెలుగు: బీనాదేవి
వెల: రూ.125/- ప్రచురణ: పీకాక్ క్లాసిక్స్,
ప్రతులకు: జీ2, బ్లాక్ నం.6, పంచవటి అపార్ట్‌మెంట్స్, ప్రగతి నగర్, జెఎన్టీయూ ఎదురుగా, హైదరాబాద్. ఫోన్: 040-23894648

---




మా బతుకులు (దళిత స్త్రీ ఆత్మకథ)
బేబీ కాంబ్లే
మరాఠీ నుంచి ఇంగ్లిష్ : మాయపండిట్
తెలుగు అనువాదం: బి. అనూరాధ
వెల: రూ.130/-, ప్రచురణ: మలుపు,
ప్రతులకు: 2-1-1/5, నల్లకుంట, హైదరాబాద్ - 500 044,



కామన్ స్కూల్ కల
అధ్యాపక జ్వాల సంపాదకీయాలు
ప్రచురణ: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్
వెల: రూ.80/-,
ప్రతులకు: 3-4-376/2/1-డి, పై అంతస్థు లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్-500 027

---

ఈ శీర్షికలో ప్రచురించేందుకు కొత్త పుస్తకాలు పంపవలసిన చిరునామా:
"CHANDRAM" 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644 Mobile: 9030626288 E-mail: deccanlandindia@gmail.com







*Photographer :*
**Amita Talwar**

ఫొటోగ్రఫీ రంగంలో
అమితా తల్వార్
పేరు ఎందరికో సుపరిచితం.
దేశమంతటా విస్తృతంగా
పర్యటించి ఆకట్టుకునే
చిత్రాలెన్నో తీశారు.
ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి.
రచయిత, ప్రచురణకర్త,
ఫొటోగ్రాఫర్, ఫిల్మ్‌మేకర్..
ఇంకా మరెన్నో...!

ప్రత్యేక కథనం: 25, 26వ పేజీల్లో...




























DECCAN LAND, Telugu Monthly Magazine 1- February - 2017
Postal Dates: 2nd & 3rd Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Permission, LII/RNP/HD/1167/2015-17

Orient BlackSwan




Orient BlackSwan
**WordMaster**

**WordMaster** is the key to modern English. WordMaster moves beyond words and phrases, to understanding real English and using it appropriately and effectively. WordMaster leads learners from knowing to using, and from words to whole language.

**Key features**

- over 35,000 words, phrases and derivatives from modern English
- meanings in clear simple English, further explained by illustrative sentences
- includes words and phrases which have recently come into use
- guidance on formal and informal usage, with additional guidance on appropriacy, and on attitudes embedded in language
- special guidance-alert on language which is not respectful, taboo language, gender-sensitive words and words which may cause offence
- key words from the sciences, humanities, technology, computers, medicine and the world of business




**Orient BlackSwan**
**Junior English Dictionary**

**Key features**

- over 12000 words and phrases
- hundreds of illustrations, including full colour theme pages
- simple and clear meanings written for children
- natural example sentences drawn from familiar situations
- practical usage notes where necessary
- entries organised to make vocabulary building easy and effective
- grammar information to meet the needs of children
- extra pronunciation help, specially designed for children in South Asia
- an **About This Dictionary** section with guidance for users

Orient Blackswan Private Limited

*Central office:*
3-6-752 Himayatnagar, Hyderabad 500 029
*Phone*: (040) 2766 2849/2850/5447/3514; 27610898, 30903379
*Fax*: (040) 2764 5046
*Email*: centraloffice@orientblackswan.com
*Web*: www.orientblackswan.com

*Regional office:*
3-6-752 Himayatnagar, Hyderabad 500 029
*Phone*: (040) 2766 2849/2850/5447/3514; 30903379
*Fax*: (040) 2764 5046
*Email*: hyderabad@orientblackswan.com
*Web*: www.orientblackswan.com

ARROW FLYING MACHINE ARVIND Raymond

# MEERAA SILK CENTRE

Dealers Arvind Brands :

Mfrs of : Defence, Industrial, Hotel, Institutions, Dressess and Sport Wear

Beside Raymond, Chikkadpally, Hyderabad - 500 020. Email : ssrinivassingh@gmail.com
Ph: 040-27660100, 040-27623100, 9347260100, 9963260100

ogs JUNIORS
grow naturally

*Reconnecting Children with Nature*



Oxford Grammar School
Street No. 13, Himayathnagar,
Hyderabad 500 029.
Phone: 040 2763 6214,
Mobile: +91 99596 12345
Email: ogsjuniorshyd@gmail.com
www.oxfordgrammarschool.com

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar